Published by Telangana
TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

సంపుటి : 01 సంచిక : 262 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ శుక్రవారం17-10-2025 పేజీలు : 12 వెల : 2/-

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

## డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఏపీకి పెట్టుబడులు

-కర్నూలు సభలో ప్రధాని మోదీపై సీఎం చంద్రబాబు ప్రశంసలు



కర్నూల్ ఎన్డీఏ డబుల్ ఇంజన్ సర్కార్ తో ఆంధ్రప్రదేశ్ కు రెట్టింపు ప్రయోజనాలు దక్కుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు వస్తున్నాయని అన్నారు. గురువారం కర్నూలులో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్, బచత్ ఉత్సవ్ బహిరంగ సభలో సీఎం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో దేశ ప్రగతి వేగాన్ని పెంచటంలో ప్రధాని మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారని సీఎం ప్రశంసించారు.

**మోదీ 21వ శతాబ్దపు నేత**

ప్రధాని నరేంద్ర మోదీని '21వ శతాబ్దపు నేత'గా అభివర్ణించిన చంద్రబాబు,

మిగతా 2లో

## నా సమస్యను పరిష్కరిస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారు



-మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన కొండా సురేఖ

-తన విషయంలో జరుగుతున్న పరిణామాలను వారికి తెలిపిన కొండా సురేఖ

-సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారన్న మంత్రి

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లను కలిసి బుధవారం రాత్రి తన ఇంటి వద్దకు పోలీసులు వచ్చిన సమయంలో చోటు చేసుకున్న నాటకీయ పరిణామాలను వారికి వివరించారు. గత కొంతకాలంగా తన విషయంలో జరుగుతున్న అంశాలను

మిగతా 2లో

# పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లండి

- రేవంత్ సర్కార్‌కు సుప్రీం కోర్టు ఆదేశం
-స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత
-50 శాతం పరిమితి దాటవద్దని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం
-పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లవచ్చని ప్రభుత్వానికి సూచన
-హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున జోక్యం చేసుకోలేమని వెల్లడి




న్యూఢిల్లీ తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊహించని షాక్ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతంరిజర్వేషన్లు అమలు చేసేందుకు ఉద్దేశించిన జీవో నంబర్ 9 పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం పాత పద్ధతిలోనే ఎన్నికలకువెళ్లాలని సూచించింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే హైకోర్టులో విచారణ కొనసాగుతున్నందున అవసరమైతే 50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని తెలంగాణ ప్రభుత్వాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. పిటిషన్ వివరాల్లోకి వెళితే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జీవో నంబర్ 9ను జారీ చేసింది. అయితే, ఈ జీవోపై కొందరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించగా, రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని మించి ఉన్నాయని అలాగే సుప్రీంకోర్టు నిర్దేశించిన 'ట్రిపుల్ టెస్ట్' (వెనుకబాటుతనం, జనాభా వివరాలు, 50 శాతం పరిమితి) ప్రమాణాలను పాటించలేదనే కారణంతో హైకోర్టు దీనిపై స్టే విధించింది. హైకోర్టు స్టే కారణంగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది.

హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ జీవో నంబర్ 9 ఆధారంగా స్థానిక ఎన్నికలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ గురువారం వాదనలు వినిపించారు. వాదలను విన్న జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పునరుద్ఘాటిస్తూ 50 శాతం రిజర్వేషన్ల పరిమితికి లోబడి మాత్రమే ఎన్నికలకు వెళ్లాలని సర్వోన్నత న్యాయస్థానం తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై హైకోర్టులో విచారణ జరగుతున్న విషయాన్ని గుర్తు చేసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.



## గుజరాత్ రాజకీయాల్లో కీలక మలుపు

-సీఎం మినహా అందరూ రాజీనామా

గాంధీ నగర్ గుజరాత్‌లో రాజకీయం మారుతోంది. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తప్ప మిగిలిన 16 మంత్రులు తమ పదవుల నుంచి రాజీనామా చేశారు. మంత్రులందర్నీ కొత్త వారిని నియమించనున్నారు. దీపావళి పండుగకు ముందే జరిగే ఈ విస్తరణలో కొత్త ముఖాలు, యువ నాయకులు, ప్రాంతీయ-సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జగదీష్ విశ్వకర్మ సూచనల మేరకు జరిగిన ఈ 'నో రిపీట్' విధానం, 2027 అసెంబ్లీ ఎన్నికలు, లోకల్ బాడీ పోల్స్‌కు ముందుగా పార్టీ బలాన్ని పెంచే ఉద్దేశ్యంతో జరుగుతోంది. గురువారం ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన సమావేశంలో కేంద్ర నాయకత్వ సూచనలు అమలు చేస్తూ, మంత్రులు తమ రాజీనామాలు సమర్పించారు. ముఖ్యమంత్రి పటేల్ ఈ రాజీనామాలు అంగీకరించి, గవర్నర్ అచార్య దేవ్రవ్రత్‌కు అందించారు. ప్రస్తుత మంత్రివర్గం ముఖ్యమంత్రి సహా 17 మందితో ఉన్నారు. గుజరాత్ చరిత్రలో అతి చిన్న మంత్రివర్గంగా ఉంది. 182 సభ్యుల శాసనసభ పరిధిలో 27 మంది వరకు మంత్రులు ఉండవచ్చు. కొత్త మంత్రులు శుక్రవారం రాజ్ భవన్ లో ప్రమాణం చేసే అవకాశం ఉంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జెపీ నడ్డా, యూనియన్ హెూం మంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సీ.ఆర్. పాటిల్, ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ వంటి సీనియర్ నేతలు హాజరవుతారు. నడ్డా గురువారం సాయంత్రం గుజరాత్‌కు చేరుకుని, ముఖ్యమంత్రి, ఇతర నేతలతో సమావేశాలు నిర్వహిస్తారు. ఈ సారి 22 నుంచి 27 మందికి మంత్రులకు

మిగతా 2లో


2లో

## డిసెంబర్ 1 నుండి ప్రజాపాలన ఉత్సవాలు

-మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

## గత ప్రభుత్వం ఏపీని నాశనం చేసింది



-ప్రజలు మెచ్చేలా సుపరిపాలన అందిస్తున్నామన్న చంద్రబాబు
-పాలనలో సుస్థిర విధానాలను అమలు చేస్తామని వెల్లడి
-ఆర్టీజీఎస్, ప్రభుత్వ సేవల్లో సంతృప్త స్థాయిపై సమీక్షలో సీఎం



## కేరళ నర్సు నిమిష ప్రియకు భారీ ఊరట

మరణశిక్ష ఆదేశంలో మార్పు

## ఆశన్నతో పాటు 170 మంది మావోయిస్టులు సరెండర్-


2లో

## జూబ్లీహిల్స్‌లో బోగస్ ఓట్లపై ఇప్పుడేం చేయలేం

-కీలక వ్యాఖ్యలు చేసిన హైకోర్టు



2లో

## 18న బీసీ సంఘాల బంద్‌కు మద్దతు

-బీసీ రిజర్వేషన్లపై తాము వెనక్కి తగ్గేది లేదన్న టీపీసీసీ చీఫ్


2లో

## అమీర్‌పేట వరద కష్టాలకు చెక్

-హైడ్రా ప్రత్యేక ఆపరేషన్



# గత ప్రభుత్వం ఏపీని నాశనం చేసింది

అమరావతి ఆత్మగౌరవం, సంస్కృతికి నిలయం ఆంధ్రప్రదేశ్ అని ప్రధాని మోదీ కర్నూలులో అన్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ సభలో ప్రసంగించారు. గత ప్రభుత్వం ఏపీని నాశనం చేసిందన్నారు. చంద్రబాబు, పవన్ రూపంలో ఏపీకి శక్తివంతమైన నాయకత్వం ఉంది, కేంద్రం నుంచి కూడా సహకారం అందిస్తున్నామన్నారు. 16 నెలల్లో అభివృద్ధి డబుల్ ఇంజిన్‌లా దూసుకుపోతోందని అభివృద్ధికి ఢిల్లీ, అమరావతి కలిసి పనిచేస్తున్నాయన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా నిలుస్తామన్నారు. చంద్రబాబు చెప్పినట్టు 21వ శతాబ్దం భారతావనిదే రోడ్లు, రైల్వేలతో కనెక్టివిటీ పెంచుతున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 16 నెలల్లో ఏపీలో అభివృద్ధి దూసుకుపోతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఏపీని నాశనం చేసింది ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖచిత్రం మారుతుందని పేర్కొన్నారు.

ద్వాదశజ్యోతిర్లింగాలలో మొదటిది గుజరాత్ సోమనాథ్ ఆలయం ఉంది. అక్కడే నేను పుట్టాను. రెండో జ్యోతిర్లింగం శ్రీశైల మల్లిఖార్జున స్వామిది ఇప్పుడు ఇక్కడికి వచ్చి ఆయన ఆశీర్వచనాలు తీసుకున్నాను. ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని కూడా దర్శించి ఆయనకు అల్లమ్మ ప్రభు, అక్కమహాదేవి లాంటి శివభక్తులకు ప్రణామాలు. స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తైన 2047 నాటికి భారత్ వికసిత్ భారత్ గా తయారవుతుంది. 21 వ శతాబ్దం భారత దేశానిది, 140 కోట్ల మంది భారతీయులది అవుతుంది. విద్యుత్, రైల్వే, జాతీయ రహదారులు, రక్షణ రంగాలకు చెందిన చాలా ప్రాజెక్టులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశాం. ఈ ప్రాజెక్టులన్నీ రాష్ట్రంలో కనెక్టివిటి బలోపేతం కావటంతో పాటు పరిశ్రమలను బలోపేతం చేస్తాయన్నారు. ఈ ప్రాజెక్టులతో కర్నూలుతో పాటు పరిసర ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

దేశానికైనా, రాష్ట్రానికైనా ఇంధన భద్రత అవసరం. ప్రస్తుతం 3 వేల కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టులను ప్రారంభించాం తద్వారా దేశ ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బ్లాక్ అవుట్ లాంటి విద్యుత్ సంక్షోభాలు వచ్చాయి, తలసరి విద్యుత్ వినియోగం 1000 యూనిట్ల కంటే తక్కువే ఉంది. చాలా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూడా లేని పరిస్థితి. ఇప్పుడు క్లీన్ ఎనర్జీ నుంచి మన అవసరాలకు తగినంత ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తున్నాం. 1400 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగం ఇప్పుడు దేశంలో ఉంది. తగినంత విద్యుత్ దేశ ప్రజలకు లభ్యం అవుతోందననారు. శ్రీకాకుళం నుంచి ఆంగుల్ వరకూ గ్యాస్ పైప్ లైన్ ను జాతికి అంకితం చేశాం. దేశ ఆర్థిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ఓ కీలక ప్రాంతంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశగా నడుస్తోంది. 20 వేల సిలిండర్ల సామర్థ్యంతో ఇండేన్ బాటిలింగ్ ప్లాంట్‌ను చిత్తూరులో ప్రారంభించామని గుర్తు చేశారు. మల్టీమోడల్ ఇన్ఫ్రా ప్రాజెక్టులతో కనెక్టివిటీ పెంచుతున్నాం. సబ్బవరం నుంచి షీలా నగర్ వరకూ కొత్త హైవేతో కనెక్టివిటీ పెరిగింది. రైల్వే రంగంలో కొత్త యుగం ప్రారంభమైంది, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందేలా ప్రాజెక్టులను ప్రారంభించుకున్నాం. వికసిత్ భారత్ 2047 సాధన సంకల్పానికి స్వర్ణాంధ్ర లక్ష్యం మరింత బలం అందిస్తుంది. డబుల్ ఇంజన్ సర్కార్ ఆంధ్రప్రదేశ్ వేగాన్ని మరింతగా పెంచుతుందన్నారు.

భారత్ దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రగతి వేగాన్ని ప్రపంచం గమనిస్తోంది. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజం ఏపీలో అతిపెద్ద పెట్టుబడిని ప్రకటించింది. దేశపు తొలి అతిపెద్ద ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అమెరికా వెలుపల భారీ పెట్టుబడితో ఏపీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ హబ్ పెడుతున్నట్టు గూగుల్ సీఈఓ చెప్పారు. డేటా సెంటర్,ఫైబర్ ఆప్టిక్ నెట్వర్క్ లాంటి అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఈ కేంద్రంలో ఏర్పాటు కాబోతున్నాయి. ప్రపంచ దేశాలను కలుపుతూ వేయనున్న సబ్ సీ కేబుల్ ద్వారా తూర్పు తీరం బలోపేతం అవుతుందన్నారు.

విశాఖలో ఏర్పాటు కానున్న కనెక్టివిటీ హబ్ భారత్ కే కాదు ప్రపంచానికి సేవలందిస్తుంది సీఎం చంద్రబాబు విజన్ ను అభినందిస్తున్నానన్నారు. దేశ ప్రగతికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చాలా కీలకం ఏపీ అభివృద్ధి చెందాలంటే రాయలసీమ కూడా అభివృద్ధి అంతే అవసరమన్నారు. కర్నూలులో ప్రారంభించిన ప్రాజెక్టులు ఈ ప్రాంత ప్రగతికి సరికొత్త ద్వారాలు తెరుస్తాయి, పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ఏపీ వేగవంతమైన అభివృద్ధి కోసం కొప్పర్తి -ఒర్వకల్ పారిశ్రామిక నోడ్ల ద్వారా వచ్చే పెట్టుబడులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని.. 21వ శతాబ్దపు మాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా ప్రపంచ దేశాలు భారత్ ను చూస్తున్నాయన్నారు. భారత్ లో ఉత్పత్తి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రూపుదిద్దుకుంటోంది ఆత్మనిర్భర్ భారత్ లో ఏపీ కీలకంగా మారిందన్నారు.

# డిసెంబర్ 1 నుండి ప్రజాపాలన ఉత్సవాలు

హైదరాబాద్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన కేబినెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇద్దరు పిల్లలకు మించి సంతానమున్న వారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనపై మంత్రివర్గం పునరాలోచన చేసింది. రాష్ట్రంలో జనాభా నియంత్రణ కట్టుదిట్టంగా అమలవుతున్న తరుణంలో ఈ గరిష్ఠ నిబంధనను అమలు చేయాల్సిన అవసరం లేదనే అభిప్రాయాలు వ్యక్తం చేసింది. ఈ నిబంధనను ఎత్తివేసేందుకు కేబినెట్ సూచనప్రాయంగా అంగీకరించింది.

**మెట్రో టేకోవర్ కోసం ప్రత్యేక కమిటీ**

హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మెట్రో 2ఏ, 2బీ విస్తరణకు అడ్డంకిగా మారిన మొదటి దశను పీపీపీ మోడ్‌లో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంపై సుదీర్ఘంగా చర్చించింది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో సాధ్యాసాధ్యాలు, అందులో ముడిపడి ఉన్న అంశాలన్నింటినీ లోతుగా అధ్యయనం చేసేందుకు ఉన్నత అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీఎస్ ఛైర్మన్‌గా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఎంఏయూడీ కార్యదర్శి, లా సెక్రెటరీ, మెట్రో రైలు ఎండీ, అర్బన్ ట్రాన్స్పోర్ట్ అడ్వయిజర్ అధికారుల కమిటీలో సభ్యులుగా ఉంటారు. అధికారుల కమిటీ తమ రిపోర్టును కేబినెట్ సబ్ కమిటీకి అందిస్తుంది. కేబినేట్ సబ్ కమిటీ సిఫారసుల ఆధారంగా మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం తీర్మానించింది.

**మరింత ధాన్యం సేకరణకు ప్రత్యేక చర్యలు**

ఈ వానాకాలంలో 1.48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. దేశంలోనే ఇది రికార్డు స్థాయి ఉత్పత్తి. ఇందులో రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల విభాగం అంచనా వేసింది మంత్రివర్గం. కేంద్ర ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు అంగీకరించిందని మరో 15 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది. వానాకాలం సీజన్లో పండించిన ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది.

**మూడు అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటుకు అంగీకారం**

ధాన్యానికి చెల్లించే మద్దతు ధరతోపాటు సన్న వడ్లకు ఇచ్చే రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో వెంట వెంటనే జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని.. ప్రతి కొనుగోలు కేంద్రం పర్యవేక్షణ, సమన్వయానికి ఒక్కో అధికారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా మూడు అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. హుజూర్ నగర్, కొడంగల్, నిజామాబాద్‌లో అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. నల్సార్ యూనివర్సిటీ అడ్మిషన్లలో ఇప్పుడు తెలంగాణ స్థానికులకు కేటాయించిన 25 శాతం సీట్ల కోటాను 50 శాతం పెంచాలని కేబినెట్ తీర్మానం చేసింది.

**ప్రజాపాలన -ప్రజా విజయోత్సవాలు**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తైన సందర్భంగా ప్రజాపాలన -ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఉత్సవాల నిర్వహణ.. సంబంధిత ఏర్పాట్లపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో ఏన్మార్ మార్కెట్ యార్డ్ కు పది ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ తీర్మానం చేసింది. నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయానికి ఇప్పుడున్న చోటనే అదనంగా 7 ఎకరాల భూమిని కేటాయించే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.రాష్ట్రంలో హ్యామ్ మోడ్‌లో మొదటి దశలో 5,566 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జాతీయ రహదారులు, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలతో అనుసంధానమయ్యే రహదారులకు సంబంధించి అభివృద్ధి, విస్తరణ పనులు చేపడుతామన్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి రక్షణ శాఖ భూములు వినియోగించుకుంటున్నందున వారికి ప్రత్యామ్నాయంగా 435.08 ఎకరాల భూములను అప్పగిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. కృష్ణా-వికారాబాద్ బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మాణానికి సంబంధించి 845 హెక్టార్ల భూ సేకరణకు అయ్యే రూ.438 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేసింది. మన్ననూర్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మొత్తం వ్యయంలో మూడో వంతు రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది.

# డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఏపీకి పెట్టుబడులు

ఆయన నాయకత్వ పటిమను కొనియాడారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న మోదీకి అభినందనలు తెలిపారు. తాను ఎందరో ప్రధానులను చూశానని, కానీ మోదీలా విశ్రాంతి లేకుండా అంకితభావంతో పనిచేసే ప్రగతిశీల నేతను చూడలేదని అన్నారు. "సరైన సమయంలో, సరైన చోట, సరైన నేతగా ప్రధాని స్థానంలో మోదీ ఉన్నారు. ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు దేశానికి గేమ్ చేంజర్లుగా మారాయి," అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

మోదీ సంకల్పం వల్లే 11 ఏళ్ల క్రితం 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ నేడు ప్రపంచంలో 4వ స్థానానికి చేరిందని, 'వికసిత్ భారత్' లక్ష్యంతో 2047 నాటికి దేశం సూపర్ పవర్‌గా అవతరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సైనికపరంగా 'ఆపరేషన్ సింధూర్' ద్వారా భారత్ సత్తాను ప్రపంచానికి చాటారని గుర్తుచేశారు.

**జీఎస్టీ 2.0తో ప్రజలకు సూపర్ సేవింగ్స్**

'ఒకే దేశం %-% ఒకే పన్ను %-% ఒకే మార్కెట్' నినాదంతో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన జీఎస్టీ విధానంలో చేపట్టిన తాజా సంస్కరణలు చారిత్రాత్మకమని ముఖ్యమంత్రి అన్నారు. జీఎస్టీ 2.0తో దేశంలోని 99 శాతం వస్తువులు 0 నుంచి 5 శాతం పన్ను పరిధిలోకి వచ్చాయని, ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయని వివరించారు. ఈ పన్ను తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో ఉపశమనం కలిగిందన్నారు. "ఈ సంస్కరణల ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి సుమారు రూ.15 వేల వరకు ఆదా అవుతుంది. విద్యార్థులు, రైతులు, చిరు వ్యాపారులు, కార్మికులు ఇలా సమాజంలోని అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూరుతోంది," అని చంద్రబాబు పేర్కొన్నారు. దసరా నుంచి దీపావళి వరకు జీఎస్టీ సంస్కరణలను పండుగలా నిర్వహిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 98 వేల అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. 'బచత్ ఉత్సవ్' కాస్తా ఇప్పుడు ప్రజల 'భరోసా ఉత్సవ్'గా మారిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

**కేంద్రం అండతో రాష్ట్రం ప్రగతి పథంలో**

డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల రాష్ట్రానికి కలుగుతున్న ప్రయోజనాలను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాలు కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే 'సూపర్ హిట్' అయ్యాయని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ, పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం-2.0, పెన్షన్ల పంపిణీ వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. కేంద్రం అండతోనే అమరావతిని నిలబెట్టామని, పోలవరాన్ని గాడిన పెట్టామని, విశాఖ ఉక్కును బలోపేతం చేశామని అన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన 'స్వదేశీ' మంత్రం బ్రహ్మాస్త్రంలా పనిచేస్తుందని, సెమీ కండక్టర్ల నుంచి శాటిలైట్ల వరకు, చిప్‌ల నుంచి షిప్‌ల వరకు ఏపీలోనే తయారు చేసేలా కార్యాచరణ రూపొందించామని వివరించారు.

**రాయలసీమకు హైకోర్టు బెంచ్.. పెట్టుబడుల వెల్లువ**

రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని, విశాఖలో ఆర్సెల్లార్ మిట్టల్, 15 బిలియన్ డాలర్లతో గూగుల్ ఏఐ డేటా హబ్, నెల్లూరులో బీపీసీఎల్ రిఫైనరీ వంటి భారీ ప్రాజెక్టులు వస్తున్నాయని చంద్రబాబు తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే ఇక్కడ హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయనున్నట్లు సభాముఖంగా ప్రకటించారు. రాయలసీమలో స్టీల్, స్పేస్, డిఫెన్స్, ఏరోస్పేస్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ల తయారీ, గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి పరిశ్రమలు రానున్నాయని వెల్లడించారు. సెమీ కండక్టర్ యూనిట్, క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు సహకరించిన ప్రధాని మోదీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యుత్, రైల్వే, హైవే, రక్షణ రంగాలకు చెందిన రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసినట్లు గుర్తుచేశారు. బీహార్‌లో జరగబోయే ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు.

# కేరళ నర్సు నిమిష ప్రియకు భారీ ఊరట

న్యూఢిల్లీ యెమెన్‌లో హత్య కేసులో మరణశిక్ష పడి, పదేళ్లుగా జైలు జీవితం గడుపుతున్న కేరళ నర్సు నిమిష ప్రియా కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమె ఉరిశిక్ష ఆదేశాన్ని యెమెన్ అధికారులు తాత్కాలికంగా మార్పు చేశారు. మరోవైపు, ఆమెను కాపాడి స్వదేశానికి తీసుకువచ్చేందుకు భారత ప్రభుత్వం దౌత్యపరమైన చర్చలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా యెమెన్ అధికారులతో సంప్రదింపులు జరిపేందుకు కొత్త మధ్యవర్తిని నియమించినట్టు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. గురువారం సుప్రీంకోర్టులో ఈ కేసుకు సంబంధించిన విచారణ జరిగింది. 'సేవ్ నిమిష ప్రియా ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ వివరాలను కోర్టుకు సమర్పించింది. నిమిష ప్రియా తరపు న్యాయవాది మాట్లాడుతూ, "నిమిష మరణశిక్ష ఆదేశం తాత్కాలికంగా మార్చబడింది" అని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేసు విచారణను వచ్చే ఏడాది జనవరికి వాయిదా వేయాలని కోరగా, సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. అవసరమైతే ముందుగా కూడా విచారణకు అభ్యర్థించవచ్చని సూచించింది.

**ఏమిటీ కేసు?**

కేరళకు చెందిన నిమిష ప్రియా 2011లో నర్సుగా యెమెన్‌కు వెళ్లింది. 2015లో స్థానిక పౌరుడైన తలాల్ అబ్దో మహ్దీ భాగస్వామ్యంతో సనా నగరంలో ఒక క్లినిక్ ప్రారంభించింది. అయితే, తలాల్ నకిలీ వివాహ పత్రాలు సృష్టించి తనను భార్యగా చెప్పుకుంటూ శారీరకంగా, మానసికంగా హింసించేవాడని నిమిష ఆరోపించింది. తన పాస్‌పోర్టును, ఆదాయాన్ని లాక్కుని వేధించాడని ఆమె తెలిపింది. అతని బారి నుంచి తప్పించుకుని పాస్‌పోర్ట్ తిరిగి పొందేందుకు, 2017లో అతనికి మత్తుమందు ఇచ్చింది. కానీ, డోస్ ఎక్కువ కావడంతో తలాల్ మరణించాడు. ఈ హత్య కేసులో యెమెన్ పోలీసులు నిమిషాను అరెస్టు చేశారు. విచారణ జరిపిన స్థానిక కోర్టు 2020లో ఆమెకు మరణశిక్ష విధించింది. హైకోర్టు, సుప్రీంకోర్టులో ఆమె చేసుకున్న అప్పీళ్లు తిరస్కరణకు గురయ్యాయి. చివరికి 2024లో యెమెన్ అధ్యక్షుడు కూడా మరణశిక్షను ఆమోదించడంతో ఆమె భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తాజా పరిణామాలతో నిమిష ప్రియా కుటుంబ సభ్యులు, ఆమెను కాపాడటానికి ప్రయత్నిస్తున్న స్వచ్ఛంద సంస్థలు ఊపిరి పీల్చుకున్నాయి.

# అమీర్‌పేట వరద కష్టాలకు చెక్

హైదరాబాద్ హైదరాబాద్ నగరంలోని అమీర్‌పేట వాసులకు ఏళ్లుగా వర్షాకాలంలో ఎదురయ్యే వరద కష్టాలకు ఈ ఏడాది తెరపడింది. హైదరాబాద్ రెయిన్‌వాటర్ డ్రైనేజీ అడ్మినిస్ట్రేషన్ (హైడ్రా) చేపట్టిన నాలాల పూడికతీత పనులు సత్ఫలితాలనిచ్చాయి. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం అమీర్‌పేటలో పర్యటించి, జరుగుతున్న పనులను పరిశీలించారు. జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, మధురానగర్ వంటి ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు అమీర్‌పేట వద్ద నిలిచిపోవడంతో ఏటా ప్రధాన రహదారి నడుం లోతు నీటిలో మునిగిపోయేది. దశాబ్దాలుగా పేరుకుపోయిన చెత్త, మట్టి, పరుపులు, దిండ్లతో ఇక్కడి 6 ప్రధాన పైపులైన్లు పూర్తిగా మూసుకుపోవడమే దీనికి కారణమని అధికారులు గుర్తించారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ విభాగాల సమన్వయంతో ఈ పూడికతీత పనులను చేపట్టారు. ఇప్పటివరకు 45 ట్రక్కుల పూడికను తొలగించినట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ అమీర్‌పేటలో అనుసరించిన విధానం నగరంలోని అనేక ముంపు ప్రాంతాలకు ఒక నమూనా అని తెలిపారు. ఇదే మాదిరిగా నగరవ్యాప్తంగా కల్వర్టులు, పైపులైన్లలో పూడిక తొలగిస్తే వరద సమస్యను చాలా వరకు అధిగమించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. గాయత్రీ నగర్ ప్రాంతంలో మిగిలిన పైపులైన్ల పనులను కూడా వేగంగా పూర్తి చేసి, వచ్చే వర్షాకాలానికి ముంపు సమస్య పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 3 పైపులైన్లు అందుబాటులోకి రావడంతో ఈసారి 10 సెంటీమీటర్ల వర్షం పడినా నీరు నిలవలేదని అధికారులు కమిషనర్‌కు వివరించారు. మిగిలిన 3 లైన్ల పనులు కూడా పూర్తయితే 15 సెంటీమీటర్ల వర్షపాతాన్ని కూడా తట్టుకునే సామర్థ్యం వస్తుందని వారు తెలిపారు. హైడ్రా చేపట్టిన పనులపై స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేసి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## గుజరాత్ రాజకీయాల్లో కీలక మలుపు

అవకాశం కల్పించనున్నారు. ఈ మార్పులో యువత్వం, ఓబీసీ-పాతిదార్ సమతుల్యత, సౌరాష్ట్ర-ఉత్తర గుజరాత్ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. రవీంద్ర జడేజా భార్య, జామ్‌నగర్ ఎమ్ఎల్ఏ రీవా జడేజాకు కేబినెట్ ర్యాంక్‌కు ప్రమోషన్ ఇవ్వనున్నారని అంటున్నారు. 2027 అసెంబ్లీ ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీ ఎన్నికలు ఉన్న సమయంలో ఈ మార్పు కీలకంగా మారింది.

## నా సమస్యను పరిష్కరిస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారు

ఆమె వారికి తెలియజేశారు. భేటీ అనంతరం ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, తన సమస్యను పరిష్కరించడానికి పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని తెలిపారు. వారు ఈ విషయాన్ని పరిష్కరిస్తామని చెప్పారని, కాబట్టి మిగిలిన విషయాలను వారే చూసుకుంటారనే నమ్మకంతో ఉన్నానని అన్నారు.గత కొన్ని రోజులుగా తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని కొండా సురేఖ మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్‌లకు వివరించినట్లు తెలుస్తోంది. తనను ఇబ్బంది పెడుతున్నారని ఆమె ఫిర్యాదు చేశారు. డెక్కన్ సిమెంట్ యాజమాన్యం వ్యవహారంలో జరిగిన పరిణామాలను, వారితో జరిగిన చర్చలు, ఆ సంస్థ అక్రమాలు తదితర విషయాలను ఆమె తెలియజేశారు.సిమెంట్ కంపెనీల యాజమాన్యాలను బెదిరిస్తున్నారనే ఆరోపణలతో మంత్రి కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ప్రభుత్వం ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని కొండా సురేఖ ఇంటికి పోలీసులు వెళ్లారు. సురేఖ నివాసంలో సుమంత్ ఉన్నారన్న సమాచారంతో సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసులు అక్కడకి చేరుకున్నారు. మంత్రి కుమార్తె సుస్మిత వారిని ప్రశ్నించారు. ఈ క్రమంలో సుస్మిత మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పెద్దలపై విమర్శలు చేశారు.

## జూబ్లీహిల్స్‌లో బోగస్ ఓట్లుపై ఇప్పుడేం చేయలేం

హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ ముగించింది. ఈ పిటిషన్‌ను చట్ట ప్రకారం పరిశీలిస్తున్నామని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసిందని, ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని హైకోర్టు సీజే ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉన్నాయని, ఇలా 1942కు పైగా ఓట్లను గుర్తించినట్లు తెలిపారు. నియోజకవర్గానికి సంబంధం లేని 12 వేలకు పైగా ఓట్లను గుర్తించినట్లు చెప్పారు. అనుమానాస్పద ఓట్లు, బోగస్ ఓట్లు, ఒకరికి ఒకటి కంటే ఎక్కువ ఓట్ల వివరాలను ఈ నెల 13న ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని అన్నారు.

ఎన్నికల కమిషన్ తరఫున దేశాయ్ అవినాశ్ రెడ్డి వాదనలు వినిపించారు. ఓటర్ల జాబితా నిరంతర ప్రక్రియ అని, 365 రోజుల పాటు ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణ జరుగుతూనే ఉంటుందని కోర్టుకు తెలిపారు. ఓటర్ల జాబితాను ఈ ఏడాది జులైలో ప్రచురించి అభ్యంతరాలు కోరామని, కానీ అప్పుడు ఎలాంటి అభ్యంతరాలు రాలేదని కోర్టుకు తెలియజేశారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత పిటిషనర్లు అత్యవసర పిటిషన్ దాఖలు చేశారని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ అభ్యంతరాలను పరిశీలిస్తున్న సమయంలో పిటిషన్ దాఖలు చేయడాన్ని తప్పుబట్టారు. కాబట్టి ఆ పిటిషన్ విచారణార్హం కాదని కోర్టుకు తెలియజేశారు. ఈ నెల 21వ తేదీ వరకు అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కోర్టుకు తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం పిటిషన్లపై విచారణ ముగించినట్లు తెలిపింది. పిటిషనర్ల ఫిర్యాదులను పరిశీలిస్తున్నట్లు ఈసీ తెలిపినందున ప్రత్యేక ఆదేశాలు అవసరం లేదని పేర్కొంది.

## 18న బీసీ సంఘాల బంద్‌కు మద్దతు

హైదరాబాద్ అక్టోబర్ 18న బీసీ సంఘాలు తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తమ పార్టీ వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. బంద్ నేపథ్యంలో బీసీ సంఘాల నేతలతో ఆయన గాంధీ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దేశంలో కుల సర్వేలకు ఆద్యుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్‌కు తాము కట్టుబడి ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు. బీసీ రిజర్వేషన్లపై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి బీసీ ఈ బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బంద్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

అసెంబ్లీలో బీసీ బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ, బయట మాత్రం అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ ఆశయ సాధన కోసం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తర్వాత ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ, ఆమెతో స్వయంగా మాట్లాడతానని తెలిపారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎక్కడో కమ్యూనికేషన్ గ్యాప్ ఉన్నట్లు కనిపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఆశన్నతో పాటు 170 మంది మావోయిస్టులు సరెండర్- ఆయుధాలతో పోరాడేవారికి అమిత్ షా వార్నింగ్!

చర్చల ప్రతిపాదనను కేంద్రం తిరస్కరించటంతో మావోయిస్టు అగ్రనేతలు ఒక్కొక్కరు లొంగిపోతున్నారు. బుధవారం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ సమక్షంలో మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ భూపతి 60మంది కేడర్‌తో కలిసి లొంగిపోగా, ఇప్పుడు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న అలియాస్ రూపేష్ జనజీవన స్రవంతిలో కలిశారు. ముగ్గురు డివిజన్ కార్యదర్శులు, ఐదుగురు దండకారణ్యం జోనల్ కమిటీ సభ్యులు, 20మంది %ఐఎజ% సభ్యులు సహా 169 మంది పోలీసుల ముందు లొంగిపోయారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ సమక్షంలో జగదల్‌పుర్‌లో అధికారికంగా లొంగిపోనున్నారు. 70కిపైగా ఆయుధాలు అప్పగించనున్నట్లు సమాచారం.ములుగు జిల్లా పోలోనిపల్లికి చెందిన ఆశన్న పాలిటెక్నిక్ చదివారు. 1991లో పీపుల్స్‌వార్ పార్టీలో చేరిన ఆయన, 1999లో పీపుల్స్‌వార్ యాక్షన్ టీం సారథిగా పగ్గాలు చేపట్టారు. అదే ఏడాది హైదరాబాద్‌లో అధికారి ఉమేశ్ చంద్రను పట్టపగలే నడిరోడ్డుపై హత్య చేసిన ఆపరేషన్‌కు ఆయనే నేతృత్వం వహించినట్లు ప్రచారంలో ఉంది. 2వేల సంవత్సరంలో హోంమంత్రి ఎ.మాధవరెడ్డి ప్రయాణిస్తున్న కారును మందుపాతరతో పేల్చేసి చంపేయడం 2003లో అలిపిరిలో %జపీ% చంద్రబాబు కాన్వాయ్‌ను క్లెమోర్‌మైన్‌తో పేల్చి ఆయనపై హత్యాయత్నానికి పాల్పడిన దుశ్చర్యలతో ఆశన్న పేరు విస్తృతంగా ప్రచారమైందిొంగిపోయారు. 170 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్ లోని రెండు ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రభావం తగ్గిపోయిందని అన్నారు. బుధవారం ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది, మహారాష్ట్రలో 61మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు చెప్పారు. రెండ్రోజుల్లో మొత్తం 258మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పారు. హింసా మార్గం వీడి రాజ్యాంగంపై విశ్వాసం చూపటాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ సారథ్యంలోని ప్రభుత్వం నిరంతరం చేస్తున్న ప్రయత్నాల వల్ల నక్సలిజం కొన ఊపిరిపై ఉందన్న సత్యాన్ని ఈ లొంగుబాట్లు చాటుతున్నాయని అమిత్ షా పేర్కొన్నారు. లొంగుబాట్లను స్వాగతిస్తున్నట్లు తెలిపిన ఆయన, ఆయుధాలతో పోరాడేవారికి భద్రతాదళాలే తగిన సమాధానం చెబుతాయన్నారు. జనజీవన స్రవంతిలో కలవాలని తుపాకీతో పోరాటం చేస్తున్నవారికి మరోసారి పిలుపునిస్తున్నట్లు చెప్పారు.

## బీసీ న్యాయపోరాటానికి మేముసైతం..!

### తాండూరు బంద్‌కు వర్తక, వ్యాపారుల మద్దతు

### స్వాగతించిన బీసీ సంఘం నాయకులు.



సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా.తాండూరు, : బీసీల న్యాయపోరాటానికి మేముసైతం మద్దతు ఇస్తామని తాండూరు వర్తక, వ్యాపారాల సంఘాలు మద్దతు ప్రకటించాయి.రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ బీసీ జేఏసీ పిలుపు మేరకు ఈనెల 18న తాండూరు బీసీ బంద్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. గురువారం తాండూరు బీసీ సంఘం నాయకులు కందుకూరి రాజ్ కుమార్, ఈడ్డి శ్రీనివాస్ గౌడ్ ల ఆధ్వర్యంలో తాండూరు ఆర్టీసీ డీఎం సురేష్ కుమార్, ప్రైవేటు విద్యాసంస్థలు, వస్త్ర వ్యాపారులు, ది గ్రైన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్, కిరాణా అసోసియేషన్, సినిమా థియేటర్ల యజమాన్యాలను కలిసి బీసీ బంద్ కు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఇందుకు డీపో మేనేజర్ తో పాటు ఆయా సంస్థలు, వ్యాపారులు బీసీ బంద్ కు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. బీసీల న్యాయపోరాటంలో భాగస్వాములం అవుతామని అన్నారు. దీంతో బీసీ సంఘం నాయకులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ ఇంచార్జ్ సోమశేఖర్, బీసీ సంఘం నాయకులు సయ్యద్ షుకూర్, టీవీవీ నాయకులు పర్యాద రామకృష్ణ, లక్ష్మణ చారి, శివకుమార్, పరమేష్, విజయలక్ష్మీ, నర్సమ్మ, మంజుల, వివేక్, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు..

## బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సర్కారుకు చుక్కెదురు.. స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు



సత్యమేవ జయతే - న్యూఢిల్లీ న్యూఢిల్లీ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు అంశంపై సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణకు స్వీకరించలేమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం హైకోర్టుకు సూచించింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లవచ్చని చెప్పింది. 50 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని ఆదేశిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్ఎల్‌పీని కొట్టివేసింది.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో అమలుపై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. స్టేను ఎత్తి వేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎల్‌పీ వేసింది. అయితే ప్రభుత్వ వాదనలు వినడాని కంటే ముందే తమ వాదనలను కూడా పరిగణనలోకి హైకోర్టులో పిటిషనర్ మాధవరెడ్డి ఇప్పటికే కెవియట్ పిటిషన్ వేశారు.

## మమ్మల్ని వదిలేయండి అని రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకొని మొక్కాలా? : కొండా సురేఖ కూతురు




సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మమ్మల్ని వదిలేయండి అని రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకొని మొక్కాలా..? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మా అమ్మను ఇష్టమొచ్చినట్లు తిట్టేవాడు. ఢిల్లీలో ఖర్గేతో మీటింగ్‌లో మా అమ్మను రేవంత్ రెడ్డి తిడితే ఆరోజు మా అమ్మ ఎంతో ఏడ్చింది అని సుష్మిత తెలిపారు.రేవంత్ రెడ్డి తమ్ముళ్లు తెలంగాణలో మొత్తం భూములు కబ్జా చేస్తున్నారు. మంచిరేవులలో విల్లాలు కట్టుకున్న కొందరు వ్యక్తులు దారి కోసం ఎండోమెంట్ భూమిని అడిగారు.. అది ఇస్తే పక్కన ప్రైవేట్ ల్యాండ్ ఇస్తామని అన్నారు. ఈ ఫైల్ మీద కొండా సురేఖ సంతకం చేస్తే, జపాన్‌లో ఉన్న రేవంత్ రెడ్డి ఆ ఫైల్‌ను ఆపించాడు. ఎందుకంటే రేవంత్ రెడ్డి తమ్ముళ్లు ఆ భూములను కబ్జా చేయాలని చూస్తున్నారు.. అందుకే మా అమ్మ సంతకం పెట్టిన ఫైల్‌ను రేవంత్ రెడ్డి ఆపేశాడని సుష్మిత పేర్కొన్నారు.

**- ఆ ఇద్దరు మంత్రులు, సీఎం తప్ప**

నిన్నటి నుంచి మంత్రి కొండా సురేఖ ఇంటి వద్ద హైడ్రామా కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయినా కూడా ఇప్పటి వరకు కొండా సురేఖతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడలేదని తెలుస్తోంది. ఇక పలువురు మంత్రులు సురేఖకు సంఘీభావం తెలిపినట్లు సమాచారం. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మినహా మిగిలిన మంత్రుల సంఘీభావం తెలిపారని వార్తలు వినిపిస్తున్నాయి. క్యాబినెట్లో నిన్నటి హైడ్రామాపై చర్చిద్దామని కొండా సురేఖకు కొందరు మంత్రులు హామీ ఇచ్చారని సమాచారం.

**- తాజాగా డిప్యూటీ సీఎంతో కొండా సురేఖ, సుష్మిత భేటీ**

ఈ పరిణామాల నేపథ్యంలో ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రి కొండా సురేఖ, ఆమె కూతురు సుష్మిత భేటీ అయ్యారు. నిన్న రాత్రి జరిగిన పరిణామాలన్నింటిని భట్టికి సురేఖ వివరించారు. కాసేపట్లో మీనాక్షి నటరాజన్‌ను కొండా సురేఖ కలవనున్నట్లు తెలుస్తోంది.

# మండలంలో కల్తీ కల్లు విక్రయాలు జోరు.

**గ్రామాల్లో కల్తీ కల్లుకు అడ్డు అదుపు లేదు.**

**చూసి చూడనట్లు సంబంధిత అధికారుల తీరు.**

**సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మాముళ్ల మత్తులో.**



సత్యమేవ జయతే: అల్లాదుర్గం.అల్లాదుర్గం: మండలంలో కల్తీకల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. స్వచ్ఛమైన కల్లు కు బదులు ప్రాణాంతకమైన మత్తు పదార్థాలను కలుపుతూ కృత్రిమ కల్లును తయారు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ధనవర్జనే లక్ష్యంగా కొందరు వ్యాపారులు కల్తీ కళ్ళు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అల్లాదుర్గం మండలంలోని కాగితంపల్లి, రాంపూర్ గ్రామాలలో కల్తీకల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని స్వచ్ఛమైన కల్లు కు బదులు చెట్ల నుండి తీసిన కొద్దిపాటి కల్లులో, కృత్రిమ ప్రాణానంతక మత్తు పదార్థలు కలుపుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేయడం తప్ప చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజల విమర్శలు వినిపిస్తున్నాయి. ఆల్ఫోజలం, డైజోఫామ్ లాంటి రసాయనతో కల్లు తయారు చేయడం వల్ల సేవించేవారు మత్తులోకి వెళ్లిపోవడం, అనారోగ్య సమస్యల కు గురికావడం, కాకుండా ప్రమాదాలకు కూడా గురవుతున్న సందర్భాలు ఉన్నాయి. మోకాళ్ళ నొప్పులు, బుద్ధి మందగించడం, బిపి షుగర్ లాంటి, వ్యాధుల దరిచేరి ఆస్కారం ఉండడమే కాకుండా, మత్తులో ఏం చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి, కల్తీ కల్లు తో ఎన్నో నష్టాలు జరుగుతున్న సందర్భాలు అనేకం. ఎక్సైజ్ అధికారులు ఆయా ప్రాంతాల్లో తూతూ మంత్రంగా కల్లు దుకాణాలు తనిఖీ చేస్తూ మామూళ్లు తీసుకుంటూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నంత అధికారులు, నిఘా విభాగం వారు స్పందించి కల్తీకల్లు పై నిగా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# జూబ్లీహిల్స్ రహమత్ నగర్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా జరిగింది





**- జూబ్లీహిల్స్ నియోజకవర్గ రహమత్ నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ఉత్సాహభరిత సమావేశం - కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం లక్ష మెజార్టీ లక్ష్యంగా మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపు**

సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్ డివిజన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం మహమ్మద్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రులు డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి గారు, పొన్నం ప్రభాకర్ గారు మరియు ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ గారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి గారు మాట్లాడుతూ, "జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గారిని ఘనమైన మెజార్టీతో గెలిపించుకోవడం ప్రతి కార్యకర్త బాధ్యత. మొదటగా 70 శాతం ఓటింగ్ నమోదు కావడం మన మొదటి లక్ష్యం కాగా, లక్ష ఓట్ల మెజార్టీతో విజయాన్ని సాధించడం మన రెండవ లక్ష్యం" అని పిలుపునిచ్చారు.

రహమత్ నగర్ డివిజన్‌లో గత రెండు నెలల్లోనే రూ.40 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేశామని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ కట్టుబాటుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి "మార్నింగ్ వాక్" కార్యక్రమాల ద్వారా స్వయంగా ప్రజల మధ్యకు వెళ్లి పరిష్కార మార్గాలు చూపించామని తెలిపారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో అభివృద్ధి పూర్తిగా శూన్యమైందని విమర్శించారు. యూసుఫ్‌గూడలో స్మశానవాటిక నిర్మాణం వంటి చిన్న అవసరాలు కూడా నెరవేర్చలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అవసరాలను తక్షణమే నెరవేర్చుతుందని హామీ ఇచ్చారు.

మంత్రి వివేక్ వెంకటస్వామి గారు మాట్లాడుతూ, "గత ప్రభుత్వం పదేళ్లు దందాలతో నిండిపోయింది. కేసీఆర్ కుటుంబం 20 వేల ఎకరాలు దోచుకుందని ప్రజలకు తెలుసు. కేటీఆర్‌కు టీవీలో మాట్లాడటం ఫ్యాషన్ అయింది కానీ ప్రజల సమస్యలపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు" అని విమర్శించారు.

అదేవిధంగా, "కేసీఆర్ నాయకత్వం పూర్తిగా విఫలమైందని, 'సారు కారు పదహారు' అనే నినాదం ఇప్పుడు 'ఫెయిల్యూర్ లీడర్‌షిప్'గా మారిందని" పేర్కొన్నారు.

ఓటు చోరీపై రాహుల్ గాంధీ గళమెత్తగా, బిఆర్ఎస్%–%బిజెపి దోస్తులు మౌనం వహిస్తున్నారని, కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బిఆర్ఎస్ ఢిల్లీలో బిజెపితో జోడీగా, రాష్ట్రంలో నాటకాలు వేస్తోందని ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, స్థానిక నేతలు, యువ నాయకులు పాల్గొన్నారు. సభా ప్రాంగణం నినాదాలతో మార్మోగింది.

## తాగు నీటి సమస్య పరిష్కరించాలని కాసిపేట గని ముందు నిరసన

సత్యమేవ జయతే - మంచిర్యాల మంచిర్యాల : మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం ముత్యంపల్లి, చిన్న ధర్మారం కాసిపేట గ్రామాల్లో నీటి సమస్యపై బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియాలో కాసిపేట1 గని ముందు మహిళలు, గ్రామస్తులు, యువకులు ఖాళీ బిందెలతో గేటు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూరం సంపత్ కుమార్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా గ్రామ పంచాయతీలో నీటి సమస్య పై ఎన్నో సార్లు మొరపెట్టుకున్నా పని కాడవడం లేదన్నారు. గ్రామ పంచాయతీలో నిధులు కొరత, కాంగ్రెస్ ప్రభుత్వం అద్వాన పరిస్థితిలో ఉందన్నారు.

గ్రామాల్లో ఉన్న నాయకులు కనీసం పట్టించుకునే పరిస్థితిలో లేరని వాపోయారు. కాసిపేట, ముత్యంపల్లి, చిన్న ధర్మారం గ్రామాల్లో భూగర్భ జలాల్లో నీరు లేకపోవడం వల్ల బోరు పడని పరిస్థితి ఉందని, తక్షణమే నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సింగరేణి గని అదనపు మేనేజర్ నిఖిల్ అయ్యర్ కు వినతిపత్రం అందించారు. సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించి మూడు రోజుల్లో సమస్యను పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు బాకి కిరణ్, నగరారపు ప్రసన్న , మహిళలు పోసు, లచ్చక్క కవిత, పద్మ మహేశ్వరి, లక్ష్మీ, గ్రామ యువకులు మహేష్, శ్రీకాంత్, హనుమంతు, అరవింద్, గ్రామస్తులు బర్ల రామ్మూర్తి, మైదం రవి, సూరం కిషన్, నారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే

శుక్రవారం 17 అక్టోబర్ 2025

# మంత్రి కొండా సురేఖకు మరో షాక్.. ఆర్ అండ్ బీకి మేడారం జాతర పనులు!



సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీలో మేడారం జాతర పనుల చిచ్చు రగులుతూనే ఉన్నది. తన శాఖలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అతిగా జోక్యం చేసుకుంటున్నాడని, మేడారం అభివృద్ధి పనులను ఆయన కంపెనీకి దక్కేలా చేసుకున్నాడని మంత్రి సురేఖ ఆరోపించిన విషయం తెలిసిందే. పొంగులేటిపై కొండా దంపతులు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేశారు. అయితే మంత్రుల మధ్య వివాదాలకు కారణమంటూ కొండా సురేఖ ఓఎస్డీ సుమంత్‌ను ప్రభుత్వం ఉన్నఫలంగా తొలగించింది. అతనిని అరెస్టు చేసేందుకు ఏకంగా మంత్రి సురేఖ ఇంటికి అర్ధరాత్రి వేళ పోలీసులను పంపించింది. ఈ వ్యవహారం కొనసాగుతుండగానే దేవాదాయ శాఖ మంత్రికి రేవంత్ రెడ్డి సర్కార్ షాకిచ్చింది. మేడారం అభివృద్ధి పనులను ఆర్ అండ్ బీ శాఖకు అప్పగించింది. తక్షణమే రికార్డులు అప్పగించాలని మంత్రి కొండా సురేఖకు చెందిన దేవాదాయ శాఖకు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశాలు జారీచేశారు.

**- నెలరోజులుగా రాజకీయ కుంపటి**

నెల రోజులుగా వరంగల్ కేంద్రంగా జరుగుతున్న పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో కాక పుట్టిస్తున్నాయి. మేడారం పనుల విషయంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటికి, వరంగల్ జిల్లా మంత్రులు సురేఖ, సీతక్క మధ్య విభేదాలు పొడసూపాయి. అయితే పొంగులేటికి తోడుగా సీఎం రంగంలోకి దిగడంతో సీతక్క సైలెంటయ్యారు. కానీ, మంత్రి సురేఖ మాత్రం తన నిరసనను తెలియజేస్తూనే వచ్చారు. దేవాదాయ శాఖ మంత్రినైన తనకు తెలియకుండా టెండర్లు ఎలా ఖరారు చేస్తారంటూ ఆమె తన ఆగ్రహాన్ని బాహాటంగానే వ్యక్తపరిచారు. జిల్లా వ్యవహారాల్లో పొంగులేటి అతిజోక్యంపై విమర్శలు గుప్పించిన సురేఖ.. అధిష్టానానికీ ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటనకు, ఆమె దూరంగా ఉన్నారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం వరంగల్ పర్యటనకు వచ్చారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దశదిన కర్మకు ముఖ్యమంత్రి హాజరైనప్పటికీ, కొండా సురేఖ ఆ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. ఓరుగల్లు రాజకీయ రచ్చ కొనసాగుతుండగానే.. మంగళవారం సాయంత్రం సురేఖకు సమాచారం ఇవ్వకుండా ఆమె ఓఎస్డీని తొలగించడం, 24గంటలు గడవకముందే అరెస్టుకు సిద్ధమవడం.. అదీ ఏకంగా మంత్రి ఇంటిపైకే పోలీసులను పంపడం ఆసక్తికరంగా మారింది.

**- రేవంత్, పొంగులేటే చేస్తున్నరు..**

'మా ఇంటికి మఫ్టీలో పోలీసులు వచ్చింద్రు. ఎందుకొచ్చింద్రని అడిగితే సుమంత్‌పై చాలా అభియోగాలున్నయని చెప్పింద్రు. ఏమేం ఫిర్యాదులున్నాయో మాకు లిస్ట్ ఇవ్వండి అన్నం. ఆయన మా స్టాఫ్ కదా అని అడిగినం. వాళ్లు ఏం చెప్పకుండా వెళ్లిపోయింద్రు. ప్రభుత్వంలో ఉండి కూడా ఇలాం టి పరిస్థితి ఫేస్ చేస్తున్నందుకు చాలా సిగ్గుగా ఉన్నది. బీసీ లేడీ అని కూడా చూడకుండా ఇలా చేయడం సిగ్గుచేటు. ఓఎస్డీని తొలగించినప్పుడు కనీసం అడగలేదు. అడిగి వాళ్ల ఇజ్జత్ ఎందుకు తీయాలని మేం కూడా అడగలేదు. కానీ ఈ రోజు వాళ్ల ఇజ్జత్‌ను వాళ్లే తీసుకున్నరు' అంటూ మంత్రి సురేఖ కూతురు సుస్మిత ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీ ఓఎస్‌డీ సుమంత్‌ను అదుపులోకి తీసుకునేందుకు బుధవారం రాత్రి సురేఖ ఇంటికి మఫ్టీలో వెళ్లిన పోలీసులను అమె అడ్డుకున్నారు. అనంతరం సుష్మిత మీడియాతో మాట్లాడుతూ 'దేవాదాయ శాఖలో ఒక టెండర్ పడింది. మంత్రి కొండా సురేఖకు తెలియకుండా పొంగులేటి తనకు కావాల్సిన వారికి ఇచ్చుకున్నరు. మావాళ్లు కూడా టెండర్ వేసింద్రు. బిడ్ ఓపెన్ చేస్తే అది మా వాళ్లకు వచ్చింది. పొంగులేటి ఫోన్ చేసి టెండర్ విత్ డ్రా చేసుకోవాలని మా అమ్మను కోరింద్రు. విత్‌డ్రా చేసుకోబోమని అమ్మ చెప్పారు. దీంతో ఆ టెండర్ రెవెన్యూ శాఖకు వెళ్లిపోయింది. ఇప్పుడు మళ్లీ టెండర్ రీకాల్ చేస్తున్నరు.

పొంగులేటితో మాకు జరిగింది ఇదీ' అని వివరించారు. 'డెక్కన్ సిమెంట్‌తో ఇష్యూ ఎందుకు వచ్చిందో నాకు తెలియదు. సుమంత్ ఎక్స్‌టార్షన్ చేశారంటున్నారు. రోహిన్‌రెడ్డికి తెలియాలి.. రేవంత్‌రెడ్డికి తెలియాలి. రోహిన్‌రెడ్డిని మేం కలవలేదు. సీఎంవో ఆఫీసు నుంచి రోహిన్‌రెడ్డి వచ్చి సుమంత్‌కు కాల్ చేస్తే రోహిన్‌రెడ్డి ఆఫీసుకు సుమంత్ వెళ్లారు. కావాలంటే కెమెరాలు చెక్ చేసుకోవచ్చు. మంత్రి సురేఖ ప్రస్తుతం బయట ఉన్నారు. ఓఎస్‌డీ మంత్రితో బయటకు వెళ్లారు' అని చెప్పారు. 'రాహుల్ గాంధీ బీసీ నినాదం ఎత్తుకుంటే ఇక్కడ బీసీలను తొక్కాలని చూస్తున్నారు. మేం కింది నుంచి పైకి వచ్చినోళ్లం. రెడ్లందరూ ఒక్కటై మమ్మల్ని తొక్కాలని చూస్తున్నరు. డెక్కన్ సిమెంట్ విషయంలో వచ్చామని, ఉత్తమ్ కుమార్‌రెడ్డి కంప్లయింట్ చేశారని పోలీసులు చెప్తున్నరు. ఉత్తమ్‌కు కాల్ చేస్తే నేను కంప్లయింట్ చేయలేదని చెప్పారు. పోలీసులు మఫ్టీలో వచ్చింద్రు. ఎం దుకొచ్చింద్రని అడిగితే సుమంత్‌పై చాలా అభియోగాలున్నయన్నరు. ఏమేం ఫిర్యాదులున్న యో లిస్ట్ ఇవ్వమన్నం. ఏం చెప్పకుండా వెళ్లిపోయింద్రు. ఓఎస్‌డీని తొలగించినప్పుడు కూ డా కనీసం అడగలేదు. అడిగి వాళ్ల ఇజ్జత్ ఎం దుకు తీయాలని మేం అడగలేదు. కానీ ఈ రోజు వాళ్ల ఇజ్జత్‌ను వారే తీసుకున్నరు.. ఇదం తా రేవంత్, ఉత్తమ్, పొంగులేటి, వేం నరేందర్‌రెడ్డి మా మీద కుట్ర చేస్తున్నరు. సీఎం సోదరులకు గన్‌మన్‌లతో భద్రత కల్పించినప్పుడు మాకెందుకివ్వరు? మమ్మల్ని హత్య చేయించేందుకేనా?' అంటూ ఆగ్రహం

# ధర్మారం మోడల్ పాఠశాలలో ప్రపంచ ఆహార దినోత్సవ వేడుకలు



సత్యమేవ జయతే - పెద్దపల్లి పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ప్రపంచ ఆహార దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. 6వ తరగతి నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులందరు ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా తమ ఇంటి దగ్గర తయారు చేసిన ప్రత్యేకంగా తెలంగాణ ఆహారపు పదార్థాలను పాఠశాలలో ప్రదర్శించారు.

ఇందులో భాగంగా విద్యార్థులు తయారు చేసిన మక్కగడ్క, జొన్నఅంబలి, గారెలు, సత్తు పిండి పదార్థాలు, గుడాలు, రాగి జావా, మిల్లెట్స్ మొదలగు తెలంగాణ ఆహారపు వంటకాలను ప్రదర్శించి ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ ఆహార పదార్థాలను తినడం వలన కలిగే ప్రయోజనాలను కూడా వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యా రంగం %-% పరిశ్రమల అనుసంధానమే భవిష్యత్తు దిశ అని మంత్రి డా. వివేక్







**- సిఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఈడియు సమ్మిట్ %-% ఫ్యూచర్ అఫ్ వర్క్: స్కిల్స్, మైండ్సెట్, ఇంపాక్ట్" విద్యా సదస్సులో తెలంగాణ రాష్ట్ర మంత్రి డా. వివేక్ వెంకటస్వామి ప్రధాన అతిథిగా పాల్గొని**

**౨ విద్యా వ్యవస్థను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాల్సిన అవసరాన్ని సూచించారు**

సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో "భవిష్యత్ ఉద్యోగావకాశాలు %-% నైపుణ్యాలు, దృక్పథం, ప్రభావం" అనే విద్యా సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, గనులు మరియు భూగర్భశాస్త్ర శాఖ మంత్రివర్యులు డాక్టర్ వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తాను పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం తెలంగాణలో విద్యా, పరిశ్రమల అనుసంధానానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

తెలంగాణ రాష్ట్రం 2014 విద్యా విధానం ప్రగతిపథం ద్వారా విద్యా రంగంలో సమగ్ర మార్పు సాధించబోతోందని తెలిపారు. కొత్త విధానం అంగన్వాడీ నుండి విశ్వవిద్యాలయం వరకు సమగ్ర మార్పులు తీసుకువస్తుందని, ఉద్యోగాలను కోరుకునే యువతను కాకుండా ఉద్యోగాలను సృష్టించే నాయకులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని, 2023%-%24 సంవత్సరంలో ఉన్న స్థాయికి రెట్టింపు స్థాయిలో 2030 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎదుగుతుందని వివరించారు.

విద్యా వ్యవస్థను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాల్సిన సమయం వచ్చిందని, సంప్రదాయ జ్ఞాన కేంద్రిత విద్యా విధానం నుండి నైపుణ్య ఆధారిత విద్యా విధానానికి మార్పు తప్పనిసరని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సాంకేతిక ప్రవేశ దారులు మరియు పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు త్వరలో పూర్తిస్థాయిలో ప్రారంభమవుతాయని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టబోతున్నామని వివరించారు.

విద్యార్థులు తరగతి గదుల్లో మాత్రమే కాకుండా పరిశ్రమలలోనూ ప్రాయోగిక అనుభవం పొందే విధంగా పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని తెలిపారు.

రాష్ట్రంలో ఏర్పాటు చేయబడిన కొత్త విశ్వవిద్యాలయాలు వచ్చే విద్యా సంవత్సరంలో ఐదువేల మంది విద్యార్థులను చేర్చుకునేలా విస్తరించనున్నాయని చెప్పారు. అంతేకాక కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ విశ్వ వేదిక ద్వారా లక్ష మందికి పైగా విద్యార్థులు నైపుణ్య శిక్షణ పొందే అవకాశం కలుగుతుందని వివరించారు.

తెలంగాణ ప్రభుత్వం 2026 నాటికి రెండు వందల కృత్రిమ మేధస్సు ఆవిష్కరణ సంస్థలకు మద్దతు ఇవ్వడం, రెండు వందల ఎకరాల్లో కృత్రిమ మేధస్సు పార్కును అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నదని తెలిపారు.

ప్రధాన ఇంజినీరింగ్ రంగాలు మళ్లీ బలోపేతం కావాలని, ముఖ్యంగా సివిల్ ఇంజినీరింగ్ వంటి విభాగాల్లో ప్రతిభావంతులైన యువతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని అన్నారు.

భవిష్యత్తులో విద్యా అర్హతల కంటే నైపుణ్యాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని, ఆటోమేటీకరణ మరియు డిజిటల్ రూపాంతర మార్పులు తెలంగాణ రాష్ట్రానికి అపారమైన అవకాశాలు తెచ్చిపెడతాయని వివరించారు.

విద్యా రంగంలో ఆవిష్కరణలు, స్వీయ ఉపాధి, పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం ఇచ్చి యువత దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు.

# నేషనల్ ఓపెన్ అండర్%-%23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య






**- క్రీడలకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వ్యాఖ్యానం**

సత్యమేవ జయతే - హనుమకొండ

హనుమకొండ : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఐదవ నేషనల్ ఓపెన్ అండర్%-%23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య గారు ఆరంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఖేలో ఇండియా %-% 2026 క్రీడలను హైదరాబాద్ నగరంలో నిర్వహించేందుకు కృషి చేస్తున్నదని వివరించారు. అలాగే 2036 సంవత్సరంలో భారత్‌లో జరగనున్న ఒలింపిక్ క్రీడల్లో కొన్ని పోటీలను తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సక్రియంగా కృషి చేస్తున్నారని తెలిపారు.

జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియాన్ని క్రీడాకారుల అవసరాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని ఎంపీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల ఏర్పాటు, ఆధునిక శిక్షణ కేంద్రాల స్థాపన, ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని చెప్పారు.

ఈ పోటీల్లో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 945 మంది మహిళా అథ్లెటిక్స్ పాల్గొంటుండగా, వారిలో 20 మంది తెలంగాణకు చెందినవారని ఎంపీ తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించి, తెలంగాణకు గౌరవం తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు.



క్రీడా స్ఫూర్తితో ప్రతి క్రీడాకారుడు పోటీల్లో పాల్గొని, తమ ప్రతిభను నిరూపించుకోవాలని ఎంపీ కడియం కావ్య పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం చైర్మన్ ఎర్రబెల్లి రాజేశ్వరరావు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, మేయర్ గుండు సుధారాణి, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, క్రీడా అధికారులు, అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు, కోచ్‌లు మరియు అనేకమంది క్రీడాభిమానులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే



## కాంగ్రెస్ బలోపేతంలో కార్యకర్తలే కీలకం.

**వారి అభిప్రాయ సేకరణతో డీసీసీ ఎన్నిక.**

**ఏఐసీసీ ఇంచార్జ్ సూరజ్ సింగ్ ఠాకూర్.**

**డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తుల స్వీకరణ..**







తాండూరులో సంస్థాగత నిర్మాణ జిల్లా స్థాయి సంఘటన్ సృజన్ అభియాన్.. సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా.తాండూరు, : కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమైందని ఏఐసీసీ ఇంచార్జ్ సూరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు. గురువారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, అధ్యక్షులు మహేష్ గౌడ్ ఆదేశాల మేరకు పార్టీ సంస్థాగత నిర్మాణ జిల్లా స్థాయి సంఘటన్ సృజన్ అభియాన్ సమావేశం అట్టహాసంగా నిర్వహించారు.తాండూరు పట్టణం కోకట్ రోడ్డు మార్గంలోని వెంకోబా గార్డెన్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఏఐసీసీ ఇంచార్జ్ సూరజ్ సింగ్ ఠాకూర్ తోపాటు డీసీసీ అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, టీపీసీసీ బెల్లయ్య నాయక్, ఫైనాన్స్ కమీషన్ మెంబర్ రమేష్ మహరాజ్, ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత తదితరులు హాజరయ్యారు. డీసీసీ అధ్యక్ష ఎన్నికలో భాగంగా తాండూరు నియోజకవర్గం నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, బీసీ సెల్ నాయకులు ఉత్తమ్ చంద్. శంకరప్పలు డీసీసీ పదవి కోసం దరఖాస్తులు చేసుకున్నారు.అనంతరం బూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశం కొనసాగించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ ఇంచార్జ్ సూరజ్ సింగ్, డీసీసీ అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రతి కార్యకర్త సైనికుడే అని అన్నారు. వారి అభిప్రాయం మేరకు డీసీసీ అధ్యక్షుల ఎన్నిక జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, డీసీసీబీ జిల్లా వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, వివిధ మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## డ్రగ్స్ దుష్ప్రభావాలపై యువత అవగాహన కలిగి ఉండాలి : డీఎస్పీ చంద్రభాను




సత్యమేవ జయతే – ఇల్లందు ఇల్లందు : యువత డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగి ఉండి వాటికి దూరంగా ఉండాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. గురువారం ఇల్లెందు పట్టణం గోవింద్ సెంటర్ నుండి జగదాంబ సెంటర్ వరకు డ్రగ్స్ పై యుద్ధం అనే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజాన్ని, యువతను పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్య డ్రగ్స్ అన్నారు. విద్యార్థి దశ నుంచే యువతకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం వల్ల డ్రగ్స్ జోలికి పోకుండా ఉంటారన్నారు.అలాగే అందరూ తమ చుట్టూ ఉన్న విద్యార్థులు, యువత ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. వారి ప్రవర్తనలో అనుమానం అనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. భవిష్యత్ తరాలకు డ్రగ్స్ రహిత సమాజాన్ని ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు తాటిపాముల సురేశ్, బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు సూర్యం, హసీనా, రాజేందర్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## దీపావళికి ముందే ఢిల్లీలో డేంజర్ బెల్స్..

## కాలుష్యం గుప్పిట్లో దేశ రాజధాని!

దీపావళి పండగ ఇంకా రాకముందే దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యపు పొగ కమ్మేసింది. గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గురువారం ఉదయం నాటికి ఢిల్లీ–జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) వ్యాప్తంగా వాయు కాలుష్యం 'చాలా ప్రమాదకరం' కేటగిరీకి చేరింది. ఈ పరిస్థితి తీవ్రమైన ప్రజారోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 301 నుంచి 400 మధ్య ఉంటే దానిని 'చాలా ప్రమాదకరం'గా పరిగణిస్తారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ 300 మార్కును దాటింది.

## మాఫియా డాన్‌లు మంత్రులయ్యారు.. ఆర్ఎస్పీ సంచలన వ్యాఖ్యలు

సత్యమేవ జయతే – హైదరాబాద్

హైదరాబాద్ : రాష్ట్రంలో మాఫియా డాన్‌లు మంత్రులు అయ్యారని బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో పాలన అస్తవ్యస్తంగా మారిందన్న ఆయన.. నిన్న రాత్రి నుంచి హైదరాబాద్ నగరంలో హైడ్రామా నడుస్తోందని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు.

మంత్రి నివాసం నుంచి నిందితుడిని టాస్క్ ఫోర్స్ పోలీసులు బయటకు తీసుకు రాలేక పోయారు. మాఫియా డాన్‌లు మంత్రులు అయ్యారు. ప్రజల జీవితాలతో వారు ఆడుకుంటున్నారు. రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిగా మారింది. సామాన్యుడికో న్యాయం మంత్రులకు ఓ న్యాయమా? మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ ఆఫీస్ నుంచి తెలంగాణ భవన్ నడుచుకుంటూ వస్తే పోలీసులు కేసు పెట్టారు. మా బీఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్ సోషల్ మీడియాలో పోస్టు పెడితే పది కేసులు పెట్టారు. మంత్రికి సంబందించిన మనిషిపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు అని ఆర్ఎస్పీ మండిపడ్డారు. సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న నల్ల బాలు, గౌతమ్ తదితరులను రోజుల తరబడి జైల్లో పెట్టారు.

యూరియా కోసం అడిగిన గిరిజన రైతును మిర్యాలగూడలో రోకలి బండలు ఎక్కించారు. డెక్కన్ సిమెంట్ వారిని బెదిరించిన సీఎం సన్నిహితుడు రోహిన్ రెడ్డి, కొండా సురేఖ ఓఎస్డి సుమంత్‌పై ఎందుకు కేసులు నమోదు చేయలేదు? పోలీసులు కొండా సురేఖ నివాసం వద్ద ప్రేక్షకులుగా మారిపోవడం దారుణం. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి కాల్ డేటా తీస్తే అన్ని నిజాలు బయట పడుతాయి. సచివాలయంలో ప్రభుత్వ పరంగా జరగాల్సిన వ్యవహారాలు ప్రైవేట్ గెస్ట్ హౌస్‌ల్లో జరుగుతున్నాయి. రోహిన్ రెడ్డి, సుమంత్ తుపాకులు పెట్టి ఎలా బెదిరిస్తారు? అసలు తుపాకులు వారి దగ్గరకు ఎలా వచ్చాయని అని ఆర్ఎస్పీ నిలదీశారు.



కొండా సురేఖ కూతురు మాటల్లో ప్రభుత్వ పెద్దల చీకటి దందాలు బయట పడ్డాయి. మాఫియా డాన్‌ల చేతికి రాష్ట్రం వెల్లిందా ?

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బెదిరింపులతో ఆత్మహత్యయత్నానికి ఒడిగట్టిన బానోతు రవి ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయాలేదు. కమిషన్ల కోసం మంత్రులు బాహాటంగా కొట్లాడుకుంటున్నారు. అడ్లూరి లక్ష్మణ్, వివేక్, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి.. ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని ఆర్ఎస్పీ పేర్కొన్నారు.

తెలంగాణ భవన్ ముందట ఇంటెలిజెన్స్ పెట్టె బదులు రోహిణ్ రెడ్డి, ఫహీమ్ ఖురేషి, తిరుపతి రెడ్డి గెస్ట్ హౌస్‌ల దగ్గర నిఘా పెట్టొచ్చు కదా..? రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఒక్క భూ యాజమాని సుఖంగా లేడు. ఆర్ఆర్ టాక్స్ భాదితులు ఎక్కువయ్యారు. గురుకులాల్లో మరణ మృదంగం కొనసాగుతున్నా ఈ ప్రభుత్వానికి పట్టింపు లేదు. 108 మంది విద్యార్థులు చనిపోయారు. మధ్యాహ్న భోజన సిబ్బందికి, మిషన్ భగీరథ సిబ్బందికి జీతాలు లేవు. కొన్ని చోట్ల ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లు పిల్లలకు భోజనం వండి పెడుతున్నారు. సీఎం అనుచరులు ఒక్కో ఏరియాను పంచుకుని వసూళ్లు సెటిల్ మెంట్లు చేస్తున్నారు. పోలీసులు ఏం చేస్తున్నారు? వారిని ప్రేక్షకులుగా మార్చారు. గ్యాంగ్‌ల పాలన ఎక్కువైంది. గ్యాంగ్‌లకు మంత్రులు నాయకులుగా మారారు. రాష్ట్రంలో గన్ కల్చర్, మాఫియా పాలన పోవాలంటే రేవంత్ ప్రభుత్వాన్ని గవర్నర్ బర్తరఫ్ చేయాలి. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలవకపోతే మాఫియా పాలన పెరిగిపోతుంది. ఈ రోజు కేబినెట్ సమావేశంలో మంత్రులు మూకుమ్మడిగా రాజీనామా చేసి తమకు పాలన చేతకావడం లేదని తప్పుకోవాలి. మాఫియా కేబినెట్ సంస్కృతి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుంచే మొదలైంది అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

## క్రమశిక్షణకు మారుపేరు విజయ్ విద్యా సంస్థలు..

## ఆనాటి సంకల్పమే 45వ వార్షికోత్సవ సంబురాలు

సత్యమేవ జయతే – నిజామాబాద్ నిజామాబాద్ : క్రమ శిక్షణకు మారుపేరే విజయ్ విద్యా సంస్థలని, అవి ఈ స్థాయిలో ఉన్నాయంటే ఆ నాటి అమృత లత సంకల్పమే 45వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకుంటున్నామని ప్రఖ్యాత సినీ నటి, దర్శకురాలు రోహిణి, ప్రఖ్యాత రచయిత సినీ దర్శకుడు డాక్టర్ ప్రభాకర్ జైని, రచయిత కవిత్రి అండ్ కాళోజీ అవార్డు గ్రహీత నెల్లుట్ల రమాదేవి అన్నారు. విజయ్ పాఠశాల 45 వ టాలెంట్ షో ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోహిణి, గౌరవ అతిథిగా డాక్టర్ ప్రభాకర్ జైని, గౌరవ అధ్యక్షురాలుగా నెల్లుట్ల రమాదేవి, విజయ్ విద్యాసంస్థల కార్యదర్శి అమృతలత లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి టాలెంట్ షోను ప్రారంభించారు. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ.. విజయ్ పాఠశాల 45 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. తాను చదివిన పాఠశాలను, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. విజయ విద్యాసంస్థల్లో ఒక పండుగ వాతావరణం కనిపించిందని చెప్పారు. తనను పాఠశాల యాజమాన్యం సన్మానించడం సంతోషంగా ఉందని తెలిపారు. చదువుతున్న సమయంలో తమకు ఉపయోగపడే ఆటలు, పరీక్షలు, క్రీడలు, ప్రతి దానిలో పోటీ పడే ప్రయత్నం చేయాలని, పోటీ చేయడం వలన అవకాశాలు ఉంటాయని తెలిపారు. ప్రయత్నిస్తే పోయేది ఏమి లేదన్నారు. నిజామాబాద్ జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. విజయ్ హై స్కూల్ 45 ఏండ్లుగా విజయ పతాకంతో ముందుకు సాగుతుందంటే అమృతలతకు మాత్రమే సాధ్యమైందని డాక్టర్ ప్రభాకర్ జైని అన్నారు. చదువు ఒకటే కాదు చిన్నతనం నుంచే అన్ని విషయాలు తెలుసుకోవడం, ఆచరించడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తెలంగాణలో తాను చేసిన సినిమాకు అన్యాయం జరిగిందని, అడిగితే జూరీ అవార్డుతో సరిపెట్టారని చెప్పారు. కాళోజీ సినిమాను తెలుగులో తెరకెక్కించిన ప్రతి ఒక్కరు చూసి ఆదరించాలన్నారు.

గత నలభై ఐదు ఏండ్లుగా నడుపబడుతున్న విద్యావ్యవస్థ విజయ్ పాఠశాల విజయ పతాకంతో ముందుకు సాగుతుందని నెల్లుట్ల రమాదేవి చెప్పారు. డాక్టర్ అమృతలత రచయితగా, రాజకీయ వేత్తగా వివిధ రంగాలలో ప్రవీణ్యురాలై విద్యార్థులను తీర్చి దిద్దుతున్న ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. 45 సంవత్సరాలుగా సంరక్షిస్తూ ముందుకు వెళుతున్న అమృతలతకు పాదాభివందనాలు అని తెలిపారు. సంకల్పం చాలా గొప్పది కాబట్టి, మహా వృక్షంగా ఎదుగుతుంది. సమాజంలో మంచి గుర్తింపు పొందడంలో విజయ్ హై స్కూల్ మహిళా శక్తిని నిరూపించుకుంటుంది. అమృతలతా అమ్మ ఒక సామాజిక వెత్తగానే కాకుండా అన్ని రకాలుగా గొప్ప మనస్తత్వం కలిగిన వారని పేర్కొన్నారు. పట్టుదల, ఒక సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని అమృతాలత జీవితంలో నిరూపితమైందని ఆనందం వ్యక్తం చేశారు.

– అలరించిన చిన్నారుల నృత్యాలు..

వార్షికోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.







విద్యార్థులకు 2025–26 సంవత్సరానికి అన్ని రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభా పురస్కారాలను అందించారు. అంతకు ముందు ముఖ్య అతిథులను విజయ్ పాఠశాల తరఫున మెమెంటో, శాలువాలతో సత్కరించారు. సినీ పాటలపై చిన్నారులు, విద్యార్థులు చేసిన డాన్స్ లు , భరతనాట్యం ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి అమృతలత, రమాదేవి, లలిత దేవి, విజయ భారతి, విజయ లక్ష్మి, మధు, కరస్పాండెంట్ ప్రభాదేవి అకాడమిక్ డైరెక్టర్ వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత, ప్రిన్సిపల్ విజేత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## కారు, బైక్ ఢీకొని యువకుడు మృతి..





సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా: కారు బైక్ ఢీకొని ఒక యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కోట్ పల్లి మండలం, మోత్కుపల్లి గ్రామానికి చెందిన అంతగిరిపల్లి శ్రీను (25) తండ్రి అంతగిరిపల్లి అనంతయ్య అనే యువకుడు వికారాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేస్తుంటాడు. బుధవారం రాత్రి సమయంలో పట్టణంలోని కమల్ నగర్ లో నివాసముంటున్న తన స్నేహితుడిని బైక్ పై ఇంటి వద్ద వదిలి వికారాబాద్ వస్తున్నాడు.ఈ క్రమంలోనే వికారాబాద్ బ్రిడ్జి మర్రి చెన్నారెడ్డి విగ్రహం సమీపంలో వికారాబాద్ నుంచి హైదరాబాద్ వైపు ఎదురుగా వెళుతున్న ఫార్చునర్ కారు అతి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలోనే తన కొడుకు చనిపోయాడని మృతుడి తండ్రి అంతగిరిపల్లి అనంతయ్య వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రమాదం పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే మృతుడు అంతగిరిపల్లి శ్రీనుకు భార్య, ఒక కొడుకు ఉన్నారు. చిన్న వయసులో కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## మల్లు స్వరాజ్యం నగర్ కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలి



సత్యమేవ జయతే – వరంగల్ రూరల్ వరంగల్ రూరల్ : మల్లు స్వరాజ్యం కాలనీ గుడిసెలు వేసుకొని గత ఐదు సంవత్సరాలుగా నివసిస్తున్న నిరుపేద గుడిసె వాసులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం బచ్చన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం నగర్ కాలనీ నుండి ర్యాలీ నిర్వహించి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించచారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి మొకు కనుక రెడ్డి మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలుగా మల్లు స్వరాజ్యం కాలనీలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న గుడిసె వాసులకు కనీస సౌకర్యాలు కరెంటు, మంచినీరు, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు.

కనీసం మంచినీటి వసతి లేక గుడిసె వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాజ్యాంగబద్ధంగా అందాల్సిన కనీస సౌకర్యాలు పేదలకు అందకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి కనీస సౌకర్యాలు వెంటనే కల్పించి పేదలను ఆదుకోవాలి అని డిమాండ్ చేశారు. లేదంటే పేదలను సమీకరించి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు.

అనంతరం గుడిసె వాసులు స్థానిక తహసీల్దార్‌కు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పర్వతం నర్సింహులు, సిపిఎం నాయకులు పొన్నాల రాజవ్వ, తాడూరి వెంకటమ్మ, చొక్కాం సులోచన, కిష్టయ్య చంద్రం, కస్తూరి సిద్ధులు బాలరాజు, గంధమల నరసింహస్వామి, రాళ్ల బండి కనకాచారి,గంధ మల్ల మనోహర్,సుహాసిని మురళీకృష్ణ, గిరిజన సంఘం జిల్లా నాయకులు సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ‘ఎస్సారెస్పీ రెండవ దశ కాల్వకు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు పెట్టాలి’



సత్యమేవ జయతే – నల్గొండ నల్గొండ : ఎస్సారెస్పీ రెండవ దశ కాల్వకు మాజీ ఎంపీ, కామ్రేడ్ భీమిరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని వామపక్ష నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, కొత్తగట్టు మల్లయ్య, తాటికొండ సీతయ్య డిమాండ్ చేశారు. తుంగతుర్తి మండల కేంద్రంలో గురువారం పద్మశాలి భవనంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల జరిగిన రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి దశదిన కార్యక్రమంలో ఎస్సారెస్పీ స్టేజ్ 2కు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు నామకరణం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పోచంపాడు జలాలు ఈ ప్రాంతానికి తేవడానికి భీమిరెడ్డి నరసింహారెడ్డి ఎంపీగా ఉన్న కాలంలో పార్లమెంట్‌లో అనేకసార్లు ఈ అంశంపై పోరాటం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

తన చివరి రక్తపు బొట్టు వరకు పోచంపాడు జలాల కోసం అనేక ఉద్యమాలు చేసిన వ్యక్తి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు పెట్టకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బేషరతుగా తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన భీమిరెడ్డి నరసింహారెడ్డి వారసులుగా, ఆయన అభిమానులుగా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాటి విజయమ్మ, కోట రామస్వామి, సుందర్ రావు, ప్రభాకర్, సుదర్శన్, ఉప్పలయ్య, సైదులు, తునికి సాయిలు పాల్గొన్నారు.

## ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కోడంగల్ బంద్ విజయవంతం..

### ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్..



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా.కోడంగల్ స్వచ్ఛందంగా బంద్ పాటించిన వ్యాపారస్తులు , విద్యసంస్థలుకెడిపి జెఎసి ఆధ్వర్యంలో బంద్ కోడంగల్ మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించవద్దని కెడిపి జేఏసీ ఆధ్వర్యంలో కొడంగల్ తలపెట్టిన బంద్ విజయవంతమైంది, కెడిపి జెఎసి ఆధ్వర్యంలో గురువారం కోడంగల్ బంద్ స్వచ్ఛందంగా నిర్వహించారు,ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చాకలి అనిల్ మాట్లాడుతూ కోడంగల్ నుండి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నప్పటి నుండి కోడంగల్ ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని చెప్పి రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తర్వాత మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తామని చెప్పి ఇతర ప్రాంతాలకు తరలించడం చూస్తుంటే ఈ ప్రాంతం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు, కొడంగల్ ప్రాంతం అనేక రోజులుగా వెనుకబాటుకు గురవుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి కావడంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అనేక ఆశలతో ఉన్న కోడంగల్ ప్రజల ఆశలను వమ్ము చేశారన్నారు, మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల తరలింపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ ప్రాంతానికి తీసుకువస్తామన్న మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాల పాఠశాలలను కొడంగల్ లో ఏర్పాటు చేస్తామని చెప్పారో అదే ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఎప్పటిలాగే గుండెల్లో పెట్టుకోని చూసుకుంటామన్నారు, ఈ ప్రాంతం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా అభివృద్ధికి నోచుకోకపోతే కోడంగల్ పరిస్థితి ఎప్పటికీ మారదన్నారు, మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలతో పాటు అనేక పరిశ్రమలు తీసుకువచ్చి ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలన్నారు, వారం రోజులుగా ఉద్యమాన్ని కొనసాగిస్తున్న ప్రభుత్వం నుండి ఎటువంటి ప్రకటన చెయ్యకపోవడం చూస్తుంటే ఈ ప్రాంత ప్రజల మనోభావాలతో అవసరం లేదా అన్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం నుండి స్పష్టమైన ప్రకటన రావాలన్నారు, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు, ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# కుత్బుల్లాపూర్ లో “సంఘటన్ శ్రీజన్ అభియాన్”









### = పాల్గొన్న పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు.

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 16,సత్యమేవ జయతే ప్రతినిధి :- ఏఐసీసీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా అధ్యక్షుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న “సంఘటన్ శ్రీజన్ అభియాన్” కార్యక్రమంలో భాగంగా గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బహదూర్ పల్లి మేకల వేంకటేశం ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మరియు నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో “సంఘటన్ శ్రీజన్ అభియాన్” సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అబ్సర్వర్ డా. అంజలి నింబాల్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా పలువురు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వాన్ని బలపరిచే నాయకుడిని, అనునిత్యం పార్టీ విధివిదానలను పాటిస్తూ కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ బలోపేతానికి కృషిచేసే నాయకున్ని ఎంచుకోవాలని కోరారు..

అనంతరం ఏఐసీసీ అబ్సర్వర్ డా. అంజలి నింబాల్కర్ పార్టీ బలోపేతానికి కావలసిన జిల్లా నాయకుడిని ఎంచుకోవడానికి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తల ద్వారా వ్యక్తిగతంగా అభిప్రాయ సేకరణ తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి,టీపీసీసీ సభ్యులు నర్సారెడ్డి భూపతిరెడ్డి,మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, రాష్ట్ర యువనాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు కందాడి శివారెడ్డి, కూన శ్రీనివాస్ గౌడ్, జిమ్మీ దేవేందర్ ఎక్స్ సర్పంచ్,ఆగం పాండు ఎక్స్ కార్పొరేటర్, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి ఎక్స్ కార్పొరేటర్, సిహెచ్ బుచ్చిరెడ్డి, ఇంద్రజిత్ రెడ్డి మాజీ కార్పొరేటర్, సొంటి రెడ్డి పున్నారెడ్డి టిపిసిసి మాజీ సెక్రెటరీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, బొబ్బ రంగారావు మాజీ కౌన్సిలర్, జహంగీర్ బాయ్, బైరి శివకుమార్,ఎక్స్ సర్పంచ్ కావలి గణేశ్, దుండిగల్ మున్సిపల్ ప్రెసిడెంట్ నవీన్ రెడ్డి, ఓబీసీ సెల్ ప్రెసిడెంట్ కుమార్ యాదవ్ దుర్గారావు, మౌనిష్ యాదవ్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, అవిజే జేమ్స్, దమ్మని శ్రవణ్ కుమార్, బాలప్ప, మోతే శ్రీనివాస్, కృష్ణ యాదవ్, నర్సింగరావు, కూన రాఘవేంద్ర గౌడ్, షాకీర్, మధు, పద్మ, లావణ్య, కిషోరి, కరుణ, రమేష్ మంజుల్కర్, అరవ వెంకట్, మల్లం శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# జర్నలిజమా...! నీ దారెటు?

**-బజారున పడుతున్న నాలుగో స్తంభం ప్రతిష్ట**

**-జర్నలిస్టు కావాలి అనుకునే వారికి కనీస విద్యార్హత లేకపోవడం బాధాకరం**

**-నిరక్షరాస్యులైనా, వ్రేలి ముద్ర పరిజ్ఞానమైనా టార్గెట్లు పూర్తి చేస్తే చాలు**

**-రిపోర్టర్ ఉద్యోగం క్షణాల్లో వచ్చేస్తుంది**

**-ఇది పలు యాజమాన్యాల తీరు**

**-ఫలితంగా ప్రజల్లో జర్నలిజం అంటేనే నవ్వుల పాలవుతున్న వైనం**

**-ఈ పరిస్థితుల్లో కనీస విద్యార్హత నిర్దేశించి అటువంటి వారికే అక్రిడేషన్లు మంజూరు చేసేలా జీవో జారీ చేయాలి**



సమాజాభివృద్ధికి బాటలు వేసే మీడియా విలువలు రాను రాను మరింత దిగజారిపోతున్నాయి. గౌరవప్రదమైన వృత్తిగా, సమాజాన్ని ప్రభావితం చేసే జర్నలిజం దారెటు అనేది అర్థం కావడం లేదు. జర్నలిస్ట్ కావాలి అనుకునే వారికి కనీస విద్యార్హత నిర్దేశించకపోవడం, టార్గెట్లు పూర్తి చేస్తే సక్సెస్ ఫుల్ జర్నలిస్ట్ గా యాజమాన్యాలు రెడ్ కార్పెట్ వేయటం సమాజానికి మూల స్తంభంగా పిలువబడే మీడియా పరువు ప్రజల్లో నవ్వుల పాలవుతోంది.

సమాజాభివృద్ధిలో ప్రధానంగా నాలుగు స్తంభాలను నిర్ణయించారు. మొదటిది శాసనమండలి, రెండవది కార్యనిర్వహక, మూడవది న్యాయవ్యవస్థ, నాలుగవది మీడియా గా పేర్కొనడం జరిగింది. సమాజానికి మూల స్తంభం (ఫోర్త్ ఎస్టేట్) అని కూడా మీడియాను అభివర్ణిస్తారు. మొదటి మూడు వ్యవస్థలు సక్రమంగా పనిచేయకపోయినప్పటికీ వాటిని సక్రమమైన మార్గంలో నడిపించే వ్యవస్థగా మీడియాను మూలస్తంభంగా అభివర్ణించారు. అంతటి ప్రాధాన్యత ఉన్న మీడియా వ్యవస్థ జర్నలిజం నేడు ప్రక్క దారి పడుతోంది. పట్టింది. మూల స్తంభం పటిష్టంగా ఉండి మిగిలిన వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన బాధ్యత కలిగిన నాలుగో స్తంభం కూనరిల్లుతోంది. దీనికి అనేక కారణాలు లేకపోలేదు. ప్రధానంగా జర్నలిస్టు కావాలి అనుకునే వారికి ఒక కనీస మైన విద్యార్హత లేకపోవడం ఒక కారణమైతే, రాజకీయం అనే చట్రం క్రింద మీడియా స్వేచ్ఛ బందీ కావటం మరో కారణం. పోలీస్ రికార్డుల్లో కేసులు నమోదైవున్నవారికి సైతం జర్నలిస్టుగా పలు యాజమాన్యాలు ఉద్యోగాలు ఇవ్వటం ఫలితంగా మీడియా పరువు బజారున పడటం ఇది ఒక కారణంగా చెప్పవచ్చు.

**నేను జర్నలిస్ట్ కావాలి విద్యార్హత ఏమిటి?**

ఇక ఎవరైనా వచ్చి నేను జర్నలిస్టు కావాలి. విద్యార్హత ఏమిటి అని అడిగితే సమాధానం దొరకదు. ఎందుకంటే జర్నలిస్టు కావాలి అనుకునే వారికి ప్రభుత్వం కానీ, మీడియా యాజమాన్యాలు కానీ కనీస విద్యార్హతను ఇంతవరకు నిర్దేశించలేదు. దీని వలన ఓనమాలు రాని వారికి, టెన్త్ ఫెయిల్ అయిన వారికి సైతం పలు మీడియా యాజమాన్యాలు అందిన కాడికి పుచ్చుకొని ఐడి కార్డులు ఇచ్చేసి సమాజం మీదకు పంపుతున్నాయి. ఇదే అదునుగా చేసుకుని వార్త అంటే తెలియని వారు, అక్షరం ముక్క రాయటం రానివారు సామాజిక స్పృహ మచ్చుకైనా లేని వారు సైతం బెదిరించటం ఎజెండాగా చేసుకుని జర్నలిస్టుగా రాణిస్తున్నారు. జర్నలిజం పరువును బజారున పడేస్తున్నారు. ఇప్పటికే పడేశారు. గౌరవమైన వృత్తిగా సమాజానికి మూలస్తంభంగా పిలువబడే మీడియా వీరి అరాచకాల దాటికి కృంగిపోతోంది. బయటకు వెళ్తే చాలు జేబులో ఉన్న ఐడి కార్డు చూపించి, సామాన్యులు మొదలుకొని వ్యాపారుల వరకు బెదిరించటం, స్వీయ లబ్ది పొందటం పరమావధిగా మారుతుంది. ఇదంతా యాజమాన్యాలకు తెలియదా అంటే పొరపాటే. వారు అడిగినటువంటి సంవత్సరం చందాలు, ప్రకటనలు చేస్తే మీ ఇష్టం అన్న చందంగా స్వేచ్ఛను ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. పత్రికా స్వేచ్ఛ స్థానంలో బెదిరించే స్వేచ్ఛ వచ్చి చేరిందని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదు. అడిగినన్ని డబ్బులు చెల్లిస్తే సన్మానాలు చేసి మరీ కేసులు ఉన్నవారికి సైతం రిపోర్టర్ గా ఐడి కార్డు , అక్రిడిటేషన్ సైతం ఇచ్చేస్తూ, స్వలాభాన్ని పొందుతున్నారు. దీనిని క్యాష్ చేసుకుంటూ బడ్డీ కొట్లు, మాంసం, చేపల మార్కెట్లు, ఇతర స్టాల్స్, రేషన్ మిల్లులు, నూనె దుకాణాలు వద్ద ఆయా కార్డులు చూపుతూ, బెదిరింపులకు తెరలేపుతున్న దుస్థితి నెలకొంది. అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చి వార్తలు ప్రచురించి వాటి పరిష్కారానికి కృషి చేసి తగిన మార్గం చూపితే ఎవరూ కాదనరు. కానీ ఐడీ కార్డు చూపి బ్లాక్ మెయిలింగ్ కు దిగటం వృత్తిని నవ్వుల పాలు చేయడంతో పాటు మిగిలిన జర్నలిస్టులకు కూడా ఆ మరకలను అంటించినవారవుతున్నారు. దీనిని చూసి జర్నలిస్టులు అందరూ ఇంతే ఉంటారనుకుంటా అంటూ సామాన్యులు ముక్కున వేలేసుకునే పరిస్థితి నెలకొంది. దీని ప్రభావం మిగిలిన జర్నలిస్టులపై కూడా పడటం నిజంగా బాధాకరం.

**“కనీస విద్యార్హత ఉంటేనే అక్రిడేషన్... ఈ నిబంధన తెస్తేనే కొంతైనా మార్పు.!**

స్వీపర్ ఉద్యోగానికి సైతం ఏడవ తరగతి లేదా పదో తరగతి విద్యార్హతను నిర్దేశిస్తున్నారు. కానీ పవిత్రమైన వృత్తిగా భావించే సమాజాన్ని ప్రభావితం చేస్తూ, అనేక సమస్యల పరిష్కారానికి నాంది పలికే జర్నలిస్టు ఉద్యోగానికి విద్యార్హత నిర్దేశించలేదు. ఇకనైనా ప్రభుత్వాలు దృష్టి సారించాలి. అందుకు మండల స్థాయి విలేఖరికి కనీస విద్యార్హత ఇంటర్మీడియట్, జిల్లా స్థాయి విలేఖరికి డిగ్రీ నిర్దేశిస్తూ జీవో తీసుకురావాలి. అలా విద్యార్హత ఉంటేనే అక్రిడేషన్ ఇచ్చేలా నిబంధన రూపొందించాలి. ఈ నిబంధన పాటించకుండా కనీస విద్యార్హతలు లేని వారికి ఐడి కార్డ్ జారీ చేసే మీడియా సంస్థలపై చర్యలు తీసుకోవాలి. దీనివలన సమాజంలో జర్నలిజానికి విలువ పెరగటంతో పాటు స్క్రాప్ బ్యాచ్ కొంతైనా తగ్గే అవకాశం ఉంటుంది.

**మీ... శ్రేయోభిలాషి బాన్సాడ వెంకటేష్ జర్నలిస్ట్**

## శంషాబాద్ విమానాశ్రయంలో రూ. 2.37 కోట్ల విలువైన బంగారం పట్టివేత

**%కువైట్ నుంచి షార్జా మీదుగా హైదరాబాద్‌కు వచ్చిన ప్రయాణికుడు**

**డీఆర్ఐ అధికారుల తనిఖీల్లో 7 బంగారు కడ్డీలు గుర్తింపు**

**1.8 కిలోల బరువు ఉన్న ఈ కడ్డీల విలువ రూ. 2.37 కోట్లు ఉంటుందని అంచనా**

శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. కువైట్ నుంచి షార్జా మీదుగా హైదరాబాద్ చేరుకున్న ఒక ప్రయాణికుడిని డీఆర్ఐ అధికారులు తనిఖీ చేయగా, అతని వద్ద 7 బంగారు కడ్డీలు లభ్యమయ్యాయి.

సుమారు 1.8 కిలోల బరువున్న ఈ బంగారు కడ్డీల విలువ సుమారు రూ. 2.37 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రయాణికుడి నుంచి స్వాధీనం చేసుకున్న వాటిలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 5 బంగారు బిస్కట్లు, రెండు కట్ పీసులు ఉన్నాయి. అధికారులకు అనుమానం రాకుండా వాటిని లగేజీ డోర్ మెటాలిక్ లాక్‌లో కొంత భాగాన్ని, అలాగే పొద్దు తిరుగుడు గింజలు ఉన్న ప్లాస్టిక్ పౌచ్‌లో మరికొంత బంగారాన్ని దాచి తరలించే ప్రయత్నం చేశాడు.

## సిపిఆర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**గుండెపోటుకు గురైన వ్యక్తులను సిపిర్ చేసి ప్రాణాలను కాపాడొచ్చు**

**సిపిర్ పై గ్రామాలలో, పట్టణాలలో అవగాహన పెంచేందుకు కృషి చేయాలి**

**సిపిఆర్ విధానంపై ప్రతిజ్ఞ చేసిన కలెక్టర్, వైద్యాధికారులు.**

**సిపిఆర్ విధానాన్ని చేసి చూపించిన కలెక్టర్**

సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా :సిపిఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిపించుకోవాలని ,ఆకస్మిక గుండెపోటుకు గురైన వ్యక్తులకు సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను రక్షించవచ్చని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవగహన అవసరమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.

గురువారం ఐడిఓసి సమావేశము హాలు నందు జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సిపిఆర్ (కార్డియో పల్మోనరీ రిససిటేషన్) సి పి ఆర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీపీఆర్ పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని,ప్రజల జీవితంలో అకస్మాత్తుగా కొందరికి గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాంటి వారికి సీపీఆర్‌తో ప్రథమ చికిత్స అందజేస్తే ప్రాణా పాయ స్థితి నుండి బయట పడుతారన్నారు. ఓ వ్యక్తికి ఆకస్మిక కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు, వైద్య సహాయం అందేలోపు ఛాతీని 120 సార్లు నొక్కి, 2 శ్వాసలు ఇవ్వడం (120:2 రేషియో) ద్వారా గుండెను సాధారణ స్థితికి తీసుకు రావచ్చని తెలిపారు. కార్డియాక్ హెల్త్ కేర్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు జిల్లాలో ఈనెల 13 నుంచి 17 వరకు వారం రోజులపాటు సిపిఆర్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానంపై గ్రామాలలో మరియు పట్టణాలలో అందరిలోనూ సి పి ఆర్ పై అవగాహన పెంచేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్వయంగా చేతులతో సీపీఆర్ విధానాన్ని చేసి చూపించారు. దీని ప్రాధాన్యతను అధికారులకు వివరించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్స్ డాక్టర్ నిఖిల్ ,డాక్టర్ నిరోషా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి ప్రయోగపూర్వకంగా సిపిఆర్ ఎలా చేయాలో క్షుణ్ణంగా వివరించారు. అవగాహన కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్, వైద్యాధికారులు సిపిఆర్ ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ మంగీ లాల్ , జిల్లా వైద్య అధికారి డాక్టర్ పవిత్ర , డిప్యూటీ డిఎంహెచ్ఓ రవీందర్ యాదవ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ ఈనెల 18 వరకు దరఖాస్తుల స్వీకరణ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా : వికారాబాద్ జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినీ, విద్యార్థులు, గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 18 వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా వికారాబాద్ తెలంగాణా సాంఘీక సంక్షేమ గురుకుల పాటశాల కొత్త గడి (బాలికల) గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు సమమర్పించాలని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు హాల్ టికెట్, ర్యాంకు ధ్రువీకరణ పత్రాలు, ఆదాయం సర్టిఫికెట్ లకు సంబంధించి నకలు ప్రతులు జత పరచాలని సూచించారు.

## ఎల్ఐసీ నుంచి మహిళల కోసం ప్రత్యేక పాలసీ.. తక్కువ కాలం ప్రీమియం.. ఎక్కువ ప్రయోజనాలు!

దేశంలోని అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసీ రెండు సరికొత్త పాలసీలను మార్కెట్లోకి విడుదల చేసింది. సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని 'జన సురక్ష' (ప్లాన్ 880), ప్రత్యేకంగా మహిళల కోసం 'బీమా లక్ష్మి' (ప్లాన్ 881)ని అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఈ పాలసీలపై జీఎస్టీని తొలగించిన తర్వాత వీటిని తీసుకురావడం గమనార్హం. ముఖ్యంగా మహిళల ఆర్థిక భద్రతకు భరోసా ఇచ్చేలా రూపొందించిన 'బీమా లక్ష్మి' ప్లాన్ భారీ ప్రయోజనాలను అందిస్తోంది.

'బీమా లక్ష్మి' అనేది మార్కెట్‌తో సంబంధం లేని (నాన్-లింక్డ్) ప్లాన్. ఇది జీవిత బీమా కవరేజీతో పాటు క్రమం తప్పని పొదుపును ప్రోత్సహిస్తుంది. ఈ పాలసీ తీసుకున్న మహిళలకు ఏటా తాము చెల్లించే ప్రీమియంపై 7 శాతం చొప్పున గ్యారెంటీ అడిషన్స్ లభిస్తాయి. పాలసీ వ్యవధి ముగిశాక మెచ్యూరిటీ ప్రయోజనాలతో పాటు ఈ హామీ మొత్తం కూడా అందుతుంది.

ఈ పాలసీలో చేరడానికి కనీస వయసు 18 ఏళ్లు కాగా, గరిష్ఠ వయోపరిమితి 50 ఏళ్లుగా నిర్ణయించారు. పాలసీ కాలపరిమితి 25 సంవత్సరాలుగా ఉన్నప్పటికీ, ప్రీమియం చెల్లించే వ్యవధిని మాత్రం 7 నుంచి 15 సంవత్సరాల మధ్య ఎంచుకునే వెసులుబాటు కల్పించారు. కనీస బీమా హామీ (సమ్ అష్యూర్డ్) రూ. 2 లక్షలు ఉండగా, గరిష్ఠ పరిమితి అంటూ ఏదీ లేదు. పాలసీదారులు తమ ఆర్థిక స్తోమతకు అనుగుణంగా ఎంత మొత్తానికైనా పాలసీ తీసుకోవచ్చు. తమకు నచ్చినట్లుగా రూ.10 లక్షలు, రూ.20 లక్షలు, రూ.50 లక్షలు అంటూ ఎంతైనా ఎంచుకోవచ్చు. అయితే, దానికి తగినట్లుగానే ప్రీమియం కట్టాల్సి ఉంటుంది.

ఈ ప్లాన్‌లో కొన్ని పరిమిత ఆరోగ్య చికిత్సలకు కూడా కవరేజీ ఉంటుంది. అదనపు ప్రీమియం చెల్లించడం ద్వారా మహిళల కోసం ప్రత్యేకంగా 'క్రిటికల్ కేర్ రైడర్' వంటివి కూడా జోడించుకోవచ్చు.

## పంట మార్పిడి - రైతు లాభాల దిశగా అడుగు - ఎమ్మెల్యే కాలే యాదయ్య







సత్యమేవ జయతే – వికారాబాద్ జిల్లా / నవాబ్‌పేట్, అక్టోబర్ 16 :

నవాబ్‌పేట్ మండలంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్.ఎఫ్.ఎస్.ఎం) మరియు జాతీయ నూనెగింజల మిషన్ (ఎన్.ఎం.ఇ. ఓ – ఓ.ఎస్) పథకాల కింద రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.

విత్తనాల వివరాలు పంట మార్పిడిని ప్రోత్సహించే ఉద్దేశంతో శనగ మరియు కుసుమ విత్తనాల మినీ కిట్లు రైతులకు అందజేశారు. శనగ: 100 కిట్లు, ఒక్కో కిట్ 25 కేజీలు, ఒక్కో కిట్కు ₹1500 సబ్సిడీ. కుసుమ: 170 కిట్లు, ఒక్కో కిట్ 4 కేజీలు, ఒక ఎకరానికి సరిపడే పరిమాణం. పంట మార్పిడి ప్రాధాన్యత

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ, "నాణ్యమైన విత్తనాలు వాడితేనే పంట దిగుబడులు పెరుగుతాయి. పంట మార్పిడి ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చు, వ్యయాలను తగ్గించుకోవచ్చు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తోంది," అని పేర్కొన్నారు. అదేవిదంగా వరి పంటతో పోలిస్తే శనగ సాగుకు తక్కువ నీరు అవసరం అవుతుందని, మార్కెట్‌లో శనగకు మంచి డిమాండ్ ఉందని చెప్పారు. తక్కువ పెట్టుబడితో రైతులు మెరుగైన లాభాలు పొందవచ్చని సూచించారు. ప్రభుత్వ పథకాల వినియోగం రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు మరియు ఆధునిక సాగు పద్ధతుల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య కోరారు. నీటి నిర్వహణ, పంట విస్తీర్ణ నిర్వహణ, నాణ్యమైన విత్తనాల సరఫరా వంటి అంశాలలో ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అదనంగా, పంపిణీ చేసిన విత్తనాలను తదుపరి పంటలకు భద్రపరచుకోవాలని, తోటి రైతులతో పంచుకోవాలని సూచించారు.

పాల్గొన్న ప్రముఖులు కార్యక్రమంలో పిపిఎస్ సి చైర్మన్ రాం రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీత సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం, వ్యవసాయ అభివృద్ధి అధికారి వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ప్రజాప్రతినిధులు, మాజీప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం అక్టోబర్ 18న నవాబ్ పేట్ బంద్!







### బీఆర్ఎస్, బీజేపీ సంపూర్ణ మద్దతు

సత్యమేవ జయతే -వికారాబాద్ జిల్లా / నవాబ్ పేట్, అక్టోబర్ 16: తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్త బంద్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చింది.

ఈ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలంలో బంద్‌ను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గొల్ల విజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

గొల్ల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ నాయకులు గురువారం మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు.

స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలకు వినతిపత్రాలు సమర్పించి, అక్టోబర్ 18న సెలవు ప్రకటించి బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.

"42 శాతం బీసీ రిజర్వేషన్లకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు శ్రీ ఆర్. కృష్ణయ్య గారు ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపు మేరకు నవాబ్ పేట్ మండలంలో సంపూర్ణ బంద్ పాటించాలి," అని గొల్ల విజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్, బీజేపీ మద్దతు

రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం పిలుపునిచ్చిన ఈ బంద్‌కు బీఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి) మరియు బీజేపీ (భారతీయ జనతా పార్టీ) సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఈ రెండు పార్టీల మద్దతు బీసీల ఉద్యమానికి మరింత బలం చేకూర్చిందని నాయకులు అభిప్రాయపడ్డారు.

గొల్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ, "బీసీల హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటానికి రాజకీయాలకు అతీతంగా అందరూ మద్దతు ఇవ్వాలి. 42 శాతం రిజర్వేషన్లు దక్కే వరకు ఈ పోరాటం కొనసాగుతుంది," అని తెలిపారు.

## అమెరికాలోని భారత టెక్కీలకు శుభవార్త.. హెచ్-4 వీసాదారులకు భారీ ఊరట

అమెరికాలో నివసిస్తున్న వేలాది భారతీయ టెక్ నిపుణుల కుటుంబాలకు శుభవార్త అందింది. హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు (హెచ్-4 వీసా హోల్డర్లు) అమెరికాలో ఉద్యోగాలు చేసుకునే హక్కును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి యూఎస్ సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో దాదాపు దశాబ్ద కాలంగా కొనసాగుతున్న న్యాయపోరాటానికి తెరపడినట్లయింది. ఈ నిర్ణయంతో వేలాది భారతీయ కుటుంబాల్లో నెలకొన్న అనిశ్చితి తొలగిపోయి, వారిలో ఆనందం వెల్లివిరిసింది.

హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు ఉద్యోగాలు చేసుకునేందుకు అనుమతించే 'హెచ్-4 ఈఏడీ' (ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్) విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ 'సేవ్ జాబ్స్ యూఎస్ఏ' అనే సంస్థ చాలా కాలంగా న్యాయపోరాటం చేస్తోంది. ఈ విధానం వల్ల అమెరికన్ల ఉద్యోగావకాశాలు దెబ్బతింటున్నాయని ఆ సంస్థ వాదిస్తోంది. అయితే, ఈ పిటిషన్‌పై విచారణ జరపడానికి సుప్రీంకోర్టు ఆసక్తి చూపలేదు. ఫలితంగా కింది కోర్టు ఇచ్చిన తీర్పు అమల్లో ఉంటుంది. అంటే హెచ్-4 వీసాదారుల ఉద్యోగ హక్కు ఇకపై కూడా కొనసాగుతుంది.

2015లో నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకుని, ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు ఇది ఒక వరంలా మారింది.

## ఎడిటోరియల్

# సబ్సిడీ కట్

# వేలాడుతున్న కత్తి



పోషక విలువలు గల ఎరువులపై ఇస్తున్న సబ్సిడీని తగ్గించాలని కేంద్రం నిర్ణయించడం రైతుల పాలిట అశని పాతం వంటిది. రుతుపవనాల రాక ఆలస్య మవుతుంద న్న వార్తలు రైతుల్లో గుబులు పుట్టిస్తున్న తరుణంలో ఇప్పుడు ఈ వార్త నిజానికి అశనిపాతమే. దేశంలో ఎరువుల వాడకం ఈమధ్యకాలంలో బాగా పెరిగింది. అయితే, అన్ని వస్తువుల మాదిరిగానే ఎరువులలో కూడా కల్తీ జరుగుతోంది.దాంతో ఎరువుల వాడకాన్ని తగ్గించాలని నరేంద్రమోడీ ప్రభుత్వం రైతులకు పిలుపు ఇస్తోంది. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని రాష్ట్రాలను ఆదేశించింది. అయితే ,రైతుల్లో సెంటిమెం ట్లు ఎక్కువ. పొరుగువారు ఏ పద్ధతిలో వ్యవసాయం చేస్తే అదే పద్ధతిలో చేయాలని చాలా మంది భావిస్తుంటా రు. పక్క పొలంలో ఫలానా ఎరువులు వేస్తే మనం కూడా అదే తరహా ఎరువులు వేయాలని భావిస్తుంటారు. సేంద్రి య వ్యవసాయం అనేది తరతరాలుగా రైతులు అనుస రిస్తున్న విధానమే. మంచిదని చెప్పినా రైతులు నమ్మే పరిస్థితి ఇప్పుడు లేదు.

ముఖ్యంగా, ఎక్కువ పోషక విలు వలు గల ఎరువుల వాడకంవల్ల ఆహార ధాన్యాల దిగుబడి ఎక్కువ వస్తుందన్న ఆశతో ఎంత డబ్బు ఖర్చ యినా ఆ తరహా ఎరువులను వాడుతూ ఉంటారు. ఎరువుల వ్యాపారంపై ప్రభుత్వ నిఘాలేదు. చాలా మంది ఎక్కడి నుంచో తెచ్చి ఎరువులను వాడుతూ ఉంటారు. ఎరువుల సబ్సిడీని కేంద్రం దశలవారీగా తొలగిస్తుందని మోడీ అధికారంలోకి రాగానే ప్రకటించా రు. అప్పటి నుంచి ప్రత్యామ్నాయాలను చూసుకోవాల ని రైతులను హెచ్చరిస్తున్నా, వారు గడిచిన ఆరేడేళ్ళలో ఎక్కువ మోతాదులో ఎరువులను వాడటం మొదలు పెట్టారు. గుజరాత్‌లో ఎరువుల వాడకాన్ని తగ్గించేందు కు మోడీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన ప్రయత్నా లు ఫలించాయి. దాంతో ఆయన డీఏపీ ఎరువుల బదులు సేంద్రియ వ్యవసాయాన్ని అనుసరించాలంటూ ప్రచా రం ప్రారంభించారు.

దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి బాగా పెరగడానికి ఎరువులు కారణమని వాదించేవారు న్నారు. ఎరువులతో పాటు నీటివనరుల పెంపు కూడా అవసరమేనని తెలంగాణలో తెరాస ప్రభుత్వం రుజువు చేసింది. ప్రాథమికంగా మన దేశం వ్యవసాయిక దేశం కావడం వల్ల పంటలను ప్రోత్సహించాలన్న నినాదం మంచిదే కానీ,ఎరువులు వాడనిదే వ్యవసాయం చేయలేమనే వాదన సహేతుకమైనది కాదు. రసాయినిక ఎరువులు లేకుండా సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా ఇబ్బడిముబ్బడిగా పంటలను పండించే రైతులు మన ప్రాంతాల్లో చాలా మంది ఉన్నా రు. ఎరువుల ధరపెరిగి పోవడంతో వ్యవసాయం ఖర్చు లు కూడా బాగా పెరిగి పోయాయి. ఎరువులపై కొత్త సబ్సిడీ రేట్ల గురించి ప్రభుత్వవర్గాల నుంచి ఇదమిత్థంగా సమాచారం వెలు వడలేదు,కానీ, అనధికార వర్గాల ద్వారా పుంఖానుపుం ఖాలుగా సమాచారం వెలువడుతోంది.అనధికార సమాచారాన్ని బట్టి నత్రజని ఎరువుల సబ్సిడీ తగ్గిస్తే వాటి ధరలు ధరలు కిలోకు 22రూపాయిలు పైన పెరగ వచ్చు.అలాగే, పొటాషియం ఎరువుల సబ్సిడీ తగ్గిస్తే, ్కటతులపై ఎనిమిది రూపాయిలుపైగా అదనపు భారం పడుతుంది. పాస్ఫేట్‌కు గతంలో 25.70 పైసలున్న సబ్సిడీ ఇప్పుడు 15.91 పైసలకు తగ్గుతుంది. సల్ఫర్‌కు కిలో సబ్సిడీ 2.84కు బదులుగా 2.80 పైసలు ఉంటుంది. ఇవి అధికారిక లెక్కలు కావు. ప్రభుత్వ నిర్ణయం అమలు లోకి వచ్చిన తర్వాత ఎరువుల ధరలు పెరగవచ్చు. రైతు లు ప్రకృతి వైపరీత్యాల వల్ల విపరీతంగా నష్టపోతున్నా రు. ముఖ్యంగా, అకాల వర్షాలు కొన్ని చోట్ల, వర్షాభావ పరిస్థితిలు చాలా చోట్ల నెలకొని ఉండటం వల్ల రైతులకు పెట్టుబడి వ్యయం కూడా లభించడం లేదు. ఎరువుల వాడకం అధికం కావడం వల్ల రైతుల పెట్టుబడి వ్యయం బాగా పెరిగిపోయింది. నీటి సౌకర్యాలు పెరిగినా ఆ మేరకు ఎరువులు, క్రిమిసంహారక మందుల వ్యయం తడిసి మోపెడు కావడంవల్ల రైతులకు వ్యవసాయం గిట్టుబాటుకావడంలేదు.ఎంత ఆదాయం వస్తుందనే గ్యారంటీ లేదు. వ్యవసాయం అప్పుడూ ఇప్పుడూ కూడా దైవాధీనంగానే తయారైంది. ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే పథకాలు, వాటి ద్వారా అందించే సాయం రైతులకు ప్రచారానికే తప్ప వాస్తవంగా రైతులకు మేలు చేకూర్చ డం లేదు. సంప్రదాయక పద్దతులను పాటించాలని రైతులకు ఎంత నచ్చచెప్తున్నా, వారు ఆధునిక పద్దతుల పేరిట ఎరువుల వాడకానికే ప్రాధాన్యం ఇస్తు న్నారు. రైతుల సమస్యలపై వరుసగా ఏడాదిపాటు ఢిల్లి%ు% సమీపం లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ఆందోళన నిర్వహించారు. వారి ఆందోళనకు తలొగ్గి కొత్త వ్యవసాయచట్టాలను ప్రభుత్వం ఉపసంహరించి నప్పటికీ, మరో రూపంలో ఆ చట్టాలను తె చ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందంటూ తరచూ వచ్చే వార్తలు రైతుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. అటు ప్రకృతి, ఇటు ప్రభుత్వ విధానాలతో రైతులు నిరంతం చింతతో జీవిస్తున్నారు.

# అధిక జనాభా మన దేశానికి వరమా? శాపమా?



భారతదేశ జనాభాలో సగం మంది 30 ఏండ్లలోపు వారు. అంటే, దాదాపు 72 కోట్ల మందితో కూడిన యువశక్తి ఉన్న దేశం మనది. ప్రపంచంలో ఏ దేశం వద్దా ఇంతటి యువశక్తి లేదు. సరైన విద్యను అందించటం ద్వారా, ఉద్యోగ నైపుణ్యాలకు సంబంధించి నిరంతర శిక్షణ ఇవ్వటం ద్వారా యువశక్తి ప్రతిభ సామర్థ్యాలను దేశం ఉపయోగించుకోవచ్చు.

చైనాను అధిగమించి, ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ అవతరించింది. ఈ నేపథ్యంలో అనేక వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం భారత్ జనాభా 143 కోట్లు. 2060ల నాటికి ఇది 170 కోట్ల గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని, ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పడుతుందని అంచనాలున్నాయి. ఈ లెక్కల సంగతి ఎలా ఉన్నా.. అధిక జనాభా మన దేశానికి వరమా? శాపమా?%ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ప్రపంచ జనాభా 800 కోట్లను దాటింది. 2050 నాటికి 970 కోట్లకు చేరుకోవచ్చు. 2080 నాటికి 1040 కోట్లకు పెరిగి, అక్కడ స్థిరంగా ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

భారతదేశ జనాభాలో సగం మంది 30 ఏండ్లలోపు వారు. అంటే, దాదాపు 72 కోట్ల మందితో కూడిన యువశక్తి ఉన్న దేశం మనది. ప్రపంచంలో ఏ దేశం వద్దా ఇంతటి యువశక్తి లేదు. సరైన విద్యను అందించటం ద్వారా, ఉద్యోగ నైపుణ్యాలకు సంబంధించి నిరంతర శిక్షణ ఇవ్వటం ద్వారా యువశక్తి ప్రతిభ సామర్థ్యాలను దేశం ఉపయోగించుకోవచ్చు. ప్రస్తుతం వృద్ధి రేటు దాదాపు ఆరు శాతంగా నమోదవుతున్నది. ద్రవ్యోల్బణం, ప్రపంచవ్యాప్తంగా మాంద్యం, అంతర్జాతీయంగా భౌగోళికంగా, రాజకీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు వంటి సమస్యలున్నా భారత్ తన జనాభాను ముఖ్యంగా యువతను సరైన విధంగా వినియోగించుకుంటే అద్భుతమైన ప్రగతిని నమోదు చేయవచ్చని అంతర్జాతీయ సంస్థలు, నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే.

అధిక జనాభా ఉండటం సానుకూలతే కానీ దానితో ఉండే సమస్యలు దానికున్నాయి. జనాభాను దేశానికి పరిమితమైన అంశంగా కాక, అంతర్జాతీయంగా ప్రభావం చూపే అంశంగా గుర్తించాలి. ముఖ్యంగా వాతావరణ మార్పులు కీలకమైనవి. భూమ్మీద జీవ వైవిధ్యానికి ఎదురవుతున్న సవాళ్లపై ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యూఎన్‌ఎఫ్‌సీసీసీ ఎప్పటికప్పుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ప్రతికూల వాతావరణ మార్పుల వల్ల ప్రజల వలసలు రానున్న రోజుల్లో విపరీతంగా పెరిగిపోయే అవకాశం ఉన్నదని ఈ సంస్థ చెప్తున్నది. అధిక జనాభా వల్ల నివాసయోగ్యమైన ప్రాంతాలు కుదించుకుపోతున్నాయి. దీవులు, తీరప్రాంతాలు మునిగిపోతున్నాయి. మనుగడ కోసం వన్యప్రాణులకు, మనుషులకు మధ్య ఘర్షణ పెరిగే ప్రమాదం ఉన్నది. నాణ్యమైన నీళ్లు, గాలి తగ్గుతున్నాయి. ఇవన్నీ ఏవో కాకిలెక్కలు కావు. ప్రపంచవ్యాప్తంగా తరచూ వెలువడుతున్న పరిశోధనల నివేదికలు, అధ్యయనాలు చేస్తున్న హెచ్చరికలు. అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ వీటిని విస్మరించకూడదు. కచ్చితంగా వీటిపై అధ్యయనం జరిపి, తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.జీవన పరిస్థితులు దుర్భరంగా ఉన్న ఆసియా, ఆఫ్రికాల్లోని పేద దేశాల్లో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉంటున్నది. ఈ దేశాల్లో ప్రజలు ప్రకృతి కారణంగానే గాక ప్రభుత్వపరంగా ఎదురవుతున్న వివక్ష, నిర్లక్ష్యం వల్ల కూడా పెద్ద సంఖ్యలో ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. దీనికి పూర్తి భిన్నంగా, అత్యాధునిక దేశాల్లో జనాభా క్రమంగా తగ్గుతూ వస్తున్నది.వృద్ధుల సంఖ్య పెరిగిపోయి శ్రామికుల సంఖ్య తగ్గటం ఈ దేశాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. పెరిగిపోతున్న వృద్ధ జనాభాకు అవసరమైన వైద్య చికిత్సలను అందించటం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పలు ధనిక దేశాల్లో ఇప్పుడు ఈ సమస్య ఉన్నది. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకైతే ఈ వ్యయాన్ని భరించటం దాదాపుగా అసాధ్యం.

గత శతాబ్ద కాలంలో ఔషధ రంగంలో చోటుచేసుకుంటున్న అత్యాధునిక మార్పుల వల్ల మానవ జీవితకాలం దాదాపు రెట్టింపయ్యింది. ఆయుః ప్రమాణం మరింత పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. తరచూ ఏదో ఒక చికిత్స తీసుకునే వృద్ధ జనాభాతోనే తమకు ఎక్కువ లాభం కాబట్టి, మానవ ఆయుః ప్రమాణం పెరుగుదలలో ఔషధరంగం (ఫార్మా ఇండస్ట్రీ) పాత్ర కూడా లేకపోలేదన్న వాదనలున్నాయి.

అభివృద్ధి మార్గాన ఉన్న భారతదేశం, 100వ స్వాతంత్ర్య దినోత్సవాల నాటికి, అంటే 2047 నాటికి 'అభివృద్ధి చెందిన దేశం' హోదాను సంతరించుకోవచ్చు. ఈలోపు జరిగే మార్పులను ఎలా ఎదుర్కొంటామన్నదే అసలు సమస్య. పెరుగుతున్న జనాభా వల్ల భూమి, అడవులు, జల వనరులు, గాలి వంటి సహజ వనరులపై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. 2019లో దేశ జనాభాలో అరవై ఏండ్లు లేదా అంతకన్నా ఎక్కువ వయసున్న వారు పది శాతమే. కానీ, 2050 నాటికి వారి సంఖ్య 19.6 శాతానికి పెరుగుతుంది. అంటే, మరో 25 ఏండ్లపాటు మన వద్ద తిరుగులేని యువశక్తి ఉన్నప్పటికీ, వృద్ధుల సంఖ్య కూడా తక్కువేమీ ఉండదు. వీరి సంఖ్య దాదాపు 30 కోట్లకు చేరుకుంటుంది. వీరందరికీ గౌరవనీయమైన జీవనాన్ని కల్పించటం చిన్న సవాలేమీ కాదు.సంతానోత్పత్తి రేటు తక్కువగా ఉన్న కేరళలో గత 30 ఏండ్ల వ్యవధిలో 65 ఏండ్ల వయస్సు వారి సంఖ్య రెట్టింపయ్యింది.

ఆ రాష్ట్ర జనాభాలో వారి వాటా 12 శాతానికి చేరుకున్నది. జనాభా నియంత్రణలో కేరళతో పోటీ పడుతున్న పలు రాష్ట్రాల్లోనూ ఈ ధోరణే కనిపించనున్నది. కాబట్టి, చైనాను అధిగమించి భూగోళం మీద అత్యధిక జనాభా రికార్డు సృష్టించామని చెప్పుకునేముందు దానితోపాటు వచ్చే సమస్యలపైనా దృష్టిపెట్టాలి. ఆ సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమవుతాయి. ప్రజలకు నాణ్యతతో కూడిన జీవనాన్ని ఇవ్వటానికి ధైర్యంతో కూడిన నిర్ణయాలు, మెరుగైన విద్య, వైద్యం, నైపుణ్యాలు, ఉద్యోగాలు అవసరమవుతాయి.

వీటన్నింటిపై ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తుల స్థాయిలో సమగ్రమైన కార్యాచరణ జరుగాలి. జనాభాలో చైనాను అధిగమించినప్పటికీ, భారత జనాభా వృద్ధి రేటు నెమ్మదిస్తున్నది. 1971-81 మధ్య ఏటా సగటున 2.2 శాతం చొప్పున జనాభా పెరుగగా, 2001-11 నాటికి 1.5 శాతానికి తగ్గింది. ప్రస్తుతం దీనికంటే తక్కువగా ఉం ది. భారతీయ మహిళల సగటు సంతానోత్పత్తి 1960లలో ఆరు ఉండగా, ప్రస్తుతం రెండుకు తగ్గింది.

# మీడియా స్వేచ్ఛను హరిస్తున్న బీజేపీ..

# జర్నలిస్టులపై దేశద్రోహం, ఉపా చట్టం కేసులు




కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి నాలుగవ స్తంభం అయిన మీడియాను నిర్దాక్షిణ్యంగా నరికింది, నరుకుతున్నది. మీడియా స్వేచ్ఛను హరించివేస్తున్నది. జర్నలిస్టులను తొక్కిపెట్టి అసలైన వార్తలు బయటికి రాకుండా చూస్తున్నది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అత్యధిక జర్నలిస్టులు హత్యలకు గురికావడం గమనించవలసిన విషయం. ఇది అత్యంత ఖండనీయం.

పద్నాలుగేండ్ల నుంచి జర్నలిస్టులు కోర్టులో తన్లాడుతుంటే, వారి బాధను చూడలేక కేసీఆర్ ప్రభుత్వం అఫిడవిట్ ఇచ్చింది. లేకపోతే బెంచి ముందుకు రావటానికే కొన్నేండ్లు పట్టేది. ఈ తీర్పు రాకముందే మధ్యంతర తీర్పు వచ్చిన సందర్భంలోనే ఈ 70 ఎకరాల్లో 32 ఎకరాలు జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీకి ప్రభుత్వం అప్పగించింది. ఏనుగు లాంటి తీర్పునే బయటపడేసిన కేసీఆర్.. తోక లాంటి 38 ఎకరాలు అప్పగించే పని సులవుగా చేస్తారు.ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం జర్నలిస్టులను, మీడియాను అణచివేస్తూ కార్పొరేట్ల సహాయంతో మీడియా వ్యవస్థను తన కబంధ హస్తాల్లోకి లాక్కున్నది. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే మీడియాను పగబట్టి అణచివేస్తున్నది.

సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలతో దాడులు చేస్తూ మీడియాను భయపెడుతున్నది. మోదీ ప్రభుత్వం గత తొమ్మిదేండ్లుగా మీడియాను కూకటివేళ్లతో నరికివేసే చర్యలకు పాల్పడ్డది. వందలాది జర్నలిస్టులపై దేశద్రోహం, ఉపా చట్టం కేసులు పెట్టింది. అత్యంత సర్క్యులేషన్ ఉన్న 'దైనిక్ భాస్కర్' లాంటి హిందీ పత్రికపై దాడులు, 'భారత్ సమాచార్' వంటి న్యూస్ ఛానల్‌పై దాడులు, 'న్యూస్ క్లిక్ పోర్టల్'పై కేసులు నమోదు చేయించింది. అందులో పనిచేసే జర్నలిస్టులపై దేశద్రోహం కేసులు పెట్టించింది.మీడియా వన్ మలయాళంకు చెందిన న్యూస్ ఛానల్ ప్రసారాలకు అనుమతి ఇవ్వకపోవడం లాంటి చర్యలు మోదీ హయాంలోనే జరిగాయి. ఆ తర్వాత ఆ ఛానల్ యాజమాన్యం కోర్టుకుపోవడంతో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టింది. వెంటనే ఆ మీడియా వన్ మలయాళం ఛానల్‌కు అనుమతులు ఇవ్వాలని ఆదేశించింది. ఇదంతా గత నెలలోనే జరిగింది. ఇలా సుప్రీంకో ర్టు జోక్యంతోనే మీడియాకు స్వేచ్ఛ, అనుమతులు లభించే పరిస్థితి ఒక్క మన దేశంలోనే ఉన్నది.పెగాసస్ స్పై పేరుతో 40 మంది జర్నలిస్టులపై కేంద్రం పెట్టిన నిఘా కూడా బయటపడింది. ఇండియన్ ప్రెస్ ఫ్రీడమ్-2020 ప్రకారం.. ఢిల్లీ మేధావులకు చెందిన రైట్ అండ్ రిసక్స్ ఎనాలసిస్ గ్రూప్ (ఆర్ఆర్జీ) 2020లో 226 మంది జర్నలిస్టులను, కొన్ని మీడియా సంస్థలను ప్రభు త్వ, ఇతర సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇందులో 13 మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారు. 37 మందిని నిర్బంధంలో ఉంచారు. 64 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరో 13 మంది జర్నలిస్టులకు షోకాజ్ నోటీసులిచ్చారు.

101 మంది జర్నలిస్టులపై భౌతికదాడులు జరిగాయి. జర్నలిస్టుల కుటుంబసభ్యులపై దాడులు, వారి ఇండ్ల మీద దాడులు చేసినట్టు ఈ గణాంకాలు చెప్తున్నాయి. పీటీఐ లాంటి న్యూస్ ఏజెన్సీ సంస్థకు రూ.84 కోట్ల జరిమానా విధించాలని కేంద్రం నోటీసులు కూడా జారీ చేసింది. వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారతదేశం 2020లో 180 దేశాలలో 142వ స్థానంలో ఉంటే ప్రస్తుతం 2023లో అది 161వ స్థానానికి దిగజారింది. ఇదీ మన భారతదేశంలో మీడియాకు దక్కిన గౌరవం. ఏ రకంగా ప్రజాస్వామ్యానికి నాలుగవ స్థంభమైన మీడియాను నరుకుతున్నారో కేంద్ర ప్రభుత్వ వైఖరిని చూస్తేనే అర్థమవుతుంది.తెలంగాణలోని జర్నలిస్టుల గౌరవంపై బీజేపీ నాయకుడు సన్నాయి నొక్కులు నొక్కుతూ.. రెచ్చగొట్టేవిధంగా రాసే రాతలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగానే ఉన్నది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకున్నది. కరోనా సమయంలో కొవిడ్ బారిన పడిన జర్నలిస్టులకు రూ.20 వేల నగదు సాయాన్ని అందజేసింది. అలాగే క్వారంటైన్‌లో ఉన్న జర్నలిస్టులకు రూ.10 వేల సహాయాన్ని అందించింది. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటుచేసి, ఆ నిధితో వచ్చే వడ్డీతో జర్నలిస్టుల సంక్షేమానికి పింఛన్ల రూపంలో, ఫీజుల రూపంలో జర్నలిస్టులకు ఆర్థిక సహాయం అందిస్తున్న ప్రభుత్వం తెలంగాణలోనే ఉన్నది.

చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష రూఎయల సహాయం చేసింది తెలంగాణ ప్రభుత్వమే. బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఇలాంటి సంక్షేమం లేదు. అక్రెడిటేషన్ కార్డుల సంఖ్య పెంచింది కూడా తెలంగాణ సర్కారే. ఉమ్మడి ఏపీ కంటే ఇప్పుడు తెలంగాణలో అక్రెడిటేషన్ కార్డుల సంఖ్య ఎక్కువ. కేసీఆర్ సర్కార్ ఈ రెండు, మూడేండ్లలోనే జర్నలిస్టుల సంక్షేమానికి ఆరేడు కోట్లు ఖర్చు చేసింది. మోదీ సర్కార్ జర్నలిస్టుల రైల్వే పాసులను తీసివేసింది. కేంద్రంలో జర్నలిస్టులజర్నలిస్టులు శ్రమశక్తి, మేధోశక్తిని ఎవరికోసం ఉపయోగిస్తున్నారు? మీడియా యజమానుల కోసం నైట్ డ్యూటీలు, రోడ్ల మీద పడిగాపులు, కంప్యూటర్ల మీద కూర్చొని జర్నలిస్టులు శ్రమ శక్తిని జీవితాంతం ధారపోస్తున్నారు. కానీ, యజమానులు జర్నలిస్టుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. అందుకే జర్నలిస్టులు ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలనిస్తున్నది. నియోజకవర్గ, మండల స్థాయిలో ఇస్తున్నది. జిల్లాస్థాయిలో ఇచ్చారు. కొన్నిచోట్ల ఇవ్వాల్సి ఉన్నది. హైదరాబాద్‌లో గతంలో ఇచ్చిన ప్రభుత్వాలు కూడా జర్నలిస్టులకు ఒక ప్రివిలేజ్‌గా ఒక గౌరవభావంతో ఇచ్చా యి. సమాజానికి జర్నలిస్టు లు చేస్తున్న సేవలో భాగం గా ఒక ప్రివిలేజ్‌లో ఈ సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తున్న ది. ఇంటి స్థలాల విషయం లో కూడా ప్రభుత్వం ఒక ప్రివిలేజ్‌గానే జర్నలిస్టులకు ఆనవాయితీగా హైదరాబాద్ లో స్థలాలు కేటాయిస్తూ వస్తున్నది.హైదరాబాద్ జర్నలిస్టులకు ప్రస్తుతం జర్నలిస్టు సొసైటీకి 70 ఎకరాల స్థలం సుప్రీంకోర్టు తీర్పు రావడానికి కారణం ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న చొరవే. కేసీఆర్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ ఇవ్వకపోతే ఈ తీర్పు వచ్చేది కాదు.

ఈ తీర్పు రాకముందే మధ్యంతర తీర్పు వచ్చిన సందర్భంలోనే ఈ 70 ఎకరాల్లో 32 ఎకరాలు జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీకి ప్రభుత్వం అప్పగించింది. బంతి భోజనాలంటే తెలియదు, ఎన్నడూ బంతి భోజనాలు పెట్టే సంప్రదాయం, సంస్కృతి తెలియని బీజేపీ నాయకుడు జర్నలిస్టుల స్థలాల విషయంపై వెటకారంగా బంతి భోజనాలతో పోల్చటం శోచనీయం. నోటికాడి బుక్కను కొట్టే రకం ఈ బీజేపీ నాయకుడు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇంత కృషిచేసిన ఇప్పటి ప్రభుత్వం మిగతా 38 ఎకరాలు కూడా సొసైటీకి అప్పగిస్తుందని నమ్మకం ఉన్నది. తెలంగాణ జర్నలిస్టులు రెచ్చగొడితే రెచ్చిపోయేవారు కాదు. ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు చేసిన కేసీఆర్ ప్రభుత్వం జర్నలిస్టుల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తుందనే ప్రగాఢ విశ్వాసం ఉన్నది.బీజేపీ నాయకుడు వాస్తవ విరుద్ధంగా రాతలు రాస్తూ జర్నలిస్టులను రెచ్చగొట్టే పని మొదలుపెట్టారు. మొత్తం మీడియానే కబ్జా చేసిన బీజేపీ, నీతి సూత్రాలు వల్లిస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగానే ఉన్నది. ఇక్కడ జర్నలిస్టులపై రాజద్రోహం కేసుల్లేవు. మోదీని విమర్శించినందుకే 149 మందిపై రాజద్రోహం కేసులు పెట్టారు. యూపీ ముఖ్యమంత్రి యోగిని విమర్శించిన మరో 144 మందిపై రాజద్రోహం కేసులు పెట్టారు. ఇందులో జర్నలిస్టుల శాతమే ఎక్కువ. దేశంలోని మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఇలాంటి పాలన కొనసాగిస్తున్నది. బీజేపీ నాయకుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకుంటే మంచిది.

# పిల్లల కోసం సరికొత్త అక్షర లోకాన్ని సృష్టించిన శ్రీవిద్య






'పిల్లల కోసం సరికొత్త అక్షర లోకాన్ని సృష్టించారామె. ఆకర్షణీయమైన రంగులు, అందమైన బొమ్మలతో పిల్లల మనసులు దోచేలా, కంటికి ఇంపుగా అక్షరాలను అలంకరించి చిన్నారుల ముందుకు తెచ్చారు. రామాయణం, భారతం వంటి ఇతిహాసాలను.. దసరా, దీపావళి, సంక్రాంతి తదితర పండుగలను ఇతివృత్తాలుగా తీసుకుని ముచ్చటైన పుస్తకాలను ముద్రిస్తున్నా

'పిల్లల కోసం సరికొత్త అక్షర లోకాన్ని సృష్టించారామె. ఆకర్షణీయమైన రంగులు, అందమైన బొమ్మలతో పిల్లల మనసులు దోచేలా, కంటికి ఇంపుగా అక్షరాలను అలంకరించి చిన్నారుల ముందుకు తెచ్చారు. రామాయణం, భారతం వంటి ఇతిహాసాలను.. దసరా, దీపావళి, సంక్రాంతి తదితర పండుగలను ఇతివృత్తాలుగా తీసుకుని ముచ్చటైన పుస్తకాలను ముద్రిస్తున్నారు చందమామ కథలను కార్టూన్ నెట్‌వర్క్‌లు మింగేశాయి. బాలమిత్ర పుస్తకాలకు హోమ్‌వర్క్‌లు శత్రువుగా మారాయి. దీంతో పిల్లల కథలు కనుమరుగు అయిపోయాయి. మొత్తంగా బాల సాహిత్యం అటకెక్కింది. ఆ కమ్మని జ్ఞాపకాలకు ' పేరుతో మళ్లీ ప్రాణం పోస్తున్నారు శ్రీవిద్య. ఈమె రూపొందించిన తొలి తెలుగు పర్సనలైజ్డ్ బొమ్మల కథల పుస్తకాలు పిల్లలను నవ్విస్తాయి. ఏడ్పిస్తాయి. ఆలోచింపజేస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న పుస్తకాలకు ఎపిక్ బుక్స్ పూర్తిగా భిన్నమనీ, ఫోన్ అలవాటు నుంచి పిల్లల దృష్టిని మళ్లించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని శ్రీవిద్య గర్వంగా చెబుతున్నారు.

**విదేశాల నుంచి తిరిగొచ్చి..**

ముళ్లపూడి శ్రీవిద్య స్వస్థలం భద్రాచలం. చాలా సంవత్సరాల క్రితమే వీరి కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. పెండ్లి తర్వాత భర్త వాసుతో అమెరికా వెళ్లారు. ఎనిమిదేండ్లు అక్కడే ఉన్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం గచ్చిబౌలిలో ఉంటున్నారు. తన పిల్లలకు మంచిమంచి కథలు చెబుదామని పుస్తకాల కోసం ఎన్నోచోట్ల వెతికారు శ్రీవిద్య. కానీ, ఎక్కడా నాణ్యమైన బాల సాహిత్యం దొరకలేదు. దీంతో, చాలా నిరాశగా అనిపించింది. పిల్లల కోసం తానే మంచి కథల పుస్తకాలను అందుబాటులోకి తెస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. అక్కడితో ఆగిపోకుండా.. 'హనుమంతునితో సాహసయాత్ర-ఒక దీపావళి కథ' పేరుతో తొలి తెలుగు పర్సనలైజ్డ్ బొమ్మల కథల పుస్తకాన్ని తెచ్చారు. పుస్తకాన్ని ఆర్డర్ చేసిన చిన్నారినే ముఖ్యపాత్రగా తీసుకుని కథ నడిపిస్తారు. దీంతో హనుమంతునితో సాహసయాత్ర చేసినట్టు, రాముడికి యుద్ధంలో సహాయపడినట్టు, రావణుడి మీద గెలిచినట్టు.. కలల లోకంలో విహరించిన అనుభూతిని కలిగిస్తారు. దీంతో పిల్లలు ఆనందపడిపోతారు. మళ్లీ మళ్లీ చదువుతారు. నేస్తాలతోనూ చదివిస్తారు. అలా పుస్తకాలతో స్నేహం ఏర్పడుతుంది. అదే అనుబంధంగా మారుతుంది.

**ఆకర్షించే రంగుల్లో**

పిల్లల కోసం కథలు రాయడం ఒక ఎత్తయితే, ఆ కథలకు బొమ్మలు గీయడం మరో ఎత్తు. అందులోనూ ఆ బొమ్మలు చిన్నారులను ఆకర్షించేలా రకరకాల రంగుల్లో ఉండాలి. పెద్దగా కనిపించాలి. భాష విషయానికొస్తే.. ప్రాస అదనపు ఆకర్షణ అవుతుంది. 'మా ఇద్దరు పాపలకు కథలు చెప్పేటప్పుడు ఎలా చెబితే బాగా అర్థమవుతుంది? భాష ఎలా ఉండాలి? అనే కోణంలో చాలా అధ్యయనం చేశాను' అంటారు శ్రీవిద్య. చాలా కథలకు శ్రీవిద్య భర్త వాసు కథా కథనాలను అందించారు. బొమ్మలు వేసే బాధ్యత మాత్రం ఆమే తీసుకున్నారు. పిల్లల ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుని.. అందుకు తగ్గట్టుగా, మనసుకు హత్తుకునేలా బొమ్మలు గీయడానికి చాలా శ్రమపడాల్సి వచ్చిందంటారు శ్రీవిద్య. తాను బీటెక్ చదివి ఉండటం, అందులోనూ సాఫ్ట్‌వేర్ రంగం గురించి తెలిసి ఉండటం వల్ల.. ఆ సాంకేతిక పరిజ్ఞానం కంప్యూటర్‌లో బొమ్మలు గీసేందుకు దోహదపడిందని వివరిస్తారామె.

**విదేశాల నుంచీ ఆర్డర్లు..**

పిల్లలతోపాటు వారి తల్లిదండ్రుల నుంచీ ఎపిక్ బుక్స్ తొలి ప్రచురణ పట్ల సానుకూల స్పందన వచ్చింది. దీంతో మరో ఐదు పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు శ్రీవిద్య. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలతోపాటు దీపావళి, సంక్రాంతి పండుగల విశేషాలతో పుస్తకాలను ముస్తాబు చేశారు. ఈ రచనలను ప్రవాసులు మరింత ఇష్టపడుతున్నారు. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియాల నుంచి ఆర్డర్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఆర్డర్ అందిన వారం రోజుల్లోనే చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అల్లు అర్జున్, సోనూసూద్, స్వప్నాదత్ కోరికోరి ఎపిక్ బుక్స్ తెప్పించుకున్నారని ఆనందంగా చెప్పారు శ్రీవిద్య. త్వరలోనే హిందీ, బెంగాలీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లోనూ వీటిని అందుబాటులోకి తేవాలన్నది ఆమె ఆలోచన.

# పెద్ద అందగత్తెలకు..







ఇప్పుడంతా యమా స్పీడు.. ఇంటర్నెట్ అయినా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అయినా. అన్నీ కాస్త ఓవరే. సినిమా డైలాగుల నుంచి సిల్లీ పంచుల దాకా అన్నిట్లోనూ రాజ్యమేలుతున్నది అతే. ఉయ్ వాంట్ దట్ అతి... అన్నది నేటి యూత్ మాట.

**పెద్ద అందగత్తెలకు..**

ఇప్పుడంతా యమా స్పీడు.. ఇంటర్నెట్ అయినా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అయినా. అన్నీ కాస్త ఓవరే. సినిమా డైలాగుల నుంచి సిల్లీ పంచుల దాకా అన్నిట్లోనూ రాజ్యమేలుతున్నది అతే. ఉయ్ వాంట్ దట్ అతి అన్నది నేటి యూత్ మాట. నగల్లోనూ అదే దారి. ఓవర్‌సైజ్డ్ లాకెట్ ఇప్పుడు ఆభరణాల అడ్డాలో కొత్తకొమ్మ. నగ ఏదైనా లాకెట్ మరీ పెద్దగా ఉండటమే వీటి ప్రత్యేకత.

అతివ అలంకారంలో అగ్రతాంబూలం ఆభరణాలదే. అందుకే అందులో ఎన్నో రకాలు, ఎన్నెన్నో డిజైన్లు. కాసులపేరు నుంచి కాలిమెట్టెల దాకా, వడ్డాణం నుంచి వేలి ఉంగరం దాకా ఎప్పటికప్పుడు కొత్తకొత్తగా ముస్తాబవుతుంటాయి. కాబట్టి డిజైనర్లు ఏ కొత్త ప్రయోగాన్నయినా ముందుగా నగలపైనే చేస్తారు. అందులోనూ మరీ ముఖ్యంగా కలకంఠి కంఠాన్ని అలంకరించే కంఠాభరణాలలో లెక్కకు మిక్కిలి వైవిధ్యాలు సృష్టిస్తుంటారు. సన్నటి గొలుసు నుంచి రాణీ హారాల దాకా ఎన్నెన్నో చిత్రాలు చెక్కుతుంటారు. ఇక, ఇప్పుడు ఇందులోనే భారీ లాకెట్లను ప్రయోగానికి ఎన్నుకున్నారు. గగనతలాన రాకెట్లలాగే ఇది కూడా మార్కెట్‌లో రివ్వున ఎగసింది. అతివ మదిలో మెరిసింది. ఇంకేం, సాదా బంగారు నగల నుంచి రాళ్ల గొలుసుల దాకా అన్నిటా ఓవర్ సైజ్డ్ లాకెట్లు కళ్లనిండుగా కనిపిస్తున్నాయి. చూడగానే కొంత ప్రత్యేకంగా, మరింత చిత్రంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా టెంపుల్ జువెలరీలో ఇవి ఎక్కువగా తయారవుతున్నాయి. ఏ వేడుకలోనో వీటిని చూసిన దగ్గరివారు, కాస్త ఓవర్ అయిందేమో% అని అన్నా, ఉయ్ వాంట్ దట్ అతి%ఔ% అనేస్తున్నారు అతివలు.

# ఒకే ఒక..ఆశ





'ఎత్తు పల్లాల మధ్య సాగిపోయే జీవిత ప్రయాణంలో పైకి రావడం గొప్ప కాదు. కానీ.. బతుకు శాపగ్రస్తమై, సమాజం నుంచి వివక్ష ఎదురైన పరిస్థితుల్లోనూ పట్టుదలతో ఉన్నత స్థితికి చేరుకోవడం గొప్ప. ట్రాన్స్‌జెండర్ ఆషాడం ఆశ జీవితమే ఇందుకు ఉదాహరణ. ఒకప్పుడు యాచన చేస్తూ బతికిన తను సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని తీర్మానించుకున్నారు. ఆ సంకల్పానికి తెలంగాణ ప్రభుత్వం బాసటగా నిలిచింది. ఆ మార్పు యాత్ర ఆశ మాటల్లోనే..

%కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్ మా సొంతూరు. రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ హక్కు ట్రాన్స్ జెండర్స్‌కూ వర్తిస్తుంది. కానీ, చాలామందికి మేమంటే చులకన. ఇలాంటి పరిస్థితే నాకూ ఎదురైంది. అమ్మానాన్నలకు మేం నలుగురం. నేను ట్రాన్స్‌జెండర్ అని తెలిశాక బంధువులు చిన్నచూపు చూడటం మొదలుపెట్టారు. అమ్మ, నాన్న, అక్క, సోదరులు మాత్రం నాతో మామూలుగానే ఉండేవారు. నావల్ల ఎవరికీ ఇబ్బంది కావొద్దనే ఇంటికి దూరంగా బతుకుతున్నా. ముంబై, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో కొంతకాలం భిక్షాటన చేశాను. ఆ అడుక్కున్న డబ్బులోంచే కొందరికి వాటా ఇవ్వాల్సి వచ్చేది. పోలీసులతోనూ ఇబ్బందులు ఎదురయ్యేవి. డిగ్రీ చదివిన నేను ఇంత దుర్భర జీవితం గడపాలా? అనే ప్రశ్న నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేది. దీంతో ఓ బలమైన నిర్ణయానికొచ్చాను. గౌరవప్రదంగా జీవించాలని నిర్ణయించుకున్నాను.

**గ్రాఫిక్ డిజైనింగ్ నేర్చుకున్నా..**

గ్రాఫిక్ డిజైనింగ్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఎవరో చెప్పారు. కానీ, మిగతావాళ్ల మధ్య నేను ఇమడగలనా? అనే భయం వెంటాడేది. అయినా, మొండి పట్టుదలతో కరీంనగర్‌లోని ఆరెంజ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు రవీందర్ సార్‌ను సంప్రదించాను. నా నిర్ణయాన్ని ఆయన ప్రోత్సహించారు. విజయవంతంగా కోర్సు పూర్తి చేశాను. ఇంట్లో నుంచే జాబ్ వర్క్ మొదలుపెట్టాను. ఫొటోగ్రఫీలోనూ ప్రావీణ్యం సాధించాను. ఆరునెలల క్రితం సొంతంగా ఫొటో స్టూడియో ఏర్పాటు చేసుకున్నాను. నా నేపథ్యం కారణంగా పెద్దగా ఆర్డర్స్ వచ్చేవి కావు. దీంతో ఆర్థికంగా ఇబ్బంది అయ్యింది. ప్రస్తుతం, 'ఇన్ఫో' అనే కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్‌లో ట్రెజరర్‌గా పనిచేస్తున్నాను. ఎల్జీబీటీ కమ్యూనిటీకి మా ఆర్గనైజేషన్ తరఫున సహకారం అందిస్తున్నా. గతంలో ఓ ఎన్జీవోలో పని చేశాను. కరోనాలో చాలామంది ట్రాన్స్‌జెండర్స్‌కు దగ్గరుండి మరీ వ్యాక్సిన్స్ ఇప్పించాను. గత ఏడాది జరిగిన ట్రాన్స్‌జెండర్స్ మేళాలో తెలంగాణ ప్రభుత్వం నన్ను 'ఉత్తమ ట్రాన్స్ జెండర్'గా ఎంపిక చేసింది.

**కొత్త మలుపు..**

ఓసారి మా 'ఇన్ఫో' సంస్థ కార్యక్రమానికి కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ ముఖ్య అతిథిగా వచ్చారు. నేను డిజైన్ చేసిన బ్రోచర్ చూసి ఆశ్చర్యపోయారు. ఫొటో స్టూడియో నిర్వహణలో నా ఆర్థిక ఇబ్బందులను గ్రహించి.. సఖి సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. అక్కడి నుంచి మెప్మా (మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్)కు వెళ్లాను. వాళ్లే నన్ను 'వీ హబ్'కు పరిచయం చేశారు. 'వీ హబ్' అధికారులు నాకు రాయితీ మీద రుణం ఇప్పించేందుకు ఎంతో శ్రమించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద రుణం మంజూరు చేయించడానికి.. రిజిస్ట్రేషన్, ట్రేడ్ లైసెన్స్, బ్యాంక్ అకౌంట్ వంటివన్నీ దగ్గరుండి చూసుకున్నారు.

సర్టిఫికెట్స్‌లో నా జెండర్ 'మేల్' అని ఉంటుంది. ఆధార్, గుర్తింపు కార్డుల్లో మాత్రం వేరుగా ఉండటంతో నా దరఖాస్తు తిరస్కరించారు. మళ్లీ గరిమా అగర్వాల్ మేడం చొరవ తీసుకుని.. బ్యాంక్ వారికి లేఖ రాశారు. ఇటీవలే రూ.5 లక్షల సబ్సిడీ రుణం మంజూరైంది.

ఫొటో స్టూడియోకు కావాల్సిన సౌకర్యాలన్నీ సమకూర్చుకున్నా. తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు ఇచ్చి సమాజంలో సముచిత స్థానం కల్పించింది. చాలా సంతోషకరమైన విషయం ఇది. చివరగా ఒక్క మాట.. మన దేశంలో పురుషులతో సమానంగా మహిళలను గౌరవిస్తారు. కానీ.. మమ్మల్ని మాత్రం చిన్నచూపు చూస్తారు. ట్రాన్స్‌జెండర్లు అంటే భిక్షాటన, సెక్స్ వర్కర్స్ అనే భావన ఉంది. చేయూతనిస్తే గౌరవంగా బతికేందుకు మాలో చాలామంది సిద్ధంగా ఉన్నారు. ఈ దిశగా సమాజం చొరవ చూపాలి.

# డప్పు కళామతల్లులు!

ఈ అమ్మలు.. ఆదితాళం అంతరించిపోకుండా నడుంబిగించారు.అనాది వాయిద్య కళకు ప్రాణం పోసేందుకు గజ్జెకట్టి చిర్రె, చిటికెనతో బరిలోకి దూకారు. 'ఝుం తక్ నకనఖ్.. ఝుం తక్ నకనఖ్.., ధన్నాక్ మిన్నాక్.. ధన్నాక్ మిన్నాక్, తరిగిడ తరిగిడ.. తరిగిడితా' అంటూడప్పు వరుసలపై పట్టు సాధించారు. 'జజ్జనకరి జనారె..' శబ్దాలకు లయబద్ధంగా చిందులేస్తున్నారు.

అది అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక.. ఆ రోజు రాజ్‌భవన్ దేదీప్యమానంగా వెలుగుతున్నది. చుట్టూ వందలమంది.. వేదిక పక్కనే అతిథులు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలు. ఆ పక్కనే గరిడేపల్లి మండలానికి చెందిన మహిళా డప్పు బృందం. వ్యాఖ్యాతల నుంచి పిలుపు వచ్చిన వెంటనే.. వేదికమీదికి దూసుకెళ్లారు. వారు కొట్టే డప్పు దరువు.. గజ్జెకట్టి ఆడే చిందు, ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు చూసి కరతాళ ధ్వనులు మారుమోగుతున్నాయి. కాలిపాదాలు లయబద్ధంగా చప్పుడు చేస్తున్నాయి. ఆ ప్రశంసలకు ఆ కళామతల్లుల కండ్ల వెంట ఆనంద బాష్పాలు. కారణం.. 'మొగుళ్లను, పిల్లలను వదిలేసి ఈ డప్పులేంది? ఈ తిరుగుడేంది? ఆ గెంతుడేంది?', 'నువ్ కులంకాని కులంల జేరి, అట్ల డప్పు కొడుతుంటే మనోళ్లు మస్తు బాధపడుతుర్రు', 'చెక్క బజన్లు పోయినయ్.. కోలాటాలు పోయినయ్.. ఇప్పుడు డప్పుకొచ్చిందా యవ్వారం'.. ఇలాంటి ఎన్నో సూటిపోటి మాటలతో చిల్లులు పడిన గుండెలకు ఆ చప్పట్లు ఊరటనిచ్చాయి. ఆ రోజు సామాజిక మాధ్యమాలు, న్యూస్ చానెళ్ల ద్వారా ఆ కార్యక్రమాన్ని వీక్షించిన గరిడేపల్లి చుట్టుపక్కల గ్రామాల మగవారి నోళ్లు దెబ్బకు మూత పడ్డాయి. 'శెభాశ్ మనూరి పేరు నిలబెట్టారు.. డప్పు కళకు కొత్త ఊపిరులిచ్చారు' అంటూ గేలి చేసిన నోళ్లే పొగుడుతుంటే ఆ కళామతల్లులు సంబురంతో పొంగిపోయారు. అదో జీవితకాల జ్ఞాపకం.

**వాద్యకళ సారథులుగా..**

వీళ్లంతా పొలం పనులు చేసుకుంటూ.. రేల పాటలు పాడుకునే సాధారణ మహిళలు. ఒకప్పుడు గరిడేపల్లి మండలంలో డప్పు కళ ఓ వెలుగు వెలిగింది. పుట్టుక నుంచి చావు వరకు ఏది జరిగినా డప్పు దరువు వినిపించాల్సిందే. అలాంటిది తోలు డప్పులు అంతరించినయ్. డప్పులు కొట్టేవారే కరువయ్యారు. నాడు వందల సంఖ్యలో ఉన్న డప్పు కళాకారులు నేడు పదుల సంఖ్యలోకి వచ్చారు. పొలం పనుల సమయంలో అంతరించిపోతున్న ఈ కళ గురించి చర్చించేవాళ్లు.

సేద్యం పనులకు ముతాలు కట్టినవారే.. డప్పు కళను బతికించుకునేందుకు కూడా బృందాలుగా ఏర్పడే ఆలోచన చేశారు. ఉన్న ఊరి నుంచి పొరు గూరికి పొలం పనులకు వెళ్లినప్పుడు కూడా ఇదే చర్చ. ఆ చర్చల్లో భాగమైన పొరుగూరి స్త్రీలు కూడా డప్పు బృందాలుగా ఏర్పడాలని నిర్ణయించారు. డప్పు నేర్పే గురువుల కోసం వెతుకుతున్న క్రమంలో గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీశ్ తారసపడ్డారు. అంతరించిపోతున్న కళను బతికించు కోవాలని తపిస్తున్న సతీశ్‌కు.. నిండైన ఉత్సాహంతో ఉన్న మహిళల నుంచి పిలుపురావడంతో ఉచితంగానే డప్పు కళ నేర్పేందుకు ఒప్పుకొన్నారు.

ఉదయం కూలి.. రాత్రి విద్య ఈ మహిళలంతా ఉదయం కూలిపనులకు వెళ్లి.. రాత్రిపూట డప్పు నేర్చుకునేవారు. పీటలు, చెక్కలపై మొదలైన ప్రస్థానం.. నేడు రాజ్‌భవన్, రవీంద్రభారతి వేదికలపై ప్రదర్శించే స్థాయికి చేరింది. తమ భర్తల సహకారంతో విద్య నేర్పే గురువుకు వంతులవారీగా భోజనం ఏర్పాట్లు చేసేవారు. చెమ టోడ్చిన కష్టం నుంచి మిగిలిన సొమ్మును గురుదక్షిణగా ఇచ్చేవారు. ఒక ఊరితో మొదలైన ఈ డప్పు కళ ప్రస్థానం.. క్రమంగా చుట్టుపక్కల గ్రామాలకూ పాకింది. కులాలకు అతీతంగా మహిళలు డప్పు కళను నేర్చుకునేందుకు ముందుకొచ్చారు. ఒక్కో గ్రామం నుంచి సుమారు 20 మంది వరకు మహిళలు డప్పు విద్యను నేర్చుకున్నారు. రాత్రి నేర్చుకున్న విద్యను.. వరుసలను ఉదయం పనుల్లో వల్లెవేసేవారు. క్యారేజీలపై దరువులు ప్రాక్టీస్ చేసేవారు.

**8 గ్రామాల నుంచి..**

డప్పు కళను ఇప్పటివరకు పురుషులే అభ్యసించారు. అయితే, అంతరించిపోతున్న కళను బతికించుకునేందుకు, దేశవ్యాప్తంగా ప్రచారం



కల్పించేందుకు డప్పు గురువు సతీశ్ తొలి సారిగా పురుషులకు దీటుగా మహిళా డప్పు బృందాన్ని తయారుచేశారు. వీరిలో కోలాటాలు నేర్చుకునే మహిళలు సైతం, కుల మతాలకు అతీతంగా జతకలవడంతో అనతి కాలంలోనే గరిడేపల్లి మండలంలోని ఎనిమిది గ్రామాల నుంచి సుమారు 200 మంది మహిళా డప్పు వాయిద్యకారులు సిద్ధమయ్యారు. ప్రత్యేక బృందంగానూ ఏర్పడ్డారు.

హైదరాబాద్‌లోని ప్రముఖ డప్పు ఆర్టిస్టు అందె భాస్కర్ వీరికి ప్రోత్సాహం అందిస్తుండటంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ.. రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఆహ్వానించి ప్రోత్సహిస్తున్నారు. ఆ గౌరవానికి, గుర్తింపునకు మురిసిపోయి.. స్వయంగా భర్తలే డబ్బులిచ్చి ప్రోగ్రాములకు పంపుతున్న సంఘటనలూ ఉన్నాయి.

సమయానికి తిన్నా.. తినకపోయినా కళను బతికించాలనే ఆశయం నరనరాన కనిపిస్తున్నదా నారీమణులలో! ఆ తపనే డప్పు కళకు పట్టం కట్టేలా చేసింది.

**సాంస్కృతిక సారథి ద్వారా గుర్తిస్తే మేలు**

సమాచారానికి, సంబురానికి ప్రతీక డప్పు. దరువు చెవినపడితే.. కాళ్లు తాళం వేస్తాయి. అప్రయత్నంగా ఒళ్లు పరవశిస్తుంది. కొందరికి శిగమొస్తుంది. అంత గొప్పకళ మాకు అబ్బింది. కళను బతికించాలన్న మా పట్టుదలే అందుకు కారణం. మా కంఠంలో ఊపిరున్నంత వరకు డప్పు కళను బతికిస్తాం. మా పిల్లలకు కూడా నేర్పి, బాల దళాలను తయారుచేస్తున్నాం. అయితే, మాకు ప్రభుత్వం తరఫున మరింత ప్రోత్సాహం ఉంటే మంచిగుంటది. సాంస్కృతిక సారథి నుంచి కొలువులిప్పిస్తే ఎంతో మేలు జేసినోళ్లు అవుతరు. మా బిడ్డలకు కూడా ధోకా ఉండదు. సీఎం సారు దృష్టిపెడ్తరని ఆశ.

-అమరవరపు సంతోష, పరెడ్డిగూడెం గ్రామం, సూర్యాపేట జిల్లా

# దోపిడీ రహిత సమాజం కోసం.. పునరంకితమవుదాం

**వందేళ్ల కిందట మన దేశంలో మొట్టమొదటిసారిగా మే డే జరుపుకున్నాం. 1923లో మే డే సందర్భంగా మద్రాస్ మెరీనా బీచ్‌లో కామ్రేడ్ సింగరవేలు ఎర్రజెండా ఆవిష్కరించారు. అయితే నేడు మన కార్మిక వర్గం తిరిగి బ్రిటిష్ వలస పాలన నాటి పరిస్థితులలోకి నెట్టివేయబడుతోంది. ఎనిమిది గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల స్వేచ్ఛాధీనం కోసం చేసిన పోరాటానికి చిహ్నం మేడే. కార్మిక వర్గ పోరాటాలు, త్యాగాల ఫలితంగానే 8 గంటల పని విధానం ఏర్పడింది. గరిష్టంగా రోజుకి 8 గంటల పని, వారానికి 48 గంటల పని వుండాలని 1919లో జరిగిన ఐఎల్‌ఓ (అంతర్జాతీయ కార్మిక సంస్థ) మొదటి సమావేశం నిర్ణయించింది. అంతేగాదు, కార్మికులు వర్గపోరాటం ద్వారా మాత్రమే మెరుగైన పని పరిస్థితులను సాధించుకోగలిగారు. సంఘాన్ని ఏర్పాటుచేసుకునే హక్కు, సమ్మె చేసే హక్కు కూడా వారు పొందగలిగారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే 1948లో ఫ్యాక్టరీల చట్టం రూపొందించబడింది. స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్న కార్మికవర్గ ఆకాంక్షలు కొంతమేరకు ప్రతిబింబించేలా పని గంటలకు సంబంధించిన కొన్ని సెక్షన్లను ఈ చట్టంలో పొందుపరిచారు. అయితే, పెట్టుబడిదారుల లాభాల పెంపుకోసం ఏర్పడిన నయా ఉదారవాద పాలనలో పని గంటలను పెంచడం ద్వారా, వారు కష్టపడి సాధించుకున్న హక్కులపై దాడి చేయడం ద్వారా కార్మికులను దోచుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి.**



మోడీ ప్రభుత్వం ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్లలో ఒకటైన ఉపాధి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులకు సంబంధించిన నిబంధనల విషయమై సంస్థలకు మినహాయింపునిచ్చే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తున్నది. ఆ వెంటనే పలు రాష్ట్ర ప్రభుత్వాలు పని గంటలను 8 నుంచి 12కు పెంచుతూ ఫ్యాక్టరీ చట్టాన్ని సవరించాయి. అయితే కార్మికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వాటిలో కొన్ని రాష్ట్రాలు వెనక్కి తగ్గాయి. ఈ క్రమంలోనే బిజెపి పాలనలో వున్న కర్ణాటక, డిఎంకె నాయకత్వంలోని తమిళనాడు ప్రభుత్వం కార్మికుల పనిగంటలను పెంచేలా ఫ్యాక్టరీల చట్టాన్ని సవరించాయి. కార్మిక సంఘాలతో పాటు పాలక డిఎంకె మిత్రపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో తమిళనాడు ముఖ్యమంత్రి బిల్లును నిలిపివేస్తున్నట్టు ప్రకటించాల్సి వచ్చింది. కార్మికుడి నుంచి మరింత శ్రమను పిండుకోవాలన్నా, యజమాని లాభాలను మరింత పెంచుకోవాలన్నా పని గంటల పెంపు ముఖ్య సాధనంగా ఉపయోగపడుతుందన్నది తెలిసిన విషయమే.ద్రవ్యోల్బణం పెరిగిపోతోంటే మరీ ముఖ్యంగా ఆహారం, చమురు ధరలు పెరిగిపోతోంటే...అమెరికా, బ్రిటన్, అనేక యూరోపియన్ యూనియన్ దేశాలలో నిజవేతనాలు పడిపోతున్నాయి. బ్రిటన్‌లో జీవన ప్రమాణాలు 2022లో దారుణంగా పడిపోయాయి. భారత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2022-23 ఆర్థిక సర్వే ప్రకారం గత రెండేళ్లలో సుమారు 36.5 కోట్ల మంది గ్రామీణ కార్మికుల నిజవేతనాలు స్తబ్దుగా వున్నాయి. 2014-15 నుంచి 2021-22 మధ్య నిజ వేతనాల వృద్ధి రేటు ఏడాదికి ఒక్క శాతం కంటే తక్కువగా నమోదైంది.

ప్రపంచవ్యాప్తంగా కార్మకవర్గం మేడే జరుపుకుంటున్న ఈ సందర్భంలో...పెట్టుబడిదారీ దేశాలలో 8 గంటల పని దినంతో పాటుగా కష్టపడి సాధించుకున్న హక్కులన్నీ దాడికి గురవుతున్నాయి. వేతనాలు, బోనస్‌లు, పింఛన్లు కోతకు గురవుతున్నాయి. పూర్తి పెన్షన్ పొందేందుకు రిటైర్మెంట్ వయసు పెంచుతున్నారు. కార్మిక సంఘాల హక్కులపై, మరీ ముఖ్యంగా సమ్మె చేసే హక్కుపైన దాడి జరుగుతోంది.

వ్యవస్థాగత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పెట్టుబడిదారీ వ్యవస్థ దాని నుంచి బైటపడే పరిష్కార మార్గాన్ని ఇప్పటికీ కనిపెట్టలేకపోయింది. కార్మిక వర్గం, శ్రమ జీవులు సృష్టించిన అపార సంపదను కొన్ని ధనిక దేశాలలో కొద్దిమంది స్వాధీనం చేసుకుంటున్నారు. అపూర్వమైన శాస్త్రసాంకేతిక పురోగతులను ప్రజా ప్రయోజనాల కోసం గాక, బడా కార్పొరేట్లు, బహుళజాతి కంపెనీల లాభాల కోసం వినియోగిస్తున్నారు. 1970లలో పెట్టుబడిదారీ సంక్షోభానికి పరిష్కారంగా తీసుకొచ్చిన నూతన ఆర్థిక విధానం విఫలమైనట్టుగా చాలా చోట్ల అంగీకరిస్తున్నారు. సంపద సృష్టికర్తలైన కార్మికులకు, ఆ సంపదను సొంతం చేసుకొనే బడా పెట్టుబడిదారులకు మధ్య తీవ్రమౌతున్న వైరుధ్యాలకు పరిష్కారాన్ని కనుగొనలేకపోతున్నట్లు పెట్టుబడిదారీ విధానం గ్రహించింది.

ఈ తీవ్ర వైరుధ్యాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అన్ని రకాల భారీ పోరాటాలలోనూ కనిపిస్తున్నాయి. రవాణా కార్మికులు, రైల్వే కార్మికులు, నర్సులు, డాక్టర్లతో సహా ఇతర ఆరోగ్య రంగ కార్మికులు, టీచర్లు, లెక్చరర్లు, విద్యారంగ ఉద్యోగులు, రిటైల్ రంగ కార్మికులు, ప్రభుత్వ రంగ ఉద్యోగులు, ఆటోమొబైల్ కార్మికులు, అమేజాన్, గూగుల్, స్టార్‌బక్స్ కార్మికులు, గిగ్ వర్కర్లు తదితరులు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, గ్రీస్...ఇతర అనేక దేశాలలో మునుపెన్నడూ లేని విధంగా సుదీర్ఘ సమ్మెలకు, అపూర్వమైన పోరాటాలకు దిగుతున్నారు.

మన దేశానికి వచ్చేసరికి 2022 మార్చిలో పది కేంద్ర కార్మిక సంఘాలు ఐక్య వేదికను ఏర్పాటు చేసుకుని రెండు రోజుల పాటు సమ్మె చేశాయి. ఇదిగాక బొగ్గు కార్మికులు, విద్యుత్, స్టీల్, బ్యాంకు, బీమా, స్కీమ్ వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు రంగాల వారీగా పోరాటాలు చేపడుతున్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగాను, ఇతర డిమాండ్ల సాధన కోసం సమ్మెలు చేస్తున్నారు. ఈ పోరాటాల ధాటికి నూతన ఆర్థిక విధానాలు కొంత మేరకు వెనకపట్టు పట్టాయి. లేబర్‌కోడ్లు పార్లమెంట్‌లో పాసై మూడు సంవత్సరాలైనప్పటికీ వాటిని ప్రకటించలేకపోయింది. స్కీమ్ వర్కర్లు పోరాటాల ద్వారా వేతనం, ఇతర బెనిఫిట్లను సాధించుకోగలిగారు. పేదలకు, మరీ ముఖ్యంగా మహిళలు పిల్లలకు సేవ చేసే ఈ పథకాలను ప్రైవేటీకరించకుండా, నిర్వీర్యం చేయకుండా అడ్డుకోగలిగారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వాన రైతాంగం చేపట్టిన చారిత్రిక పోరాటంతో మోడీ ప్రభుత్వం దిగివచ్చి మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చింది.

సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు తమ ఉమ్మడి సమస్యలపై పోరాడేందుకు కలిసికట్టుగా ముందుకొస్తున్నారు. నేడు కేంద్రంలో అధికారంలో వున్న మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం దూకుడుగా అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలే వారి సమస్యలకు మూల కారణం. అందుకే వీటికి వ్యతిరేకంగా సిఐటియు, ఎఐకెఎస్, ఎఐడబ్ల్యుయు ఏప్రిల్ ఐదవ తేదీన భారీ మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని నిర్వహించాయి. అయితే, మన దేశంతోపాటు ప్రపంచ స్థాయి అనుభవాలను చూసినట్లయితే కేవలం పోరాటాలే సరిపోవు. నాయకత్వానికి నయా ఉదారవాద విధానాల పట్ల స్పష్టమైన ప్రత్యామ్నాయ దృక్పథం లేకపోవడాన్ని...

దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన మితవాద శక్తులు అవకాశంగా తీసుకుని ప్రజల్లో వున్న అసంతృప్తి నుంచి ప్రయోజనం పొందుతున్నాయి. ఫ్రాన్స్, ఇటలీ, హంగేరి, పోలాండ్, నెదర్లాండ్స్...వంటి అనేక యూరోపియన్ దేశాలలోను, అమెరికాలోను ఇదే విధంగా జరిగింది. మన దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని మతతత్వ విభజన శక్తులు లాభం పొందుతున్నాయి. మితవాద శక్తులు ఉదారవాదాన్ని వ్యతిరేకించకుండా...కులం, మతం, జాతి, భాష పేరిట శ్రామికుల మధ్య చిచ్చు పెట్టి ఐక్య పోరాటాలను బలహీన పరుస్తున్నాయి. భారత దేశంలో మనం చూస్తున్నట్టుగా పాలక వర్గాలు మితవాద శక్తులకు మద్దతునిస్తున్నాయి. అపఖ్యాతి పాలైన ఉదారవాదానికి స్పష్టమైన ప్రజానుకూల ప్రత్యామ్నాయాన్ని కలిగివున్న వామపక్షాలు పోరాటాల్లో గెలుపొందకూడదన్నదే వాటి లక్ష్యంగా వుంది.

అందుకే, తమ తక్షణ సమస్యలైన పని గంటలు, వేతనాలు, సాంఘిక భద్రత, పని ప్రాంత హక్కులు వంటి వాటికి...ఈ విధానాలను పెంచి పోషించే నయా ఉదారవాద రాజకీయాలకు మధ్య గల సంబంధాన్ని కార్మికులకు, ప్రజలకు తెలియచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. కార్మిక వర్గానికి, శ్రమజీవులకు తమ తక్షణ శత్రువు ఎవరో మిత్రుడు ఎవరో తెలుసుకునేలా చేయాలి. వారి అసలు శత్రువులైన నయా ఉదారవాద విధానాలకు, దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థకు, పాలక- కాషాయ-కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరు సల్పేలా దిశానిర్దేశం చేయాలి. దోపిడీ రహిత సమాజాన్ని సాధించుకునే దిశగా కదలాలి. కష్టపడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి మాత్రమే కాకుండా...పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి మొత్తం సమాజాన్ని విముక్తి చేయడం కోసం పునరంకితమవుదాం. 2023 మేడే నాడు మనం చేస్తున్న ప్రతిజ్ఞ ఇది.

# ప్రపంచీకరణపై సంధించిన కవితాస్త్రం

**అనునిత్యం మనిషిని సమ్మోహనపరుస్తూనే ఇప్పుడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్య అయిపోయింది ప్రపంచీకరణ. జనజీవితమంతా మెల్లమెల్లగా దాని వ్యామోహపు కోరల్లో చిక్కుకొని దాని ఉక్కు పిడికిలిలో బిగుసుకుపోతూవుంది. ఆది చాప కింద నీరులా ప్రపంచ మంతా ఆక్రమించుకుంటూ వుంటే మనిషి దానికి దాసోహమైపోయి తన అస్తిత్వాన్నే కోల్పోతున్నాడు. ప్రపంచీ కరణ ఆవాహనతో మన సంపదే మనకు దూరమైపోతూ వుంది. మన హృదయాల్ని స్పృశించే అనుబంధాలు ఆర్థిక బంధాలుగా మారిపోతున్నాయి. ప్రపంచీకరణ ధాటికి కవిత్వమూ నిరసన వెల్లువవుతోంది. అగ్రరాజ్యాల సామ్రాజ్యవాద దాహానికి చిన్నదేశాలు దాసోహమయ్యే వైనాన్ని అది తూర్పారబడుతోంది. ప్రపంచీకరణ నీడలో మనుగడ సాగిస్తున్న మనిషి జీవితం విలువలు కోల్పోవడాన్ని అది ఎత్తిచూపుతోంది. గ్లోబలైజేషన్ ఉక్కుపాదాల కింద నలిగిపోతున్న జనజీవితాల విషాదాన్నీ, పైకి కనిపించే పూల దరహాసం వంటి మోజులో పడి పతనమైపోతున్న సంస్కృతిని చూసి కవిత్వం కన్నీళ్ళ పర్యంతమై పోతోంది. రోజురోజుకూ సహజ సౌందర్యాలను కోల్పోతూ కృత్రిమత్వాన్ని నింపుకుంటున్న మన పల్లెల దీనస్థితిని అది దృశ్యమానం చేస్తూ ప్రపంచీకరణ పట్ల వుండవలసిన అప్రమత్తతను ప్రమాద హెచ్చరికలా గుర్తుచేస్తూ వుంది.**



'భారతదేశం అట్లాంటిక్ మహాసముద్రం మీదికి ఒరిగి పోతోంది' అంటూ మూడు వాక్యాల్లో సామ్రాజ్యవాదపు వికటాట్టహాసాన్ని ధ్వనింపజేశాడు కవివరేణ్యుడు అద్దేపల్లి రామమోహనరావు. సామ్రాజ్యవాద దాహానికి అట్లాంటిక్ మహాసముద్రం ప్రతీక అయింది. మనిషికి ముంచుకొచ్చే ప్రమాదానికి సముద్రం సంకేతమైంది.

'ఇలా వుంటుందనుకోలేదు/ఉరితాడు
ఇంత అందంగా వుంటుందనుకోలేదు
ఒకర్నుంచి ఒకరిని వేరుచేసి
ఇంటినిండా శ్మశానం చేస్తుందనుకోలేదు
అందరం ఒకే ఇంటిలో వుంటాం
ప్రక్కప్రక్కనే కూర్చోనున్నా
ఒకరితో ఒకరం మాట్లాడుకోలేం
ఇల్లంతా పరచుకున్న రంగుల్లో
ఊపిరాడక మునకవేస్తుంటాం'
('ఉరితాడు' ఖండిక నుంచి)

అంటూ ఉరితాడ్కె మానవజీవితాన్ని కబళిస్తూ మనిషి అనుభూతుల్నీ, అనుబంధాల్ని పూర్తిగా తన వశం చేసుకుంటున్న ప్రపంచీకరణ పదఘట్టనల ఉధృతాన్ని వర్ణిస్తాడు వర్తమాన కవి ఆశారాజు. ప్రపంచీకరణ విసిరిన అందమైన సాంకేతికత వలలో చిక్కుకుని విలవిలలాడు తోంది మానవ జీవితం. మన శరీరాలు మాత్రం పక్కపక్కనే వున్నా ఆప్యాయంగా మాట్లాడుకోలేని మన మనసులు మాత్రం ఆ సాంకేతికతకు కనెక్టు అయిపోయి వుంటుంది. మన ఆప్యాయతల్నీ, అనుబంధాల్నీ రంగరంగుల చానళ్ల రూపంలో, ఎన్నో హంగుల సోషల్ మీడియా యాప్‌ల రూపంలో హరించివేయడానికి మనమధ్యే పొంచివుంటుంది ప్రపంచీకరణ. అవును%ౕా%దానికి ఉరితాడును మించిన ప్రతీక ఏముంటుంది!? అది మనిషి నిండా కృత్రిమత్వాన్ని, యాంత్రికతనూ నింపేస్తూ అతనిలోని అసల్కెన స్పృహను మాయం చేసేస్తూవుంది. ఆ యాంత్రికతలోనే మనిషి కొట్టుమిట్టాడుతూ మనిషితనాన్నే కోల్పోతూ వుంటాడు. అందుకే మనచుట్టూ అన్నీ వున్నా, మనచుట్టూ అందరూ వున్నా ఎవరూ లేనితనంతో మనం తెచ్చిపెట్టుకున్న శ్మశాన వైరాగ్యాన్ని అనుభవిస్తుంటాం. మనల్ని ఆవహించేసిన టెక్నాలజీలో ఊపిరి తీసుకోవడం కూడా కష్టమైపోతోంది.

'చురుకుదారాలను ఒంటికి చుట్టుకొని
పెరటిబావి దగ్గర జలకాలాడిన
జ్ఞాపకాల ఊట ఒకటుండేది
జీవన వ్యాసార్థాలకు అటూ ఇటూ
గంటలమోతలేని రెక్కల విహారం
పక్షుల్ని కర్ణభేరీలకు తగిలించుకొని
లోపలి లోకాన్ని మేల్కొలిపే ప్రభాతగానం
కావిట్లో తెచ్చిన చెరువు చేవ్రాలును
వసారాలో మట్టికుండతో అనుసంధానించే విన్యాసం
ఒకటుండేది ఒకటుండేది ఒకటుండేది'
('చాలా ఒకట్లుండేవి' ఖండిక నుంచి)

ఎన్నెన్నో అందాల్ని వొలికించిన, ఎన్నెన్నో మధురానుబూతుల్ని అందించిన జ్ఞాపకాలు ప్రపంచీకరణ ఉచ్చులో చిక్కుకొని క్రమంగా మాయమైపోతూ పురాజ్ఞాపకాలుగా మిగిలిపోవడాన్ని గుర్తుచేసుకుంటాడు వర్తమాన కవి ఎమ్వీ రామిరెడ్డి. పెరటిబావి, మనసులో రాగాల్ని పలికించే పక్షుల ప్రభాతగానం, మట్టికుండ ద్వారా మన వొంటినిండా ఆరోగ్యాన్నందించే చెరువు చేవ్రాలు%ౕా% ఇప్పుడు ఈ పల్లె సౌందర్యాలన్నీ పురాజ్ఞాపకాల్కె పోతున్నాయి. ఆ జ్ఞాపకాల కోసం మనిషి పదేపదే పలవరించే క్షణాలు దాపురించే పరిస్థితి ఇప్పుడు వచ్చింది. ఆ పల్లెలోని పచ్చని పొలాలు కాలుష్యాన్ని వొంటినిండా నింపుకొనే ఫ్యాక్టరీలుగా మారిపోతున్నాయి. ప్రపంచీకరణ ఒక అదృశ్యశక్తిలా మనిషి నుంచి అందమైన జీవితాన్ని వేరుచేసేస్తూ వుంది. అతడి పలుకుకూ, కులుకుకూ, ఆఖరికి అతడి పూర్తి బతుకుకూ కృత్రిమత్వపు నాజూకుతనాన్ని తొడిగేస్తూవుంది. అతడిలోని అసల్కెన మనిషితనాన్ని కడిగేస్తూవుంది. ఆ దృశ్యాల్ని చూసి కవిత్వం కొండంత ఆవేదనను వెళ్లగక్కుతూ పూలకీ, ప్లాస్టిక్ పూలకీ గల తేడాను విడమరచిచెబుతోంది. అది మనిషి మనుగడను ప్రశ్నిస్తూ ఒక బృహత్తర బాధ్యతతో చైతన్యవాహికై అనేక హెచ్చరికలు చేస్తూనేవుంది.

# మలంగి.. మనసాగదండి! వారాంతంలో..





తెలంగాణకు దక్షిణాన ఉన్న నల్లమల అడవులు ఎంతటి అందమైనవో.. ఉత్తరాన విస్తరించిన కెరమెరి కొండలూ అంతే సుందరమైనవి. ఆదిలాబాద్–కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో విస్తరించిన గిరులు నిండా తరులతో అలరిస్తాయి. ఈ గుట్టల్లో ఓ భాగం మలంగి గిరులు. ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండల పరిధిలో విస్తరించి ఉన్న మలంగి కొండలు.. పచ్చదనంతో, నీటి చెలమలతో వేసవిలోనూ వ'సంతసాన్ని' కలిగిస్తాయి.

మలంగి లోయ గిరిజనుల ఆధ్యాత్మిక కేంద్రం. దశాబ్దాల కిందట పూలాజీ బాబా ఏళ్లకేళ్లు తపస్సు చేసిన ప్రాంతమిది. బాబా సిద్ధి పొందిన ప్రదేశానికి నేటికీ భక్తులు వస్తుంటారు. పట్నాపూర్ నుంచి మలంగి వరకు లోయమార్గంలో సాగే నాలుగు కిలోమీటర్ల ప్రయాణం ఓ అద్భుతం. రెండు గుట్టలు ఎక్కి దిగడంతో కలిగే అలసట.. అక్కడక్కడా తారసపడే జలపాతాలను చూడటంతో మాయం అవుతుంది. అందమైన నాలుగు జలపాతాలు 10 నుంచి 15 అడుగుల ఎత్తు నుంచి దూకుతూ చేసే నాట్యం నయన మనోహరంగా ఉంటుంది. ఈ కొండల నడుమ నేలంతా ఈనిందా అన్నట్టుగా పచ్చని పంటలు కనిపిస్తాయి.కాశీకుండం..లోయలో నడవలేని వాళ్లు రోడ్డు మార్గంలో మలంగి క్షేత్రానికి చేరుకోవచ్చు. దారంతా ఎగుడు దిగుడులతో ఉన్నా.. కొండల మధ్య పాములా వంకర్లు తిరుగుతూ గమ్యానికి దారితీస్తుంది. ఈ మార్గంలోనే పలకరిస్తుంది మలంగి వాగు. మండు వేసవిలోనూ నిండుగా ప్రవహిస్తూ ఆశ్చర్యం కలిగిస్తుంది. వాగుపై ఉన్న మడుగు జలక్రీడలకు వేదికగా నిలుస్తుంది.

అక్కడక్కడా ఉండే ద్వీపాలపై పూలాజీ బాబాకు సంబంధించిన పవిత్ర స్థలాలు దర్శనమిస్తాయి. ఇక్కడికి సమీపంలోనే బాబా ప్రార్థనా మందిరం ఉంటుంది. ఇంకాస్త ముందుకు వెళ్తే పట్నాపూర్ నుంచి వచ్చే కాలినడక మార్గం కలిసే చోటు వస్తుంది. ఇక్కడ వాగు మలుపును గంగా సంగమ స్థలంగా భావిస్తారు గిరిజనులు. సమీపంలో ఉండే కుండాన్ని కాశీకుండంగా భావించి పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. తర్పణాలు విడుస్తుంటారు. భక్తితో బాబాను ఆరాధిస్తూనే.. ప్రకృతిలోని ప్రశాంతతను ఆస్వాదిస్తారు. మధురమైన జ్ఞాపకాలతో తిరుగు ప్రయాణం అవుతారు.

పట్నాపూర్ మలంగి క్షేత్రం దర్శించడానికి హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే మార్గంలో ప్రయాణించి గుడిహత్నూరుకు చేరుకోవాలి. అక్కడి నుంచి ఉట్నూరు (38 కి.మీ) వెళ్లి.. హస్నాపూర్ మీదుగా పట్నాపూర్ (25 కి.మీ.) చేరుకోవచ్చు. బస్సులు, ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి. బాబా ఆశ్రమం నుంచి మలంగి క్షేత్ర పరిసరాలన్నీ చుట్టి రావొచ్చు. బాబా జయంతికి..పూలాజీ బాబా తపస్సు ఆచరించిన ప్రాంతం కావడంతో.. మలంగి లోయను పవిత్రంగా భావిస్తారు గిరిజనులు. మలంగి వాగు ఆవలి ఒడ్డున బాబా తపస్సిద్ధి పొందిన ప్రదేశం ఉంటుంది. ఏటా బాబా జయంతి (ఆగస్టు 30), గురు పౌర్ణమి, మహాశివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఇక్కడికి తరలి వస్తారు.

## కొత్తగా: కునుకులో
# కదలిక లేదిక



దూర ప్రయాణాల్లో కునుకమ్మ ఇట్టే దరి చేరుతుంది. అలా నిద్రలోకి జారుకోగానే.. తల పక్కకు ఒరుగుతుంది.. చప్పున మెలకువ వచ్చేస్తుంది. పోనీ కాసేపు భుజం వాలుద్దామనుకుంటే.. పక్కసీట్లో అపరిచితుడు కన్నెర్ర చేస్తుంటాడు. ఆ సీట్లో స్నేహితుడున్నా.. ఇంట్లోవాళ్లున్నా.. కస్సుబుస్సులు తప్పవు. ప్రయాణం పూర్తయ్యే సరికి చాలీచాలని నిద్రతో తలపట్టేసినట్టు అవుతుంది. ఈ సమస్యకు పరిష్కారం హెడ్‌రెస్ట్ కవర్. కారులో, బస్సులో, విమానంలో దీన్ని వాడుకోవచ్చు. సీటుకు దీనిని అమర్చి అందులో తల దూర్చితే సరి. తల ఏ పక్కకు ఒరిగినా.. పట్టు జారకుండా చేస్తుంది. దీంతో ఏ కదలిక లేకుండా కునుకు తీసేయొచ్చు. కళ్లపై వెలుతురు పడకుండా కవర్ చేసుకోవచ్చు కూడా. ఆన్‌లైన్ మార్కెట్‌లో ఇవి దొరుకుతున్నాయి. ధర రూ.500 నుంచి మొదలవుతోంది.



# సముద్రమట్టం.. సమాన ప్రాంతం



చుట్టూ సముద్రం.. కనుచూపు మేర నీరు.. మేఘాలను తాకే అలలు.. అందమైన ద్వీపం. ఇన్ని ఆనందాల నడుమ కొన్ని అనివార్యాలు కూడా ఉంటాయి. కిరిబటి సముద్ర తీర ప్రాంతంలో ఉన్న ఒక పట్టణం. పసిఫిక్ మహా సముద్రానికి మధ్యలో 33 సముద్ర దీవులు, పగడపు దిబ్బలు కలిగిన అదుతే దీవి.ఆకాశం నుంచి మొదలు నేలపై ఉన్న సముద్రపు నీళ్ల కూడా నీలిరంగు వర?ంలో ఉంటాయి. మధ్యన ఆకుపచ్చ అందాలతో చెట్లు ఏదో పెయింటింగ్ వేసినంత అదుతేంగా దర్శనమిస్తాయి. 2100 నుంచి ఈ ప్రాంతంలో మనుషుల సంచరిస్తున్నాయి. ఇక్కడ ప్రాణుల మనుగడ సాగుతుందని తెలుస్తుంది. సముద్రపు అంచున గోడలా ఉన్న ఈ నగరం సముద్ర అలల తాకిడికి శిథిలావస్థకు చేరుకున్నది. దాంతో అక్కడ నివాసం ఉండే జనాలు వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. ఇప్పుడు అక్కడ చూడడానికి ఏమీ లేకున్నా బాగుంటుంది. ప్రకృతి విపత్తుల వల్ల ఆ ప్రాంతం అంతా జలమయం అయి ఛిన్నాభిన్నం అయిపోయింది. అక్కడ ప్రజల శ్రమ ఫలితంగా ఆ ప్రాంతం మళ్లీ పూర్వ స్థితికి వచ్చింది. ప్రపంచంలో సూర్యుణి? మొదట ఇక్కడి వాళ్లు మాత్రమే చూడగలరు. కిరిబటి ప్రపంచంలోనే ఒక వింతైన సముద్ర దీవి. ఇప్పుడా ప్రాంతం అంతా టువాలుగా మారిపోయింది. అక్కడి ప్రభుత్వం ప్రజలకు ధైర్యాన్నిస్తూ పర్యాటకాన్ని, ఉపాధిని పెంచుతున్నది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలతో కలిసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నది. ఇవన్నీ పక్కన పెడితే ఈ ప్రాంతం సముద్ర మట్టానికి సమానంగా ఉంటుంది.

# నూటొక్క సొరంగాల అద్భుతం

ఒకవైపు నల్లమల కొండల అందాలు.. ఇంకోవైపు ఆహ్లాదకరమైన వాతావరణం. ఈ పైపై అందాలను సవాలు చేస్తూ వెలిసిన భారీ బిలం. అందులోనే ఆలయాలు. అందులోనే కోనేరులు. అంతుచిక్కని రహస్యాలు. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల సమీపంలో ఉన్న గుత్తికొండ బిలం విశేషాలివి.గుత్తికొండ బిలం ప్రకృతి అదుతేం. 101 సొరంగాలతో ఉంటుంది. ఇవి యుగాల కిందట ఏర్పడినవని చెబుతారు. వీటిలో నూటొక్క కొలనులు ఉన్నాయంటారు. గుర్తించినవి మాత్రం ఆరేడే! చీకటి గుహలో ఉన్నా.. కొలనుల్లోని నీరు స్వచ్ఛరేగా ఉండటం విశేషం. కొలను అడుగు భాగం కనిపించేంత పారదర్శకంగా నీళ్లుంటాయి. చీకటి మల్లయ్య స్వామి గుడి బిలంలోనే ఉంటుంది. కొలనులో స్నానం ఆచరించి మల్లయ్యస్వామిని దర్శించుకుంటారు భక్తులు. ఆధ్యాత్మిక యాత్ర మాత్రమే కాదు ఇది. విచిత్రమైన బిలం.. అందులో సొరంగాలు.. పర్యాటకులను ఆశ్చర్యపరుస్తాయి. కొన్ని సొరంగాలు శ్రీశైలం, అమరావతి, తిరుపతి, అహోబిలం, చేజర్లకు దారితీస్తాయని చెబుతారు. శాలివాహన రాజుల కాలంలో గుత్తికొండ బిలం బాగా వెలుగులోకి వచ్చింది. ఈ క్షేత్రాన్ని దక్షిణకాశీగా పిలిచేవారు.

కొండపై అమ్మవారి ఆలయంతో పాటు భరతమాత గుడి ఉంది. పల్నాటి యుద్ధం తర్వాత బ్రహ్మనాయుడు ఈ బిలంలోనే తపస్సు చేసి దేవుడిలో ఐక్యమయ్యాడని స్థానిక కథనం. బిలంలోని ఓ సొరంగానికి బ్రహ్మనాయుడి పేరు పెట్టారు. ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి, శివరాత్రి సందర్భంగా గుత్తికొండకు భక్తులు భారీగా తరలి వస్తారు.

చేరుకునేదిలా..

గుంటూరు నుంచి పిడుగురాళ్లకు వెళ్లాలి. అక్కడి నుంచి జానపాడు, జూలకల్లు మీదుగా గుత్తికొండ బిలం (20 కి.మీ.) చేరుకోవాలి.

# పశ్చిమ కనుమల్లో ఆకుపచ్చ స్వర్గం

అడవి.. మానవ మూలాల్ని మరిచి పోకుండా దాచుకున్న మార్మిక ప్రపంచం. అందు లోకి అడుగు పెడితే.. మానవుల నుంచి మనుషులుగా మారాక.. మరిచిపోయిన ఆ ఆదిమ బంధం మళ్లీ గుర్తుకొస్తుంది. కేరళలోని వయనాడ్‌లో నాలుగు రోజులు అరణ్యవాసం చేస్తే.. ఆ అద్భుత అనుభవం మన సొంతమవుతుంది. అడవుల్లోని ఆకుపచ్చ పరవశం, ప్రకృతి సౌందర్యం, జల గలగలలు, పక్షుల కిలకిలలు.. మలబార్ రుచులు.. మైమరపిస్తాయి. పర్యాటక ప్రియుల కోసం.. వయనాడ్ టూరిజం ఆర్గనైజేషన్ ఏటా మాన్‌సూన్ కార్నివాల్ స్ప్లాష్‌ను నిర్వహిస్తోంది. 'ఆంధ్రజ్యోతి'తో పాటు పలు పత్రికల ప్రతినిధులను అందుకు ఆహ్వానించింది. ఈ బృందం వయనాడ్ ప్రాంతంలోని పలు పర్యాటక ప్రదేశాలను తిలకించింది.. నగరంలో బతుకుతుంటే అడవిలో బతుకుతున్నట్లే ఉంటుంది. అదే, నిజమైన అడవిలోకి వెళితే మనలోకి మనం ప్రయాణించిన అనుభూతి కలుగుతుంది. రెండు చోట్లా మనిషి ఏకాకే..! కిక్కిరిసిన జనారణ్యంలోని ఒంటరితనానికీ, ఆకుపచ్చ అరణ్యంలోని ఏకాంతానికీ – బతకడానికీ, జీవించడానికీ ఉన్నంత వ్యత్యాసం కనిపిస్తుంది. ఒకటి.. మనల్ని మనకు కాకుండా చేస్తే, మరొకటి.. మనల్ని మనకు మళ్లీ తిరిగి అప్పగిస్తుంది. అడవి.. ఒక అరోమా థెరపీ! మానసిక ఒత్తిళ్లను కడిగేసి.. కొత్త జీవశక్తిని నింపే ప్రకృతి చికిత్స. ఉత్తర కేరళలోని పశ్చిమ కనుమల్లో పరుచుకున్న ఆకుపచ్చ స్వర్గం 'వయనాడ్' అడవుల్లో విహరించినప్పుడు కలిగిన మధురానుభూతి ఇది. తిరువనంతపురం, అలప్పీ, కొట్టాయం, ఎర్నాకుళం వంటి దక్షిణ కేరళ ప్రాంతాలకు తెలుగువాళ్లు ఎక్కువగా వెళుతుంటారు కానీ, ఉత్తర కేరళను తక్కువ మందే సందర్శిస్తుంటారు. కర్ణాటక, తమిళనాడులకు దగ్గరగా ఉంటుంది కాబట్టి.. ఆ రాష్ట్రాలకు పర్యాటకుల తాకిడి ఎక్కువ. వయనాడ్, కోజికోడ్, మలప్పురం వంటివన్నీ ఉత్తర భాగంలోని పర్యటక ప్రదేశాలు. వీటిలో వయనాడ్ ఎంతో ప్రత్యేకమైనది. ఎటుచూసినా దట్టమైన అడవులు, కొండలు, లోయలు, నదులు, జలపాతాలు, వన్యప్రాణులు, కాఫీ, తేయాకు, మసాలా దినుసుల తోటలు, వక్క చెట్లు, ఆయుర్వేద పంచకర్మ చికిత్స కేంద్రాలు, విలాసవంతమైన రిసార్టులు.. కనువిందు చేస్తాయి. కోజికోడ్ నుంచి 76 కి.మీ. వెళితే.. ఈ ప్రాంతం వస్తుంది. కాలికట్ ఎయిర్‌పోర్టు నుంచి మూడున్నర గంటలు ప్రయాణిస్తే.. ఇక్కడికి చేరుకోవచ్చు. వయనాడ్ పర్వతాలు తమిళనాడులోని మధుమలై, కర్ణాటకలోని బందీపూర్‌ల మీదుగా విస్తరించాయి. మైసూర్, కూర్గ్, ఊటి, బెంగళూరులకు వెళ్లినప్పుడు.. వయనాడ్‌ను సందర్శించవచ్చు.

**యడక్కల్ కేవ్..** ప్రపంచ వారసత్వ సంపదల్లో ఒకటి. వయనాడ్ జిల్లాలోని కల్‌పెట్టా నుంచి పాతిక కిలోమీటర్ల దూరం. సముద్ర మట్టానికి 1200 మీటర్ల ఎత్తులో ఉంటుందీ గుహ. కొండ మీద నాలుగు పెద్ద గుండ్లతో గూడులా ఏర్పడిన ప్రకృతి మాయాజాలం. క్రీ.పూ.ఆరువేల ఏళ్ల క్రితం గిరిజనులకు ఆవాసంగా ఉండేదని చరిత్రకారులు చెబుతున్నారు. గుహ లోపలున్న రాళ్లపై చెక్కిన కుడ్యచిత్రాలు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. జంతువులు, పక్షులు, చక్రాల బండ్లు, అంకెలు, అక్షరాలను రాళ్లపై పొదిగారు. తలపై కిరీటం పెట్టుకున్న ఆదివాసీ నాయకుడి చిత్రం ఉంది. ఈ గుహను 1890లో మలబార్ జిల్లాలో పనిచేసిన పోలీసు అధికారి ఎఫ్.ఫాసెట్ కనుక్కున్నారు. అప్పట్లో ఆయన ఇండియన్ యాంటిక్వరీ అనే జర్నల్‌లో పరిశోధనాత్మక కథనం రాయడంతో వెలుగులోకి వచ్చింది. పర్వతారోహకులు, చరిత్ర ఔత్సాహికులకు ఎంతో నచ్చే ప్రదేశం ఇది. అయితే గుహపైకి చేరుకోవాలంటే కాస్త ప్రయాస పడాలి. గుహపైకి వెళ్లిన తరువాత కింద కనిపించే కొండలు, పచ్చదనం మన అలసటను మాయం చేస్తాయి.

**వైతిరి..** ఇదొక పట్టణం. కొండలు, అడవులు, జలపాతాలు, రిసార్టులకు పెట్టింది పేరు. వైతిరి నుంచి మూడు కిలోమీటర్లు వెళితే.. పోకొట్ అనే నాచురల్ లేక్‌కు చేరుకోవచ్చు. ప్రశాంతమైన వాతావరణం ఉంటుందిక్కడ. బోటు ఎక్కి సరస్సులో విహరించవచ్చు. సమీపంలోని ఆక్వేరియంలో రకరకాల చేపలు చూడ ముచ్చటగా ఉంటాయి. పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక పార్క్ కూడా ఉంది. ఇక్కడి నుంచి సోచిపారా జలపాతానికీ చేరుకోవచ్చు. వైతిరి విలేజ్ స్టార్ హొటల్‌లో విడిది చేస్తే.. చుట్టుపక్కలున్న ప్రదేశాలన్నీ చుట్టేయొచ్చు. మూడు కిలోమీటర్ల నుంచి వంద కిలోమీటర్ల పరిధిలో కనీసం ఇరవై పర్యటక ప్రదేశాలను చూడొచ్చు. వైతిరి పట్టణం వయనాడ్ పర్యటనకు కేంద్రబిందువు.

**బాణాసుర డ్యామ్...** వయనాడ్ జిల్లాలోని కల్‌పెట్టాకు 21 కి.మీ. దూరంలోని బాణాసుర డ్యామ్‌కు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. దీన్ని 1979లో కబినీ నది మీద నిర్మించారు. కేరళను పాలించిన మహాబలి కొడుకు బాణాసుర పేరునే డ్యామ్‌కు పెట్టారు. పచ్చని కొండల మధ్యన చీలిన పాయల్లో ఒదిగి ఉంటుందీ డ్యామ్. మట్టితో కట్టిన అతి పెద్ద డ్యామ్ ఇదే. ఆసియాలో రెండోది. డ్యామ్‌ను తిలకించిన తరువాత శ్రీ అయ్యప్ప మందిర్, శ్రీ నాథ్ మందిర్, నిరూర్ శివ మందిర్ వంటి ఆలయాలను దర్శించవచ్చు. కల్‌పెట్టా మీదుగా వెళ్లే వాళ్లు.. ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని చెంబ్రాపీక్‌కు కూడా వెళ్లొచ్చు. మెప్పడి పట్టణం నుంచి వెళితే చాలా దగ్గర. వయనాడ్ జిల్లాలోనే అత్యంత ఎత్తయిన ప్రదేశం చెంబ్రా. సముద్ర మట్టానికి సుమారు 2,100 మీటర్ల ఎత్తులో ఉంటుంది. పర్వతారోహకులు ఉత్సాహంతో వస్తుంటారిక్కడికి. మెప్పడికి సమీపంలోని మరొక పర్యాటక ప్రదేశం.. సోచిపార జలపాతం. మూడు పాయలుగా అలరించే జలపాతం పర్యాటక అనుభూతిని రెట్టింపు చేస్తుంది.



# పర్యాటక పండుగలు

పండుగలంటే దసరా, దీపావళిలే కాదు.. పండుగలంటే చాలా పండుగలున్నాయి. సాంప్రదాయ పండుగలు కొన్ని సాంస్కృతిక పండుగలు ఇంకొన్ని, పర్యావరణ పండుగలు కొన్నయితే, సాహిత్య పండుగలు ఇంకొన్ని.. ఇలాగే పర్యాటక పండుగలు కూడా జరుగుతాయి. మనకు తెలియని ఆ పండుగలేంటో చూద్దామా..భారతదేశవ్యాప్తంగా నిత్యం ఏదో ఒక సాంస్కృతిక సంగీత పండుగలు జరుగుతూనే ఉంటాయి. కొన్ని మతాలకు సంబంధించినవి అయితే ఇంకొన్ని కులాకు సంబంధించినవి. కొన్ని ప్రాంతాలకు సంబంధించినవి అయితే మరిన్ని వైవిధ్యాలకు సంబంధించినవి. అయితే ఈ ఉత్సవాలు ఉత్సాహాన్ని ఇచ్చేవిగా ఉంటాయి. అందుకోసం విదేశాల నుంచి కూడా వస్తుంటారు. సీజన్లను బట్టి రంగురంగుల అలంకరణలు చేసుకొని ఆకర్షిస్తుంటాయి. ప్రయాణాలను వివరించాలంటే, విశ్లేషించాలంటే అవి చేసి ఉండాలి. ప్రయాణాలు చేసేవాళ్లు తమ జీవితాన్ని సునాయసంగా బతికేస్తారని పలు అధ్యయనాలు వెల్లడించాయి. మానవ జీవితంలో ప్రయాణమనేది అతి ఉత్తేరపరిచే అంశంగా కూడా పలువురు అభిప్రాయపడ్డారు.





**దుంగరి మేళ, మనాలి**

భూతల స్వర్గంగా పిలిచే మనాలిలో ఏడాది మొత్తం ఏదో ఒక ఉత్సవం జరుగుతూనే ఉంటుంది. అక్కడ నిత్యం పర్యాటకుల రద్దీతో పండుగ వాతావరణం కనిపిస్తూనే ఉంటుంది. మరీ ముఖ్యంగా మనాలీలో జరిగే దుంగరి మేళలో సంస్కృతి సంప్రదాయాలు వెల్లివిరుస్తాయి. మంచుకురుస్తుంటే కొండప్రాంతాల్లో ఉండే ప్రజలు అంతా ఏకమై జరిపే ఈ పండుగకు అతిథులు వేల సంఖ్యలో వస్తుంటారు. దుంగరి అడవిలో ఉండే హదింబా అమ్మవారి జాతరకు పర్యాటకులు కిక్కిరిసిపోతారు.



**కొట్టియూర్ ఉత్సవం, కేరళ**

అందమైన అటవీప్రాంతంలో ప్రయాణం చేస్తుంటే రోడ్ల పక్కల ఏనుగులు, జింకలు పరుగెడుతుంటాయి. దట్టమైన అడవిలో ఉండే ప్రశాంతమైన వాతావరణంలో ఒక్కసారిగా గుడిగంటలు మోగుతుంటే భక్తి పారవశ్యంలో మునిగిపోతారు అక్కడికి వెళ్లిన వాళ్లు. బెంగళూరు, మైసూర్ నుంచి వెళ్లే సందర్శకులు ఎక్కువ కనిపిస్తారు. వైశాఖ మహోత్సవంగా పిలువబడే ఈ పండుగ మే నుంచి జూన్ మధ్య కాలం వరకు జరుగుతుంది. సమ్మర్ హాలీడేస్‌లో వెళ్లేవాళ్లు కొట్టియూర్ ఉత్సవాలకు వెళ్తే మరిచిపోలేని మధురానుభూతిని పొందుతారు.

**సమ్మర్ ఫెస్టివల్, ఊటి**

మంచు కొండల మధ్య జరిగే ఊటి సమ్మర్ ఫెస్టివల్ ఎవర్‌గ్రీన్ ప్రకృతి పండుగ. విదేశీయులు, ఊటి చుట్టుపక్కల ఉండే అడవిబిడ్డలు ఈ పండుగలో ఎక్కువ పాల్గొంటారు. అడవుల్లో పండించిన పంటలను అక్కడ అమ్మకానికి ఉంచుతారు. ప్రకృతి ఇచ్చే అరుదైన జాతి పండ్లు, కాయలు, మొక్కలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచుతారు. మే నెల మొత్తం జరిగే ఈ సమ్మర్ ఫెస్టివల్‌లో రోజూ ఏదో ఒక కార్యక్రమం జరుగుతూనే ఉంటుంది.



**పోలో ఫెస్టివల్,లడఖ్**

ఇదొక క్రీడా ఉత్సవం. జూలై 11న ప్రారంభం అయి 17న ముగుస్తుంది. ఆరవ లడఖ్ పోలో ఫెస్టివల్‌లో ఈసారి గుర్రపు పందాలతో పాటు జానపద నృత్య సంగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు, ఆర్చరీ వంటి పోటీలను నిర్వహించనున్నారు. చుట్టూ మంచు పర్వతాలు మధ్యలో ఉన్న చుసోత్ గ్రామంలో ఈ క్రీడా పండుగ జరగనున్నది. మైనస్ డిగ్రీల చలిలో గుర్రాలు పరుగెడుతుంటాయి.





**సాగ దావ, సిక్కిం**

టిబెటియన్ క్యాలెండర్ ప్రకారం నాలుగో నెలలో జరిగే ఈ ప్రకృతి ఉత్సవం ఘనంగా జరుగుతుంది. జూన్ 17న ప్రారంభం కానున్న సాగ దావ ఉత్సవాలను సర్వం సిద్ధం చేస్తున్నారు నిర్వాహకులు. సాఖ్యముని పుట్టిన సందర్భంగా ఈ పండుగను జరుపుతారు. ఈ నెలలో మాంసం తినకుండా జంతువులను చంపకుండా నిష్ఠతో పవిత్రంగా ఉంటారు. కొందరు పావురాలను గాల్లోకి ఎగురవేసి శాంతిని కోరుతారు. ఈ నెలలో ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నిస్తే పాపాలన్నీ పోతాయని వారి నమ్మకం. మొక్కులు ఉన్నవారు రంగు రంగుల బట్టలతో తయారు చేసిన జెండాలను కడతారు.

**సమ్మర్ ఫెస్టివల్, షిమ్లా**

వేసవిలో విరామం కోరుకునే వాళ్లు షిమ్లాకు వెళ్లి తీరాలి. ఎండాకాలంలో అక్కడ జరిగే పలు ఉత్సవాలు దేశం నలుమూలల నుంచి వచ్చే సందర్శకులు ఇక్కడ సేదతీరుతారు. 19వ శతాబ్దం నాటి చర్చిలను చూసి ఇక్కడి ప్రకృతిని ఆస్వాదిస్తారు. ముఖ్యంగా షిమ్లాలో సమ్మర్ ఫెస్టివల్‌లో ప్రదర్శించే ఆహారం ఇంకెక్కడా లభించదు. షిమ్లాలో ఉండే కట్టడాలు, ఎత్తైన కొండలు, జలపాతాలు, ఆలయాలను సందర్శించాలంటే ఒక్కరోజు చాలదు. కేవలం షిమ్లా కాకుండా చుట్టు పక్కల ఉండే దర్శనీయ ప్రాంతాలకు కూడా వెళ్లాల్సి ఉంటుంది.

## ప్రకృతిని వీక్షిస్తూ..అనుభూతిని ఆస్వాదిస్తూ

**రైలు ప్రయాణమంటే తొందరగా, సురక్షితంగా గమ్యానికి చేర్చే మార్గం ఒక్కటే కాదు. దూర ప్రయాణాలను దగ్గరే చేసే మార్గం అంతకన్నా కాదు. ప్రయాణం చేస్తూ ప్రకృతిని వీక్షిస్తూ అనుభూతిని ఆస్వాదిస్తూ ఈ రైలు మార్గాల గురించి చదివేయండి. క్షణాలు నిమిషాలుగా, నిమిషాలు గంటలుగా, గంటలు రోజులుగా, రోజులు నెలలుగా క్యాలెండర్లు మారుతున్నాయి. కన్నుమూసి తెరిచేలోపు గడిచిపోవాల్సినవి గడిచిపోయి జ్ఞాపకాలుగా మిగిలిపోతున్నాయి. మనం గడిపిన క్షణాలు గొప్పగా ఉండాలంటే ప్రయాణాలు చేయాలి. గొప్ప ప్రయాణాలు గొప్ప జ్ఞాపకాలను ఇస్తాయి. ప్రయాణాలను, ప్రకృతిని ఇష్టపడే వాళ్లు జీవితంలో ఒక్కసారైనా ఇలాంటి రైలు ప్రయాణం చేయాలి. ప్రపంచంలో ఉన్న అత్యద్భుతమైన రైలు ప్రయాణాలివి..**



**గ్లేసియర్ ఎక్స్‌ప్రెస్**

జెర్మాట్, సెయింట్ మోరిట్జ్ ప్రాంతాలను కలుపుతూ స్విట్జర్లాండ్‌లో నిర్మించిన అత్యంత అందమైన రైలు వంతెన మార్గమిది. దీనికి గ్లేసియర్ ఎక్స్‌ప్రెస్ వే అని పేరు పెట్టారు. ఈ దృశ్యాన్ని చూడడం కంటే వెళ్లి అక్కడ ప్రయాణిస్తే బాగుంటుంది. ఈ దారి గుండా ప్రయాణిస్తే 91 సొరంగాలుంటాయి. 291 వంతెనలుంటాయి. గ్లేసియర్ ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న ఈ వంతెన సముద్ర మట్టానికి 6706 ఫీట్ల ఎత్తు ఉంటుంది. ఆరు పిల్లర్లు కలిగిన ఈ వంతెన చూడగానే ఆకర్షిస్తుంది.

**ది హాన్**

ప్రపంచంలో ఎక్కడా చూడని ప్రకృతి అందాలు ఈ ప్రయాణంలో చూడొచ్చు. ఆస్ట్రేలియాలోని ది హాన్ ట్రావెల్స్ నుంచి డార్విన్, ఆడిలైడ్ వరకు ప్రయాణించవచ్చు. ఇది సుమారు రెండు వేల కిలోమీటర్ల దూరం ఉంటుంది. సారవంతమైన ఎర్రనేలల మీద కనుచూపు మేర ఉండే మైదానాలలో నుంచి ఈ ప్రయాణం సాగుతుంది.



**ఫస్ట్ ప్యాసేజ్**

పర్వాతారోహకులు ఎక్కువగా వెళ్లే మార్గమిది. ఫస్ట్ ప్యాసేజ్ ఆఫ్ వెస్ట్ అని ఈ మార్గాన్ని పిలుస్తారు. ఎత్తైన పర్వతాలు, చుట్టూ పొగమంచు, కనుచూపు మేర కనిపించే అందమైన ప్రకృతి అందాల నెలవిది. సౌత్ బ్రిటిష్ కొలంబియా వాంకోవర్ మధ్య ఉన్న ఈ రైలు మార్గం అత్యంత సుందరమైన రైలు మార్గాలలో ఒకటి. నగరాలు, గ్రామాలతో సంబంధం లేకుండా దట్టమైన అడవుల మధ్య నుంచి రైలు వెళు_ంది. మధ్యలో కనిపించే సరస్సులు, చీకట్లో తారసపడే నగరాలు ఊహకు అందని అనుభవాన్నిస్తాయి.

**ట్రాన్స్- సైబీరియన్**

ప్రపంచంలోనే అతి పొడవైన రైలు మార్గాల్లో ఇది ఒకటి. రష్యా రాజధాని మాస్కో పశ్చిమాన ఉనన టెర్మినస్ వద్ద ప్రారంభమై, ట్రాన్స్ – సైబీరియరన్ ఉరల్ పర్వతాలపై నుంచి సైబీరియన్ అడవులను దాటుతూ వెళ్లాల్సి ప్రయాణమిది. ఇది రష్యా మొత్తం విస్తరించి ఉంటుంది. ప్రారంభమైన చోటు నుంచి గమ్యానికి చేరడానికి ఎనిమిది రోజులు పడుతుంది. ప్రపంచంలో అతిపెద్ద మంచి నీటి సరస్సు అయిన బైకాల్ మీది నుంచి ఈ కూడా ప్రయాణం సాగుతుంది.



**ట్రాన్స్ ఆల్పైన్**

న్యూజీలాండ్‌లని సౌత్ ఐలాండ్స్, క్రైస్టర్చ్ నుంచి ట్రాన్స్ ఆల్పైన్‌ల వరకు వెళ్లే రైలు ప్రయాణం అరణ్యాల మీదుగా వెళ్తుంది. ఉష్ణమండలాలు, వర్షారణ్యాలనుకూడా చూడొచ్చు. స్కాట్లాండ్‌లోని అతిపెద్ద నగరమైన గ్లాస్గో పట్టణంలో ఉన్న రైలు మార్గం ప్రయాణీకులను ఆకట్టుకుంటుంది. మరిచిపోలేని మధురానుభూతుల్ని మిగుల్చుతుంది. హ్యారీపోర్టర్, పలు వెబ్‌సిరీస్‌లలో ఈ లొకేషన్లను ఎక్కువ చూపించారు. ఇక సౌతాఫ్రికాలోని నమీబియా సఫారీ రైలు ప్రయాణం గురించి వర్ణించలేము. రెండు వేల కిలోమీటర్లు దట్టమైన అడవుల్లో , చుట్టుపక్కల జట్టువులు, నీటి కొలనులతో దర్శనమిస్తుంది. నదులు, జలపాతాలను దాటుకుంటూ వెళ్లే ఈ ప్రయాణం బాగుంటుంది. ఇలాంటివి మొత్తం ప్రపంచవ్యాప్తంగా పదకొండు ఉన్నాయి. జీవితంలో ఒక్కసారైనా ఇలాంటి ప్రయాణాలు చేసి ఆ అనుభూతిని పొందాలి.

